అయోధ్యను వీడి వెళ్లొద్దు..



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - సోమవారం 22 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 167 | పేజీలు:12 | వెల రూ.5

మైనర్‌తో పెళ్లి.. పట్టించిన ప్రీ-వెడ్డింగ్ షూట్!



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

# యోగా.. ఐక్యతకు మూలం

## వయసుతోపాటు ఆరోగ్యమూ ముఖ్యమే.. యోగా సాధనతో మంచి ఫలితాలు
## కోల్‌కతాలోని రెడ్‌రోడ్‌లో 35వేల మందితో యోగా.. : ప్రధాని నరేంద్రమోడీ





**కోల్‌కతా, జూన్ 21:** యోగా ప్రపంచం మొత్తాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. 'వయసుతోపాటు ఆరోగ్యానికి యోగా' ఇతివృత్తంతో కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో 35 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాతో ప్రపంచ వ్యాప్తంగా ఒకరికొకరు కలిసినట్లయిందన్నారు. కోల్‌కతాలో వేర్వేరు చోట్ల 10 లక్షల మంది యోగాసనాలు వేసేలా ఏర్పాట్లు చేశారు.

"జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇవాళ యోగా కార్యక్రమాలతో దేశం మొత్తం చైతన్యంతో నిండిపోయింది. ఇది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు. కేవలం కొన్ని వయసుల వారికే పరిమితం కాలేదు. ఇది మానవ స్ఫూర్తికి నిదర్శనం. ప్రపంచ వ్యాప్తంగా ఒకరికొకరిని చేరువ చేస్తుంది. అందర్నీ ఏకం చేస్తుంది. జీవనం మరింత సమతులంగా సాగేలా చేస్తుంది. ఏం చేయాలో, ఏం చేయకూడదో ...మిగతా 2లో

## ఒలింపిక్స్ లక్ష్యంగా
# స్పోర్ట్స్ యూనివర్సిటీ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మనంప్రతినిధి :** 'గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవకాశాలు లేక మరుగున పడిపోతున్న ప్రతిభాపాటవాలను (ఆణిముత్యాలను) వెలికితీసి, వారికి సరైన శిక్షణనిచ్చి ప్రపంచానికి పరిచయం చేయడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. భవిష్యత్తులో ఒలింపిక్స్ బరిలో తెలంగాణ క్రీడాకారులు



పతకాలు సాధించేలా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సరికొత్త 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని త్వరలోనే ఏర్పాటు చేయబోతున్నాం' అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

ఉప్పల్ స్టేడియం వేదికగా అత్యంత వైభవంగా ప్రారంభమైన 'టీజీ 20 క్రికెట్ లీగ్' మెగా టోర్నమెంట్కు డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తుకు ఈ లీగ్ ఒక బలమైన పునాది కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

'గతంలో క్రికెట్ అంటే కేవలం నగరాలకే పరిమితమనే భావన ఉండేది. కానీ, ఆ పరిస్థితులను మారుస్తూ మొదటిసారిగా మా ప్రభుత్వం ప్రతి జిల్లా నుంచి క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించింది. జిల్లాల వారీగా జట్లను (టీమ్‌లను) ఎంపిక చేసి గ్రామీణ యువతకు ఈ మెగా వేదికను కల్పించాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని

# ఢిల్లీలో సీఎం రేవంత్

- ఎస్బీఐ చైర్మన్‌పై ప్రధాని, కేంద్ర మంత్రి, ఆర్బీఐకి ఫిర్యాదు
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తోనూ భేటీ ?
- ఐఆర్ఎఫ్‌సి నిధుల విడుదలపై చర్చ



**హైదరాబాద్, జూన్ 21 ( మనం బ్యూరో ) :** రాయదుర్గంలో భూముల వేలం వివాదం రాజకీయ రంగు పులుము కుంటోంది. ప్రభుత్వం, ఎస్బీఐ మధ్య భూముల వివాదం నెల కొన్న నేపథ్యంలో ఈ అంశాన్ని ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని రాజకీయంగా దెబ్బతీయడానికి ఉపయోగించుకునే అవకాశం ఉందన్న భావనలో ప్రభుత్వం ఉంది. దీంతో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఎస్బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టిపై ప్రధాన మంత్రి మోడీ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ అంశంపై సోమవారం సీఎం రేవంత్ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు కలిసే అవకాశం ఉంది గతంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను తాకట్టు పెట్టడాన్ని అడ్డుకున్న మాదిరిగానే రాయదుర్గంలోని భూముల బహిరంగ వేలాన్ని వివాదాస్పదం చేయడం వెనక ...మిగతా 2లో



తెలంగాణ నుంచి రాజ్యసభ సీటు తీసుకోను

- బీజేపీ ఈసీ లాలూచీపడి నా నామినేషన్ తిరస్కరించారు
- ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్

2

## ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు...
# రాహుల్‌తో సమావేశం ఏర్పాటు చేయండి



### సీఎం రేవంత్‌కు బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్‌రావు లేఖ

**హైదరాబాద్, జూన్ 21, (మనం బ్యూరో) :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేన్నరేళ్లు దాటినా ఆరు గ్యారంటీల అమలులో ఆ పార్టీ దారుణంగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆరోపించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో నెరవేరని కాంగ్రెస్ గ్యారంటీలపై ...మిగతా 2లో

# డ్రగ్స్ అడ్డాపై బుల్డోజర్‌తో ఎటాక్



- గంజాయి విక్రయ కేంద్రం నేల మట్టం
- లేడీ డాన్ నీతూభాయి పరార్
- నిందితుల కోసం ఈగల్ టీం వేట

**హైదరాబాద్,జూన్ 21(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** నేర చరిత్ర కలిగిన వారి భవనాల కూల్చివేస్తున్న యూపీ ఫార్ములాను తెలంగాణలో ఈగల్ పోలీసులు అవలంభిస్తున్నారు. యువత జీవితాలతో చెలగాట మాడుతున్న డ్రగ్స్ ముఠాల ఇళ్లు, వ్యాపార కేంద్రాలపై ఈగల్ టీం బుల్డోజర్‌లతో ఎటాక్ ...మిగతా 2లో

## 'సర్'తో మా ఓట్లు
# గల్లంతవుతయ్

- 15 లక్షల మంది గల్ఫ్ కార్మికుల ఆందోళన
- మంత్రి పొన్నంతో కాంగ్రెస్ గల్ఫ్ ప్రతినిధుల భేటీ
- స్వయంగా పర్యటించాలని మంత్రి నిర్ణయం



**హైదరాబాద్, జూన్ 21, (మనం బ్యూరో) :** 'సర్'తో మా ఓట్లు గల్లంతవుతాయని రాష్ట్రం నుంచి వెళ్లి గల్ఫ్‌లో స్థిరపడ్డ కార్మికులు ఆందోళన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానంతో 15 లక్షల మంది ఓటు హక్కు కోల్పోతారని పేర్కొంటున్నారు. ఈమేరకు ఆదివారం మంత్రి పొన్నంతో హుస్నాబాద్ లోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ గల్ఫ్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఎన్నారైల ఓటు హక్కుల పరిరక్షణకై మంత్రితో చర్చించారు. 'సర్' కారణంగా విదేశాల్లో నివసిస్తున్నగల్ఫ్ కార్మికులు ఎన్నారైల పేర్లు ఓటర్ల జాబితా నుంచి గల్లంతవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆన్‌లైన్ జూమ్ సమావేశాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ ప్రతిపాదనలను మంత్రి పొన్నం సానుకూలంగా స్వీకరించారనీ, తెలంగాణకు చెందిన ప్రవాస భారతీయులు, గల్ఫ్ కార్మికులతో ప్రత్యక్షంగా మమేకమయ్యేందుకు గల్ఫ్ దేశాలలో పర్యటించాలని మంత్రిని ఆహ్వానించారు.దీంతో అక్కడ స్వయంగా పర్యటించాలని మంత్రి సుముఖత వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాస తెలంగాణ కార్మికుల పాత్ర ఎంతో ఉందనీ, వారి సమస్యల పరిష్కారం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

# నకిలీ విత్తనాలపై నిఘా

- నాసిరకం ఎరువు,విత్తనాల సరఫరాపై స్పెషల్ డ్రైవ్
- ఏపీ,కర్ణాటక, మహారాష్ట్ర కేంద్రంగా దందా
- రాష్ట్ర సరిహద్దుల్లో జాయింట్ టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
- సీడ్ ఆర్గనైజర్‌లపై నజర్
- రైతు విత్తన మేళాలలో అవగాహన



**హైదరాబాద్, జూన్ 21(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రంలో నకిలీవిత్తనాల మాఫియాపై పోలీసు బాసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. నకిలీ విత్తనాలు, నాసిరకం పురుగు మందుల తరలింపుపై రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో పోలీసుల నేతృత్వంలో వ్యవసాయ శాఖ, విత్తన సంస్థ అధికారులతో కూడిన జాయింట్ టాస్క్ ఫోర్స్ చెక్ పోస్టులలో ముమ్మర తనిఖీలు చేపడుతోంది. రైతులను మోసగించే విత్తన కంపెనీలు, విక్రయ దారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు జాయింట్ టాస్క్ ఫోర్స్ రంగంలోకి దింపినట్లు పోలీసు బాసులు చెబుతున్నారు. నకిలీ విత్తనాల, పురుగు మందుల కేసులో నిందితులపై సీడ్స్ యాక్ట్, ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ యాక్ట్, భారతీయ న్యాయ సంహిత కింద కేసులు నమోదు చేస్తామని జాయింట్ టాస్క్ ఫోర్స్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

రాష్ట్రంలో నకిలీ విత్తనాల దందాకు చెక్ పెట్టేందుకు జాయింట్ టాస్క్ ఫోర్స్ అధికారులు సరిహద్దులలోని చెక్‌పోస్టులలో నిఘా అధికం చేశారు. ముఖ్యంగా ఏపీ, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటకల నుంచి నకిలీ విత్తనాలను తరలిస్తున్నారనే సమాచారం మేరకు రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుల వద్ద అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, ...మిగతా 2లో

## ఒకే రోజు మూడు యుద్ధనౌకలు..
# భారత సముద్రశక్తికి చిహ్నం..!

- జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ

**కోల్‌కతా, జూన్ 21:** భారత నౌకాదళాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఐఎన్ఎస్ దుణగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు యుద్ధ నౌకలను జాతికి అంకితం చేశారు. శత్రువుల రహస్య ఎత్తుగడలను చిత్తు చేసేలా అత్యాధునిక దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన వీటిని కోల్కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్టులో ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రక్షణ రంగంలో స్వావలంబన కోసం భారత్ చేస్తున్న కృషికి ఈ నౌకలు నిదర్శనమని ప్రధాని మోడీ పేర్కొన్నారు. భారతీయ పరిశ్రమల ప్రతిభ, ఇంజినీర్ల నైపుణ్యం, కార్మికుల కఠోర శ్రమ వల్లే వీటి నిర్మాణం సాధ్యమయ్యిందన్నారు.

### ఐఎన్ఎస్ దుణగిరి

భారత నేవీలో విశిష్ట సేవలు అందించిన నీలగిరి శ్రేణిగా ఐఎన్ఎస్ దుణగిరి యుద్ధనౌకను ఎంతో ప్రత్యేకంగా నిర్మించారు. ప్రాజెక్టు 17ఏ పేరిట నిర్మించిన నౌకను 2022 జులై 15న జలప్రవేశం చేయించారు. దీని పొడవు 149 మీటర్లు. అడ్వాన్స్‌డ్ గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్‌గా తీర్చిదిద్దారు. రాడార్, సెన్సర్లతో బహుముఖ పాత్ర పోషించేందుకు అనువుగా నిర్మించిన ఈ నౌక బ్రహ్మోస్ యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులను కలిగి ఉంది.




### ఐఎన్ఎస్ సంశోధక్

భారత నౌకాదళానికి సముద్ర భౌగోళిక, (హైడ్రోగ్రాఫిక్ సర్వే) సరిహద్దు జలాలు, సమగ్ర కొలతలు, కచ్చితత్వ పరిమాణం వంటి అంశాలపై నివేదికల తయారీలో సామర్థ్యం పెంచేందుకు దోహదపడేలా ఐఎన్ఎస్ సంశోధక్ నౌకను నిర్మించారు. ఇది 110 మీటర్ల పొడవుతో ఉంటుంది. 2023 జూన్ 13న జలప్రవేశం చేయించారు. పోర్టులు, లోతైన సముద్ర మార్గాలు, మారిటైం పరిధిలో ...మిగతా 2లో

# హర్మ్యూజ్‌లో టోల్ వసూల్ చేస్తాం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, జూన్ 21:** హర్మ్యూజ్ జలసంధిని ఇరాన్ మళ్లీ మూసివేయడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 60రోజుల్లో ఇరాన్‌తో తుది ఒప్పందం కుదరకపోతే జలసంధి మార్గంలో టోల్ విధిస్తామని హెచ్చరించారు. పశ్చిమాసియా దేశాలకు



యూఎస్ అందించిన రక్షణ సేవలకుగానూ ఆ డబ్బును తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఇటీవల కుదిరిన ఒప్పందం ప్రకారం 60రోజుల పాటు టోల్-రహిత ప్రయాణం ఉండాలన్నారు. మరోవైపు హర్మ్యూజ్ ప్రస్తుతం ఇరాన్ నియంత్రణలో లేదని.. రవాణా నిరంతరాయంగా కొనసాగుతోందని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ వెల్లడించారు. పరిస్థితి ఇలాగే ఉండేలా అమెరికా దళాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. శనివారం 17మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురుతో 55 వాణిజ్య నౌకలు జలసంధిని దాటినట్లు తెలిపారు. కాగా, ఇరాన్‌తో అణు చర్చల నిమిత్తం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం స్విడ్జర్లాండ్‌కు బయల్దేరింది.

### లెబనాన్‌పై కొనసాగుతున్న దాడులు

ఓ వైపు అమెరికా-ఇరాన్ ప్రతినిధుల మధ్య స్విడ్జర్లాండ్‌లో చర్చలు మొదలుకానుండగా.. మరో వైపు ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తోంది. సరిహద్దుల వద్ద పలువురు ఇజ్రాయెల్ ప్రజలు పాలస్తీనీయులపై దాడులు చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కాల్పుల ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఎదుర్కోవడానికి తాము ఎదురు దాడులు చేయాల్సి వస్తోందని హెజ్బొల్లా ఆరోపించింది. శనివారం లెబనాన్లోని 100కు పైగా లక్ష్యాలపై వైమానిక దాడులు చేయడంతో పలువురు ప్రాణాలు కోల్పోయారని.. అనేక పౌర నివాసాలు ధ్వంసమయ్యాయని తెలిపింది.

## ఎట్టకేలకు మొదలైన
# చర్చలు..



- మరోవైపు ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

**స్విడ్జర్లాండ్, జూన్ 21:** అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధం శాశ్వత ముగింపు కోసం స్విడ్జర్లాండ్ వేదికగా ఎట్టకేలకు చర్చలు మొదలయ్యాయి. అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ తరఫున పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ బృందాలు ఇందులో పాల్గొన్నాయి. పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులు మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. అదే సమయంలో ఇరాన్కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. లెబనాన్‌లో సమస్యలు సృష్టించకుండా అక్కడి 'ప్రాక్సీ'లను వెంటనే నిలువరించాలని సూచించారు. లేనిపక్షంలో ఇరాన్‌పై మరోసారి ...మిగతా 2లో

# అయోధ్యను వీడి వెళ్లొద్దు..

## ట్రస్ట్, ఆలయ సిబ్బందికి సిట్ ఆదేశాలు

**అయోధ్య, జూన్ 21:** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో కానుకలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన విచారణను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అయోధ్యను వీడి వెళ్లొద్దని ఆలయ సిబ్బందిని, ట్రస్ట్ నిర్వాహకులను ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ట్రస్ట్ సభ్యులు తదితరులను విచారించిన వివరాలు, ఇతర అంశాలతో కూడిన నివేదికలను దర్యాప్తు అధికారులు డిజిటల్ రూపంలో భద్రపర్చుతున్నారని, అదే సమయంలో రోజువారీగా సీఎం కార్యాలయానికి పంపుతున్నట్లు చెప్పాయి.

రామమందిర ట్రస్ట్ చేపట్టిన భూ కొనుగోళ్లు, ఆలయ నిర్మాణ సామగ్రి సేకరణ అంశాలపైనా సిట్ దృష్టి సారించినట్లు సమాచారం. మార్కెట్ ధర కంటే ఎక్కువ రేటుకు భూములను ట్రస్ట్ కొనుగోలు చేసిందనే ఆరోపణల నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆలయంలోని నిఘా వ్యవస్థలు, భద్రత నిర్వహణను సిట్ బృందం ఇప్పటికే పరిశీలించింది. అయితే, 45 రోజుల ఫుటేజీ మాత్రమే అందుబాటులో ఉండటం సవాల్‌గా మారింది. సీసీటీవీ ఫుటేజీలను తారుమారు చేశారనే ఆధారాలను కూడా అధికారులు గుర్తించారని.. డిలీట్ చేసిన, మార్చిన డేటాను తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

అయోధ్య రామాలయానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం, ఆర్థిక అవకతవకల ఆరోపణలపై యూపీ ప్రభుత్వం ఈ నెల 13న సిట్ ఏర్పాటు చేసింది. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ఆలయ సిబ్బంది తదితరులను దర్యాప్తు అధికారులు ఇటీవల ప్రశ్నించారు. విరాళాల మొత్తాలను గురించి, ఆలయంలో వాటి నిర్వహణ కోసం చేసిన ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. విరాళాలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆలయ సిబ్బంది వాంగ్మూలాల్లో అనేక వైరుధ్యాలు ఉన్నట్లు గుర్తించారు.

# మైనర్‌తో పెళ్లి.. పట్టించిన ప్రీ-వెడ్డింగ్ షూట్!

**ముంబయి, జూన్ 21:** ఇటీవలి కాలంలో వివాహానికి ముందు కాబోయే వధూవరులు ఫొటో షూట్లు, రీల్స్ తీసుకోవడం వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేసే ట్రెండ్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఓ 15 ఏళ్ల బాలిక వివాహానికి సంబంధించిన ప్రీ-వెడ్డింగ్ షూట్ సామాజిక మాధ్యమాల్లో కనిపించడంతో అప్రమత్తమైన అధికారులు.. వివాహాన్ని అడ్డుకున్నారు.

బీడ్ జిల్లా గెవరాయి మండలానికి చెందిన 23 ఏళ్ల యువకుడికి 15 ఏళ్ల అమ్మాయితో ఇటీవల వివాహం నిశ్చయమైంది. వీరు ప్రీ-వెడ్డింగ్ షూట్ కూడా పూర్తి చేసుకున్నారు. అయితే, సోషల్ మీడియాలో వీటికి సంబంధించిన ఫొటోలు కనిపించడం జిల్లా కలెక్టర్ వివేక్ జాన్సన్ దృష్టికి వచ్చింది. తక్షణమే స్పందించిన ఆయన.. మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. రంగంలోకి దిగిన అధికారులు మైనర్ అమ్మాయి గ్రామానికి చేరుకున్నారు.

అయితే, అమ్మాయి చేతిపై వరుడి పేరుతో ఉన్న గోరింటాకు తప్ప వివాహం జరిగినట్లు ఎక్కడా ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో వివాహం జరగలేదని అధికారులు నిర్ధరించుకున్నారు. పెళ్లికి ముందు తీసుకున్న ఫొటో షూట్ను పరిగణనలోకి తీసుకొని, తదుపరి ఏర్పాట్లను అడ్డుకున్నారు. మైనర్ బాలికను సంరక్షణలోకి తీసుకొని, దర్యాప్తు చేపట్టారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

# యోగా.. ఐక్యతకు మూలం



(మొదటి పేజీ తరువాయి)

నేర్పుతుంది. శక్తిమంతంగా, సౌకర్యవంతంగా ఉంచుతుంది. వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతుంది. 20ఏళ్ల కంటే 40 ఏళ్ల వయసులో మరింత దృఢంగా ఉండాలి. ఒత్తిడి రహిత జీవితానికి యోగా దోహదం చేస్తుంది. మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తం. అందుకే యోగాను కొన్ని సందర్భాలకే పరిమితం చేయకుండా.. నిత్యం సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. మరింత మెరుగైన ప్రపంచం కోసం యోగా అవసరం'' అని మోదీ అన్నారు.

## ఒకే రోజు మూడు యుద్ధనౌకలు..

# భారత సముద్రశక్తికి చిహ్నం..!




(మొదటి పేజీ తరువాయి)

సముద్ర అధ్యయనం, నావిగేషన్ విధుల కోసం ప్రత్యేక హెలికాప్టర్, విపత్కర పరిస్థితుల్లో మానవీయ సాయానికి, రక్షణ చర్యలు చేపట్టేందుకు అనువుగా సంశోధక్ నిర్మాణం చేశారు.

**ఐఎన్ఎస్ అగ్రయ్**

కోల్కతాలోని గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డింగ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ)లో ఐఎన్ఎస్ అగ్రయ్ నౌకను యాంటీ సబ్మెరైన్ షాలో వాటర్ క్రాఫ్ట్‌గా నిర్మించారు. ఇది 77.6 మీటర్ల పొడవుంటుంది. 2024 మార్చి 13న జలప్రవేశం చేయించారు. తీర జలాల్లో ఆపరేషనల్ విధులకు అనువుగా ఈ యుద్ధనౌకను డిజైన్ చేశారు. ఉపరితల నిఘా, అన్వేషణ, శత్రువులపై దాడికి స్వీయ ఎయిర్‌క్రాఫ్ట్‌లతో సమన్వయం చేసుకునేలా 88 శాతం ఆధునిక స్వీయ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించారు. 30ఎంఎం నేవల్ సర్ఫేస్ గన్, వాటర్ జెట్లతో డీజిల్ యంత్రాలను అనుసంధానం చేయడం దీని ప్రత్యేకత.

# ఢిల్లీలో సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ కోణం ఉందని రాష్ట్ర ప్రభుత్వం బలంగా భావిస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎస్బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి కావడం వల్ల స్థానిక రాజకీయాలతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. 16 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన రాయదుర్గం భూములను ఎలాంటి అభివృద్ధి చేయని ఎస్బీఐ ఇప్పుడు అదే స్థలం కావాలని కోర్టును ఆశ్రయించడం వెనుక రాజకీయాలే కారణమని భావిస్తోంది. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే 2.50 ఎకరాలలో నిర్మాణాలు చేపట్టవచ్చనీ, ఆ భూములు కేటాయించినా సకాలంలో పనులు చేపట్టకపోతే వాటిని కూడా రద్దు చేసే అవకాశం ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

కాగా, మెట్రో ఫేజ్-2కు ఐఆర్ఎఫ్‌సి నిధుల విడుదలకు సంబంధించి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తోనూ సీఎం రేవంత్ భేటీ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల కారణంగా మెట్రో రెండో దశ విస్తరణకు నిధుల విడుదలకు ఐఆర్ఎఫ్‌సి అంగీకరించినప్పటికీ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలిసి ఆ నిధులు విడుదల కాకుండా చేశారని సీఎం రేవంత్ ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై ఆయనతో భేటీ ఏర్పాటు చేయించాలని సీఎం రేవంత్ కిషన్ రెడ్డికి రెండు సార్లు బహిరంగ లేఖలు సైతం రాశారు. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో తానే స్వయంగా అపాయింట్‌మెంట్ తీసుకుని కేంద్ర మంత్రిని కలవాలని సీఎం నిర్ణయించినట్లు సమాచారం.

# నకిలీ విత్తనాలపై నిఘా

(మొదటి పేజీ తరువాయి)

మహా రాష్ట్ర గుజరాత్ రాష్ట్రాల నుంచి ఈ నకిలీ విత్తనాలు తెలంగాణకు చేరుకుంటున్నాయని, ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు, కర్నూలు, ప్రకాశం, నంద్యాల నుంచి పెద్ద మొత్తంలో సరఫరా అవుతున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు నకిలీ పత్తి విత్తనాలను తయారు చేసి తెలంగాణలోని రైతులకు నేరుగా విక్రయిస్తున్నారని వివరిస్తున్నారు. స్మగర్లు నకిలీ విత్తనాలను నిత్యావసర వస్తువులు తరలించే వాహనాల్లో రహస్యంగా తరలిస్తున్నారని ఈ నేపథ్యంలో చెక్ పోస్టులలో ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నామని జాయింట్ టాస్క్ ఫోర్స్ అధికారులు వివరిస్తున్నారు. ఈక్రమంలో గడచిన నెల రోజుల వ్యవధిలో భారీ ఎత్తున నకిలీ విత్తనాలను జాయింట్ టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకుని దాదాపు 50 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు అధికారులు వివరించారు.

రాష్ట్రంలో కొందరు విత్తన వ్యాపారులు పొరుగు రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి లూజు విత్తనాలు తెచ్చి, రంగురంగుల ప్యాకెట్లుగా ప్యాకింగ్ చేసి, ఇక్కడ ప్రతి ఏడాది అమ్మకాలు చేస్తున్నారని జాయింట్ టాస్క్ ఫోర్స్ అధికారులు వివరిస్తున్నారు. నకిలీ విత్తనాలను కర్నాటక, ఆంధ్రా ప్రాంతానికి చెందిన కొందరు తెలంగాణకు తరలిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. రైతులకు అవగాహన లేకపోవడం వల్ల నాసిరకం విత్తనాలను కొనుగోలు చేయడం వల్ల పంట దిగుబడి రాక, తీవ్రంగా నష్టపోతున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో కొన్ని విత్తన కంపెనీలు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రలో మూతపడిన ఫ్యాక్టరీలను లీజ్‌కు తీసుకొని లూజు విత్తనాలు కొనుగోలు చేసి, రంగురంగు ప్యాకెట్లో ప్యాకింగ్ చేసి తెలంగాణలోకి తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వ్యాపారులు ఇష్టారాజ్యంగా సకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మకాలు చేస్తుండటంతో తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని జాయింట్ టాస్క్ ఫోర్స్ అధికారులు వివరిస్తున్నారు.

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో నకిలీ విత్తనా సరఫరాలో సీడ్ ఆర్గనైజర్లు అసలు సూత్రధారులుగా పనిచేస్తున్నట్లు జాయింట్ టాస్క్ ఫోర్ విచారణలో తేలింది. రైతుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసేందుకు డబ్బులు లేకపోవడంతో కొందరు వ్యాపారులు ఆశచూపి చెప్పిన ధరకు విత్తనాలు కొనుగోలు చేయిస్తున్నారు. విత్తనాలు నకిలీవా, కావా అని రైతులు పరిశీలించడం లేదని, ఎక్కువ మంది వ్యాపారులు లూజు విత్తనాలు ప్యాకింగ్ చేసి అమ్మకాలు చేస్తుండడంతో పంట దిగుబడులు తగ్గుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో భూమికి, మనుషులకు, పశువులకు నష్టం చేసే నకిలీ విత్తనాలు అమ్మినా, సాగు చేసినా క్రిమినల్ చర్యలతో పాటు వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని పోలీసు బాసులు తేల్చిచెబుతున్నారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని జాయింట్ టాస్క్ ఫోర్స్ అధికారులు ప్రచారం చేపడుతున్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రశీదులను, విత్తన ప్యాకెట్‌ను పంట కాలం పూర్తి అయ్యేంతవరకు భద్రపరుచుకోవాలని పేర్కొంటున్నారు. డీలర్ల నుంచి తీసుకున్న విత్తన ప్యాకెట్ మీద లాట్ నెంబర్, విత్తన తయారీ తేదీ, గడువు తేదీ చూసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా రైతులు లూజుగా ఉన్న సందులలోని విత్తనాలను కొనుగోలు చేయరాదని, నకిలీ పత్తి విత్తనాలు, గ్లైఫోసిట్ అనే కలుపు నాసిని మందును తట్టుకునే పత్తి విత్తనాలకు మనదేశంలో అనుమతి లేదని వెల్లడించారు. ఆ విత్తనాలను రైతులు వినియోగించవద్దని చెబుతున్నారు. ఒకవైపు తనిఖీలు చేపడుతూ మరోవైపు రైతులకు నకిలీ, నాసిరకం ఎరువులు, విత్తనాల సరఫరాపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నామని అధికారులు వివరిస్తున్నారు.

ఈనెల 23 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2601 రైతు వేదికల్లో నాలుగు రోజుల పాటు రైతుకు విత్తన మేళా నిర్వహించేందుకు సర్కారు ప్లాన్‌చేస్తోంది. ఈక్రమంలో మండల వ్యవసాయ అధికారులు డీలర్ల మాటలు నమ్మి మోస పోవద్దని, ప్రైవేటుగా రైతులు విత్తనాలు కొనేటప్పుడు సర్టిఫైట్ సీడ్‌మాత్రమే కొనాలని, ప్యాకెట్‌పై ఉన్న వివరాలు పరిశీలించాలని అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా మొలక శాతం, తయారీ తేదీ గమనించాలి. అధికారిక డీలర్ల వద్ద మాత్రమే కొనుగోసి రసీదు తప్పని సరిగా తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు. పంట అధిక దిగుబడి రావాలంటే ధృవీకరించిన విత్తనాలు మాత్రమే ఉపయోగించాలని, నేల పరీక్షలు తప్పక చేయించుకుని, సమయానికి నారు పోయాలని రైతు మేళాలో ముందస్తు హెచ్చరికలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ సూచనలు రైతులు తప్పకుండా పాటించాలని రైతు మేళాలో రైతులకు అవగాహనతో పాటు వారిని చైతన్యం చేయనున్నారు.

## డ్రగ్స్ అడ్డాపై

# బుల్డోజర్‌తో ఎటాక్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. ఈక్రమంలో ప్రతీ రోజు రూ. 15 లక్ష గంజాయి విక్రయాలు సాగిస్తున్న లేడీ డ్రగ్ డాన్ నీతూ భాయి అడ్డాను బుల్డోజర్‌తో నేలమట్టం చేశారు. వెరసి ఈగల్ అధికారులు డ్రగ్స్, గంజాయి ముఠాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా కోకాపేట్ ప్రాంతంలో కిరాణా షాపు మాటున భారీ ఎత్తున గంజాయి విక్రయాలు సాగిస్తున్న 'లేడీ డాన్' నీతూ భాయ్ అక్రమ సామ్రాజ్యంపై అధికారులు సర్జికల్ స్ట్రైక్ చేశారు. గంజాయి విక్రయాలకు అడ్డాగా మారిన ఆమె కిరాణా షాపును రెవెన్యూ , ఈగల్ బృందాలు సంయుక్తంగా కూల్చివేశాయి. కోకాపేటలో కిరాణా షాపును నడుపుతున్నట్లు నమ్మిస్తూ లోపల మాత్రం నీతూ భాయ్ జోరుగా గంజాయి విక్రయాలు సాగిస్తోంది. ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉండటంతో అటు సాఫ్ట్‌వేర్,ఇటు కాలేజీ విద్యార్థులను టార్గెట్ ప్రతీ రోజు రూ. 15 లక్షల మేరకు గంజాయి విక్రయాలు జరుపుతోంది. కిరాణా షాపు మాటున గంజాయి వ్యాపారం జరుగుతోందని అధికారులు గుర్తించిన పోలీసులు నీతూభాయితో పాటు ఆమె కుటుంబ సభ్యులను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. కాగా జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత కూడా ఆమె తిరిగి గంజాయి దందా చేస్తున్నట్లు పోలీసులు పక్కా ఆధారాలు సేకరించి ఆమె మత్తు సామ్రాజ్యాన్ని నేల మట్టం చేశారు. ఈగల్ పోలీసు అధికారుల రాకను గమనించిన లేడీ డాన్ నీతూ భాయ్ తన కొడుకుతో సహా అక్కడి నుండి చాకచక్యంగా తప్పించుకుని పారిపోయింది. అదే సమయంలో అక్కడ గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన సుమారు 67 మందిని ఈగల్ టీం అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. నేరాలకు అడ్డగా మారిన నీతూభాయి కిరాణా షాపును కూల్చివేయాలని ఈగల్ బృందం రెవెన్యూ శాఖకు సిఫార్సు చేయడంతో అధికారులు దానిని నేలమట్టం చేశారు. అంతటితో ఆగకుండా, త్వరలోనే నీతూ భాయికి సంబంధించిన అన్ని అక్రమ ఆస్తులను కూడా పూర్తిగా కూల్చివేస్తామని ఈగల్ టీం హెచ్చరించింది. ప్రస్తుతం పరారీలో ఉన్న లేడీ డ్రగ్ డాన్ నీతూ భాయ్ , ఆమె కుమారుడి కోసం ప్రత్యేక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

## ఒలింపిక్స్ లక్ష్యంగా

# స్పోర్ట్స్ యూనివర్సిటీ




(మొదటి పేజీ తరువాయి)


ప్రజా ప్రభుత్వం క్రీడలను పెద్దపీట వేస్తూ, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉంది' అని భట్టి విక్రమార్క తెలిపారు. గతంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఫుట్‌బాల్ స్టార్ 'మెస్సి' ఆడిన ఈ ఉప్పల్ స్టేడియం సాక్షిగా.. హైదరాబాద్ నగరంలో ప్రపంచ స్థాయి వసతులు, అన్ని హంగులతో కూడిన స్పోర్ట్స్ యూనివర్సిటీ రాబోతోందని డిప్యూటీ సీఎం వెల్లడించారు.ఒలింపిక్స్ స్థాయి శిక్షణ ఇచ్చేలా తెలంగాణలో ఒక బలమైన క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 21 రోజుల పాటు సాగనున్న ఈ 'టీజీ 20 క్రికెట్' హంగామా.. రాష్ట్రంలోని క్రీడాభిమానులకు ఒక పెద్ద పండుగ వాతావరణాన్ని తీసుకురానుంది. ఈ టోర్నీ విజయవంతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# యోగాంధ్ర వైబ్స్...లోకేష్ పవర్ యోగా!

## బాబా రాందేవ్‌తో సీఎం చంద్రబాబు, లోకేశ్ యోగా

**(అమరావతి, మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి) :** విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంతో పాటు చారిత్రాత్మక ఉండవల్లి గుహల సాక్షిగా జరిగిన సామూహిక యోగాభ్యాసంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ప్రముఖ యోగా గురువు, పతంజలి సంస్థల అధినేత బాబా రామ్దేవ్ పర్యవేక్షణలో వారంతా వివిధ ఆసనాలు, ప్రాణాయామం సాధన చేశారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, కూటమి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు మరియు వేలాది మంది యోగా సాధకులు తరలివచ్చారు.లోకేశ్ 'పవర్ యోగా'.. నవ్వులు పూయించిన క్షణాలుఈ వేడుకల్లో ఒక ఆసక్తికరమైన సన్నివేశం అందరినీ ఆకట్టుకుంది. యోగా గురు బాబా రామ్దేవ్ మంత్రి నారా లోకేశ్తో ప్రత్యేకంగా కొన్ని కఠినమైన 'పవర్ యోగా' ఆసనాలు వేయించారు. బాబా రామ్దేవ్తో పోటీపడుతూ లోకేశ్ యోగా సాధన చూసి పక్కనే ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు మనస్ఫూర్తిగా నవ్వుతూ ఎంజాయ్ చేశారు. వేదికపై ఉన్న మిగతా నేతలతో పాటు స్టేడియంలోని వారంతా ఈ దృశ్యాన్ని చూసి నవ్వుల పువ్వులు పూయించారు.

చంద్రబాబు విజనరీ లీడర్, ఒక కర్మయోగి : బాబా రామ్దేవ్



ఈ సందర్భంగా యోగా గురు బాబా రామ్దేవ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడిపై ప్రశంసల జల్లు కురిపించారు.నిజజీవితంలో క్రమశిక్షణ: చంద్రబాబు రాజకీయాల్లోనే కాకుండా నిజజీవితంలోనూ అత్యంత క్రమశిక్షణ కలిగిన నాయకుడని కొనియాడారు.కర్మయోగి: ఆయన నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసమే శ్రమించే ఒక 'కర్మయోగి' అని, దేశానికే ఒక విజనరీ లీడర్ అని ప్రశంసించారు. అమరావతి దేవతల రాజధాని అని, ఇక్కడి పచ్చదనం, ప్రకృతి అద్భుతమని పేర్కొంటూ, యోగా కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు, ఆంధ్రప్రదేశ్కు వస్తే చాలని బాబా రామ్దేవ్ వ్యాఖ్యానించారు.ఆరోగ్యాంధ్ర దిశగా సీఎం చంద్రబాబు కీలక ప్రకటనలుఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' అనే థీమ్తో జరిగిన ఈ వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం పలు కీలక నిర్ణయాలను ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాలలో దాదాపు కోటి మందికి పైగా ప్రజలు ఈ రోజు యోగా సాధనలో భాగస్వాములయ్యారు. శాశ్వత యోగా మందిరాలు: రాష్ట్రంలోని అన్ని స్వర్ణ గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల్లో శాశ్వత ప్రాతిపదికన యోగా మందిరాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని చేకూర్చే లక్ష్యంతో రాబోయే ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో 'సంజీవని' ప్రాజెక్టు అమలు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్రంలో పర్యావరణ సమతుల్యత కోసం పచ్చదనాన్ని (గ్రీనరీ) 50 శాతానికి పెంచుతామని ఈ సందర్భంగా సీఎం ప్రతిజ్ఞ చేశారు ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చని పిలుపునిస్తూ, వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా వేడుకలను తిరుమల పవిత్ర కొండలపై నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు.పతంజలి యోగా గురుకులం విద్యార్థులు ప్రదర్శించిన అద్భుతమైన ఆసనాలను చూసి సీఎం ముగ్ధులయ్యారు. ప్రతి ఒక్కరూ యోగాను కేవలం ఒక రోజు ఈవెంట్గా కాకుండా దైనందిన జీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని ఈ సభ ద్వారా నేతలు పిలుపునిచ్చారు.

## తెలంగాణ నుంచి రాజ్యసభ సీటు తీసుకోను

**హైదరాబాద్, జూన్ 20 ( మనం బ్యూరో ) :** బీజేపీ, ఈసీ కుట్రపూరితంగా వ్యవహరించి తన రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించాయని ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. ఈ వ్యవహారంలో బీజేపీ కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ స్థానానికి ఆమె వేసిన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మీనాక్షి నటరాజన్ స్పందించారు. తనపై లీగల్ కేసులు ఏమీ లేవనీ, ఓ కేసు అంశాన్ని ఎన్నికల అఫిడవిట్లో పేర్కొనలేదనే కారణంతో తన నామినేషన్‌ను తిరస్కరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. నా సీటు చోరీ జరిగింది. బీజేపీ చేస్తున్న కుట్రలు సమాజానికి తెలియాలనే పోరాడుతున్నాం. నాకోసం మరొకరితో రాజీనామా చేయించి తెలంగాణలో రాజ్యసభ సీటు తీసుకోలేనని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిని కాబట్టి అక్కడి నుంచే సీటు కోరుకుంటా. నా కేసుల సమాచారానిన కాంగ్రెస్ నేతలు ఇచ్చారనేది పచ్చి అబద్ధం. బాజపా కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తోంది. కేసు ఉన్నంత మాత్రాన నామినేషన్ తిరస్కరణ కాలేదు. బీజేపీ నేతలను నామినేషన్ రూమ్‌లోకి ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై బీజేపీకి నమ్మకం లేదనీ...మేం చెప్పిందే రాజ్యాంగం అన్నట్లుగా ఆ పార్టీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బీజేపీ అప్రజాస్వామిక చర్యలను దేశ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదు, మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు.

## రాహుల్‌తో సమావేశం ఏర్పాటు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

నిలదీసేందుకు రాష్ట్ర ప్రజల గోడు వినిపించేందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ కాంగ్రెస్ నాయకత్వం ఈ అపాయింట్‌మెంట్ ఇప్పించడంలో విఫలమైతే అది రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మహా ద్రోహంగా నిర్ధారణ అవుతుందని పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి స్వయంగా ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఇంతకాలం అవుతున్నా మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత, పేద కుటుంబాలు ఆ పథకాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, కాంగ్రెస్ నెరవేర్చని హామీలను నేరుగా రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సీఎం వెంటనే స్పందించి రాహుల్‌తో సమావేశాన్ని ఏర్పాటు చేయించాలని ఈ సందర్భంగా రామచందర్‌రావు డిమాండ్ చేశారు.

## ఎట్టకేలకు మొదలైన చర్చలు..

(మొదటి పేజీ తరువాయి)

భీకర స్థాయిలో విరుచుకుపడతామని 'ట్రూత్ సోషల్'లో పోస్టు పెట్టారు. చర్చల ప్రారంభానికి ముందు జేడీ వాన్స్ మాట్లాడుతూ.. హర్మూజ్ జలసంధిని తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమానికి ముగింపు పలకడం వంటివన్నీ ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. ''మనం ఇంకా ఎంత సాధించగలం? పశ్చిమాసియాకు సంబంధించి కొత్త అధ్యాయాన్ని ప్రారంభించగలమా? ఇక్కడి సంబంధాలను శాశ్వతంగా మార్చగలమా? లేదా పాత పద్ధతిలోనే వెళ్లడమా?'' అనే ప్రశ్నలు తమందరి ముందు ఉన్నాయన్నారు. ఈ చర్చలను చరిత్రాత్మకంగా పేర్కొంటూ.. ఇరుదేశాల మధ్య ఇంతటి ఉన్నత స్థాయి సమావేశం గతంలో ఎప్పుడూ జరగలేదని చెప్పారు. అమెరికా, ఇరాన్ మధ్య రెండు రోజుల క్రితమే చర్చలు ప్రారంభం కావాల్సి ఉండగా.. వాయిదా పడ్డాయి. తాత్కాలిక ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ఇజ్రాయెల్, లెబనాన్లోని హెజ్బొల్లా మధ్య పోరాటం తీవ్రతరమైంది. లెబనాన్లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో పదుల కొద్ది స్థానికులు మృతి చెందారు. ఈ దాడులను నిరసిస్తూ ఇరాన్ ప్రతినిధులు స్విడ్జర్లాండ్ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. చర్చలు కొనసాగాలంటే లెబనాన్‌పై దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. అయితే, తాజాగా చర్చలు ప్రారంభమైన వేళ లెబనాన్ను ఉటంకిస్తూ ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## 'యోగాంధ్ర 2026'కు లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు

**(అమరావతి, మనం ప్రత్యేక ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర 2026' సామూహిక ఆరోగ్య, యోగా ఉద్యమానికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్రవ్యాప్తంగా అపూర్వమైన రీతిలో ప్రజా సమీకరణ, రికార్డు స్థాయి భాగస్వామ్యంతో విజయవంతమైన ఈ మెగా కార్యక్రమం లండన్కు చెందిన ప్రతిష్టాత్మక 'వరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్' (గొటజూఛీ ఆాాజు ాజ ఖఛిఛొటఛీట - ఔ్ూఛీ్ూ) లో స్థానం సంపాదించుకుంది. ఈ అంతర్జాతీయ రికార్డుకు సంబంధించిన ధృవీకరణ పత్రాన్ని వరల్ బుక్ ఆఫ్ రికారడ్స్ - సౌత్ రీజియన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఉల్లాజి ఎలియాజర్ ముఖ్యమంత్రికి అందజేశారు. అవార్డును ఆయుష్ శాఖకు ఇచ్చి.. అభినదొాచారని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. అందరి సమస్టి కృషివల్లే ఇది సాధ్యమైందన్నారు.

# హెల్తీ తెలంగాణ కోసం కృషి చేస్తున్నాం

**యోగాను ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగం చేసుకోవాలి**

**యోగా గొప్పతనం ప్రపంచానికి తెలిసేలా కృషి చేస్తున్నాం**

**అంతర్జాతీయ యోగా దినోత్సవంలో మంత్రి దామోదర్ వెల్లడి**



**హైదరాబాద్,** మనం ప్రతినిధిః రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం - ఆయుష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన యోగ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు నిర్వహించిన యోగా సాధనలో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన గొప్ప కానుక యోగ అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలంటే హెల్తీ ఫ్యామిలీ, హెల్తీ సొసైటీ, హెల్తీ తెలంగాణ ఉండాలన్నారు. పాఠశాల నుంచి కాలేజీ స్థాయి వరకు విద్యార్థులకు యోగాను పరిచయం చేస్తున్నామన్నారు. యోగ గొప్పతనాన్ని అందరికీ తెలిసేలా కృషి చేస్తున్నామన్నారు.ఆయుష్ శాఖ ద్వారా యోగ శిక్షణ రాష్ట్రంలో ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలకు యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు మంత్రి దామోదర్ రాజనర్సింహ. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా క్రిస్టినా జెడ్ చొంగ్తు, రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో హనుమంతు, డైరెక్టర్ స్పోర్ట్స్ సోనీ బాలాదేవి, మెడికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా. నరేంద్ర కుమార్, రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డా. రవీంద్ర కుమార్, ఆయుష్ శాఖ అధికారులు హైదరాబాద్ జిల్లా ృఖ ైడా. పుట్ల శ్రీనివాస్, యోగ శిక్షకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గ్రామీణ ఉపాధి, రాష్ట్రాల హక్కుల పరిరక్షణే లక్ష్యం

- **విపక్ష పాలిత రాష్ట్రాలతో కలసి ఉమ్మడి కార్యాచరణ**
- **న్యాయ, రాజ్యాంగపరంగా సవాల్ చేసే అవకాశాల పరిశీలన**
- **వీబీజీ రామ్‌ఈ చట్టం-2025పై క్యాబినెట్ సబ్ కమిటీలో నిర్ణయం**

**హైదరాబాద్, జూన్ 21(మనం బ్యూరో ):** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వీబీజీ రామ్‌జీ చట్టం-2025 దేశంలోని కోట్లాది గ్రామీణ పేదల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఈ అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం మొదటి సమావేశం ఆదివారం రాష్ట్ర సచివాలయంలో చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క, వివేక్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ద్వారా గత కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ పేదలకు కల్పించిన హక్కులను క్రమంగా నిర్వీర్యం చేసి రాష్ట్రాల అధికారాలను హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టం కేవలం ఒక పథకం కాదు, అది గ్రామీణ భారత దేశానికి ఆర్థిక భరోసా కల్పించిన సామాజిక విప్లవం. అలాంటి చట్టాన్ని బలహీనపర్చడం అంటే రైతుకూలీలు, మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవితాలతో ఆటలాడటమేనని విమర్శించారు. దేశ స్వాతంత్ర్య సమరానికి మార్గదర్శకుడైన మహాత్మా గాంధీ పేరును తొలగించడం కేవలం పేరు మార్పు కాదు, అది భారత దేశ చరిత్రను, జాతిపిత వారసత్వాన్ని అవమానించే చర్య. రాజకీయ కక్షతో చరిత్రను చెరిపివేయాలని ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. వీబీజీ రామ్‌జీ చట్టం అమలులోకి వస్తే గ్రామీణ కార్మికులు, చిన్న సన్నకారు రైతులు, మహిళా సంఘాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్రాలపై అదనపు భారం పడటంతో పాటు గ్రామీణ పేదలకు అందుతున్న ఉపాధి, జీవనోపాధి భద్రత దెబ్బతింటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పేదల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేసిన మంత్రి ఉత్తమ్ ప్రస్తుత ఉపాధి హామీ చట్టం పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గ్రామీణ భారత ప్రయోజనాల ఉపాధి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం అవసర మైతే ఇతర రాష్ట్రాలతో కలసి ఉమ్మడి పోరాటం చేపట్టేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ, అవసరమైతే, న్యాయ, రాజ్యాంగపరంగా సవాల్ చేసే అవకాశాలను సైతం పరిశీలన చేస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

# సైబర్ బాధితులకు భారీ ఊరట

## 6,303 మంది బాధితులకు రూ.45.21 కోట్లు రిఫండ్



**హైదరాబాద్,జూన్ 21(మనం,ప్రత్యేక ప్రతినిధి):** ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా రాష్ట్రంలోని 6,303 మంది సైబర్ మోసం బాధితులకు రూ.45.21 కోట్లు రిఫండ్ చేసినట్లు టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో 2,232 మందికి చెందిన రూ.21.91 కోట్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో పరిధిలో 77 మందికి రూ.6.83 కోట్లు రికవరీ చేసినట్లు వివరించారు. మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు రికవరీలో అగ్రస్థానంలో నిలిచాయన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు నుంచి ఇప్పటివరకు 59,953 మంది బాధితులకు రూ.445.41 కోట్లు రిఫండ్ అయినట్లు తెలిపారు. 2026లో జూన్ 20 వరకు రూ.70.07 కోట్లు సైబర్ మోసగాళ్ల నుంచి రికవరీ చేసినట్లు వివరించారు.

**సైబరాబాద్ తొలిస్థానం :**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2,232 మంది బాధితులకు రూ21.91 కోట్లు తిరిగి ఇప్పించి మొదటి స్థానంలో నిలిచామని టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ఆ తర్వాత టీజీసీఎస్బీ నేరుగా 77 మంది బాధితులకు రూ.6.83 కోట్లు, మల్కాజిగిరి పరిధిలో 779 మందికి రూ.4.04 కోట్లు, హైదరాబాద్ పరిధిలో 755 మందికి రూ.3.22 కోట్లు, సంగారెడ్డిలో 167 మందికి రూ.1.69 కోట్లను రీఫండ్ చేశామన్నారు.తెలంగాణలో సైబర్ నేర బాధితులకు నష్టపరిహారం అందించే వ్యవస్థ ఎంత పటిష్టంగా, సంస్థాగతంగా పనిచేస్తోందో చెప్పడానికి ఇప్పటివరకు జరిగిన రికవరీ గణాంకాలే నిదర్శనమని తెలిపారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటైనప్పటి నుంచి 59,953 మంది సైబర్ బాధితులకు ఏకంగా రూ.445.41 కోట్లు తిరిగి ఇప్పించామన్నారు. ఈ నేపథ్యంలో 2023లో రూ.8.36 కోట్లు, 2024లో రూ.183.9 కోట్లు, 2025లో రూ.182.95 కోట్లు, ఈ ఏడాది రూ.70.07 కోట్ల మేర రికవరీ చేసి బాధితుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్ వివరించారు.

**కాల్...1930**

సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు, పిన్ నంబర్లు, పాస్‌వర్డ్, బ్యాంకింగ్ వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్ హెచ్చరించారు. కస్టమర్ కేర్ నంబర్లను అధికారిక వెబ్‌సైట్‌ల ద్వారా మాత్రమే తీసుకోవాలని, ఎస్ఎంఎస్, వాట్సాప్, ఈమెయిల్స్‌కు అనుమానాస్పద లింక్‌లను పొరపాటున కూడా క్లిక్ చేయవద్దన్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్ తొలి గంట లోపు 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. త్వరగా ఫిర్యాదు చేస్తే, డబ్బును ఫ్రీజ్ చేసి తిరిగి రాబట్టే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయని ఆమె స్పష్టం చేశారు.

# నగరంలో హిట్ అండ రన్

## నిందితుని కోసం పోలీసుల వేట

**హైదరాబాద్,జూన్ 21(మనం,ప్రత్యేక ప్రతినిధి):** ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం హిట్ అండ్ రన్ సంఘటన చోటుచేసుకుంది. కారు ఢీకొన్న ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. కారు నడుపుతున్న వ్యక్తి కారును సంఘటనా స్థలంలోనే వదిలేసి పారిపోయాడు. వివరాల్లోకి వెళితే.. ఓ యువకుడు సెల్ఫ్ డ్రైవ్ ఇన్నోవా కారును అద్దెకు తీసుకున్నాడు. ఆ కారు ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 35 ఏళ్ల ఫహీమున్నిసా అనే మహిళను ఢీకొట్టింది. వేగంగా కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలైన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మహిళ చనిపోయిందని తెలియగానే.. ఆ యువకుడు ఘట నాస్థలంలోనే కారును అక్కడే వదిలేసి పరార య్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఫహీమున్నిస్సా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. యువకుడికి కారు అద్దెకు ఇచ్చిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. కాగా కేసులో నిందితుడిని ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడి కుమారుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

# ‘నీట్’గా ముగిసింది

**దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది హాజరు**

**జూన్ 28 నాటికి అధికారిక ఆన్సర్ కీ విడుదల అంచనా**

**జూలై చివరి వారంలో ఫలితాలు వెల్లడయ్యే అవకాశం**



**హైదరాబాద్,** మనం ప్రతినిధి : దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో అసక్తిగా ఎదురుచూసిన నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ ఆదివారం (జూన్ 21) ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహించారు. దివ్యాంగులకు 6.20 గంటల వరకు పరీక్ష రాసే అవకాశం కల్పించారు. సుమారు 23 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. భారత్‌తో పాటు రియాద్‌లోని అంతర్జాతీయ కేంద్రంలో సైతం నీట్ పరీక్షను విజయవంతంగా పూర్తి చేశారు. ఇగా, ఎప్పటిలాగానే పలు పరీక్ష కేంద్రాల వద్ద ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు, తమను లోపలికి అనుమతించకపోవడంతో కన్నీటి పర్యంతం కావడం కనిపించింది. పరీక్ష రాసిన విద్యార్థుల ప్రాథమిక విశ్లేషణ ప్రకారం, ఈసారి ప్రశ్నపత్రం మొత్తం మీద మధ్యస్థంగా ఉంది. అన్ని విభాగాల్లోకెల్లా ఫిజిక్స్ అత్యంత కఠినంగా ఉందని, ఆ తర్వాత కెమిస్ట్రీ ఉందని విద్యార్థులు తెలిపారు. అయితే, బయాలజీ విభాగం మాత్రం చాలా సులభంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. పరీక్ష ముగియడంతో, వివిధ కోచింగ్ సంస్థలు త్వరలోనే అనధికారిక ఆన్సర్ కీలను విడుదల చేయనున్నాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అధికారిక ప్రాథమిక ఆన్సర్ కీని జూన్ 28 నాటికి విడుదల చేసే అవకాశం ఉంది. దీనిపై అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత తుది కీని, ఫలితాలను ప్రకటిస్తారు. నీట్ యూజీ 2026 ఫలితాలను జూలై చివరి నాటికి వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు తమ స్కోర్ బోర్డులను అధికారిక వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అని అధికారులు ఇప్పటికే తెలిపారు. అయితే, ఇదే యేడాది మే నెలలో జరిగిన పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో, దానిని రద్దు చేసి ఈ పునఃపరీక్షను నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తాజా సమాచారం కోసం అభ్యర్థులు అధికారిక వెబ్ సైట్‌ను గమనించాలని అధికారులు సూచించారు.

# సింగరేణిలో అత్యంత పకడ్బందీగా బొగ్గు రవాణా

**ప్రతి టన్ను బొగ్గుపై పటిష్ట పర్యవేక్షణ**

**అత్యాధునిక సాంకేతికతతో**

**పారదర్శక రవాణా వ్యవస్థ**

**సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ**

**హైదరాబాద్,** మనంప్రతినిధిః సింగరేణి బొగ్గు చోరీకి గురైందని, కనిపించడం లేదంటూ కొన్ని మీడియా సంస్థల్లో ఇటీవల వస్తున్న కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ స్పష్టం చేస్తోంది. సంస్థలో బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, రవాణా, విక్రయాలకు సంబంధించిన అన్ని ప్రక్రియలు అత్యంత పారదర్శకంగా, ఆధునిక సాంకేతిక వ్యవస్థల పర్యవేక్షణలో జరుగుతున్నాయని పేర్కొంది. సింగరేణిలో అమలులో ఉన్న బొగ్గు రవాణా, భద్రతా వ్యవస్థలు, సాంకేతిక పర్యవేక్షణ విధానాలను వెల్లడించింది.

గనుల్లో బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశ డిజిటల్గా నమోదవుతోంది. బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా సరఫరా చేయడం జరుగుతోంది. బొగ్గు కేటాయింపులు ఖీఅ ఆధారిత సమగ్ర వ్యవస్థ ద్వారా జరుగుతున్నాయి. వినియోగదారుడు, గని, పరిమాణం, సరఫరా తేదీ తదితర వివరాలు ముందుగానే డిజిటల్గా నమోదవుతాయి. ప్రతి టన్ను బొగ్గుకు సంబంధించిన సమాచారం ఇొ్చజూ ్ఖా, ఖీఅ RFI–, GPS, CCTV, Coal Net, మరియు ఇతర ఆన్లైన్ వ్యవస్థల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని సింగరేణి ఆపరేషన్స్ విభాగం ఉన్నతాధికారులు స్పష్టం చేశారు...

రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా చేసే ప్రతి వాహనం ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్ వద్ద తూకం వేయడం జరుగుతుంది. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్( ఖఊఇ) ఆధారిత బూమ్ బ్యారియర్లు, జీపీఎస్ / జీపీఆర్ఎస్ (ఎఖీ/ఎఖఖీ) ట్రాకింగ్, జియోఫెన్సింగ్ వ్యవస్థల ద్వారా వాహనాల కదలికలపై రియల్ టైమ్ లో పర్యవేక్షణ కొనసాగుతోందని ప్లానింగ్ విభాగం ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

రైల్వే మార్గంలో కూడా ప్రతి వ్యాగన్ లోడింగ్, డిస్పాచ్ వివరాలు డిజిటల్గా నమోదవుతున్నాయి. గనులు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లు( ఇఏ)లు, వెయిబ్రిడ్జ్ లు, రైల్వే సైడింగ్లు, స్టాక్ యార్డులు, ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు, ఖఊఇ వ్యవస్థలు, చెక్పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, భద్రతా సిబ్బంది 24 గంటలూ పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు బొగ్గు రవాణా విభాగం ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అలాగే ఆకస్మిక తనిఖీలు, ప్రత్యేక గస్తీలు నిరంతరం కొనసాగుతున్నాయన్నారు. ఇంత పకడ్బందీగా ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్లు, సింగరేణి సెక్యూరిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, హోలోగ్రామ్ చలానాలు, టాస్క్ఫోర్స్ పర్యవేక్షణ వంటి బహుళస్థాయి భద్రతా వ్యవస్థల మధ్య జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి-రవాణా ప్రక్రియలో బొగ్గు చోరీకి గురికావడం, కనిపించకపోవడం వంటి ఆరోపణలు అవాస్తవమని సింగరేణి యాజమాన్యం పేర్కొంది.

# ఆ తప్పు మీదే?..

- **ఇతరులపై నిందలేందుకు?**
- **సీఎంకు అవగాహనలేక.. ఎస్‌బీఐ భూముల వేలం**
- **సర్కార్‌పై సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శ**

**హైదరాబాద్,** మనం ప్రతినిధి : చేసిన తప్పుకు సిగ్గుపడకుండా ఇతరుల మీద నిందలు ఎందుకు వేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై.. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఫైర్ అయ్యారు. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో తమ 5.09 ఎకరాల భూమిని ప్రభుత్వం విక్రయించడాన్ని హైకోర్టులో ఎస్‌బీఐ సవాల్ చేసిన విషయం తెలిసిందే. ఎస్‌బీఐ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌బీఐ నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపిస్తోంది. ఎస్‌బీఐలోని ప్రభుత్వ డిపాజిట్లు, ఖాతాలను ఇతర బ్యాంకులకు మార్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు ఇప్పటికే వార్తలు కూడా వచ్చాయి. ఈ క్రమంలో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్‌బీఐ లాంటి దేశంలోని అతి పెద్ద బ్యాంకును బ్లాక్ మెయిల్ చేసే తరహాలో అనుకూల మీడియాలో కథనాలు రాయిస్తుండడం ఈ ప్రభుత్వ పతనానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవగాహనా రాహిత్యంతో ఎస్‌బీఐ భూములను వేలం వేసిందని..ఈ ప్రభుత్వానికి వేలం వెర్రిగా భూముల అమ్మకం మీద ఉన్న శ్రద్ధ వాటి సాంకేతిక, పర్యావరణ అంశాల మీద లేదన్నారు. అందుకే నాడు కంచె గచ్చిబౌలి, మూసీ స్థలాల ఆక్రమణకు కుట్ర, ఇప్పుడు రాయదుర్గం భూముల వేలంలో సర్కారు అవగాహన రాహిత్యం బయటపడిందన్నారు. రాయదుర్గం భూముల వేలంపై ఎస్‌బీఐ బ్యాంకు కోర్టును ఆశ్రయించడాన్ని బీఆర్ఎస్ పార్టీకి ఆపాదిస్తూ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఖండిస్తున్నానన్నారు.

# పేదల ఇళ్లు కూల్చేందుకే రేవంత్ కంకణం కట్టుకుండు?

- **గాంధీ విగ్రహం పెట్టేందుకు.. పేదల ఇళ్లులు కూలుస్తారా?**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్,** మనం ప్రతినిధి : ఈ దుష్ట కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాఫియా శక్తులు రాజ్యమేలుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దండుపాళ్యం ముఠాకు నాయకుడిలా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తుంటే.. ఆయన ఆధ్వర్యంలో ‘దోచుకో.. దాచుకో’అన్నట్లుగా కాంగ్రెస్ మంత్రులంతా కలిసి మాఫియాలు, స్కాములు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారంనాడు.. తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతిని పురస్కరించుకొని ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ కోసం జయశంకర్ చేసిన త్యాగాన్ని కేటీఆర్ కొనియాడారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వేల కోట్లతో గాంధీ విగ్రహం పెట్టేందుకే.. పేదల ఇళ్లను కూల్చేందుకు కంకణం కట్టుకున్నాడని సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ, రేవంత్ రాక్షసత్వ దౌష్టికాన్ని చూసి, స్వయంగా గాంధీజీ మనవడే వద్దన్నా?.. ప్రజలు వద్దని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా?.. తెలంగాణ సర్కార్ ఏ మాత్రం పట్టించుకోకుండా బీజేపీతో కుమ్మక్కై? ఈ వినాశనానికి తెరలేపిందని ఆయన తనదైన శైలీలో విరుచుకుపడ్డారు.

నిజంగా బీజేపీకి, నరేంద్ర మోడీకి నిజాయితీ ఉంటే ప్రజల సొమ్ము దోచుకోవద్దు?.. ఈ పేదవాళ్ల ఇండ్లు కూలొద్దు అన్న నిజాయితీ నీకుంటే? ఆ రక్షణ శాఖ భూములు ఎందుకిచ్చావని ఆయన ప్రశ్నించారు. నిన్నగాక మొన్నఇచ్చిరు.. మోడీ ప్రభుత్వం.. బడే భాయ్, చోటే భాయ్ కలిసి రక్షణ శాఖ భూములులిచ్చేశారన్నారు. మూసీ ప్రాజెక్టు కట్టుకో గరీబోళ్ల ఇండ్లు కూలగొట్టు.. మనమిద్దరం కలిసి మంచిగా ప్రజలను మోసం చేద్దామని, దుర్మార్గమైన పనులు చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఈ ప్రాజెక్టుకు సహకరించకుండా?.. కేంద్రం ఇచ్చిన రక్షణ శాఖ భూములను సైతం కాపాడాలని ఆయన కోరారు.

**రేవంత్ అనే సినిమా వల్ల తెలంగాణ ప్రజలకు 4 కోట్ల నష్టం..**

అర్జున్ రెడ్డి సినిమా సూపర్ హిట్ అయితే.. రేవంత్ రెడ్డి సినిమా అట్టర్ ఫ్లాప్ అన్నారు. ఫస్ట్ హాఫ్, ఇంటర్‌వేల్ అయిపోగానే ఎప్పుడు పోతడు రా? రేవంత్ రెడ్డి అని అందరూ తల పట్టుకొని కూర్చున్నరంటూ ఏద్దేవా చేశారు. ఒక సినిమా ఫెయిల్ అయితే ప్రొడ్యూసర్లకి నష్టం వస్తుంది.. కానీ, ఈ రేవంత్ రెడ్డి అనే సినిమా వల్ల 4 కోట్ల తెలంగాణ ప్రజలకు నష్టం వస్తుందని కేటీఆర్ హితవు పలికారు. ఇదిలాఉంటే, శంషాబాద్ నుండి ఒక వ్యక్తి నాకు పెళ్లి కార్డు ఇచ్చేందుకు వచ్చాడు. మా తాతల నాటి భూమిని నిషేధిత జాబితాలో పెట్టి, ఇదేంటి అని రాజకీయ నాయకులను అడిగితే ఎకరానికి కోటి రూపాయలు ఇస్తే? నిషేధిత జాబితా నుండి తీసేస్తామని చెప్తున్నారని తన బాధ చెప్పుకున్నాడని కేటీఆర్ అన్నారు. రెండేళ్లు నా భూమిని ఎలాగైనా కాపాడుకుంటాను?, మీరు వచ్చాక వాళ్ల భరతం పట్టాలి సార్ అని అతను నా దగ్గర వాపోయాడని చెప్పుకొచ్చారు.



# తెలంగాణలో 5 లక్షల డూప్లికేట్ ఓటర్ల తొలగింపు?

## 30 లక్షలు ఓట్లు తొలగింపునకు గురయ్యే ఛాన్స్

**హైదరాబాద్,** మనం ప్రతినిధి : తెలంగాణలో రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ మరి కొద్ది రోజుల్లో ప్రక్రియ ప్రారంభం కానుండగా.. దీనికి ముందే నకిలీ ఓట్లను తొలగింపు మొదలయ్యింది. ఈసీ తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్ సాయంతో ఇప్పటి వరకు 5 లక్షల ఓట్ల నకిలీవి గుర్తించి తొలగించారని తెలుస్తోంది. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు నమోదుచేసుకున్న వారిని గుర్తించేందుకు డెమొగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్ అనే సాంకేతికతను ఈసీ రూపొందించింది. ఇక, తెలంగాణలో జూన్ 25 నుంచి జులై 25 వరకు ఎస్ఐఆర్ జరగనుంది.

తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ మొదలుకావడానికి ముందే ఓట్ల తొలగింపు ప్రారంభమైనట్లు సమాచారం. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3.38 కోట్లు కాగా.. ఇప్పటికే 5 లక్షల నకిలీ ఓటర్లను తొలగించినట్లు సమాచారం. దేశంలోని ఒకరికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు నమోదును అడ్డుకోడానికి ఎన్నికల కమిషన్ రూపొందించిన ‘డెమొగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్’ సాఫ్ట్‌వేర్ గుర్తించి తొలగిస్తుంది. ప్రస్తుతం తెలంగాణలోని డూప్లికేట్ ఓట్లను ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా గుర్తించి తొలగించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే విధంగా ఈ జాబితాలో రెండు చోట్ల ఓటు వేసిన వారు కూడా ఉన్నట్లు తెలిసింది.

ఇదిలాఉంటే, తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైతే దాదాపు 30 లక్షల మంది ఓటర్లపై ప్రభావం చూపునుందని సమాచారం. ప్రస్తుత ఓటర్లను 2002 నాటి జాబితాతో ర్యాండమ్ మ్యాపింగ్ చేయగా సుమారు 30 లక్షల ఓట్లు వివిధ కారణాలతో తొలగింపునకు గురయయే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనాకు వచ్చారని తెలిసింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఈ సంఖ్య 15 లక్షల వరకు ఉంటుందని సమాచారం. అధికారులు చేపట్టిన మ్యాపింగ్‌లో గ్రేటర్ పరిధిలో చాలా మంది స్థానికంగా లేకపోవడం, ఇతర ప్రాంతాల్లోనూ ఓట్లు ఉండడం వంటి అంశాలను గుర్తించారు. ఇప్పటి వరకూ 70 శాతం మ్యాపింగ్ పూర్తయిందని అధికారులు తెలిపారు. మొత్తం 3.38 కోట్ల మంది ఓట్లలో 2.38 కోట్ల మందిని మ్యాపింగ్ చేపట్టారు. వీటిలో 89 లక్షల ఓటర్లలో 11 రకాల లోపాలను అధికారులు గుర్తించారు. లేకుంటే వారి ఓట్లను తొలగిస్తారు. ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సైతం.. ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్ ) జూన్ 25న ప్రారంభమవుతుందని, అదే రోజున ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు చేసే దశలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఫారాలను పంపిణీ చేస్తారని ప్రకటించిన విషయం తెలిసిందే. ఓటరు నమోదు ఫారాలన్నీ జూలై 25లోగా తప్పనిసరిగా సమర్పించాలని, ఈ గడువును పొడిగించబోమని ఆయన స్పష్టం చేశారు. ‘‘అర్హులైన ఏ పౌరుడూ తిరస్కరణకు గురికాకూడదు.. అనర్హులైన ఏ ఓటరు కూడా ఉండకూడదు. ఈ నెల రోజుల నమోదు ప్రక్రియ చాలా కీలకమైంది.. ఎందుకంటే తమ ఫారాలను సరిగ్గా తిరిగి పంపిన వారి పేర్లు మాత్రమే ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉంటాయి’’ అని ఆయన అన్నారు.

## ఆయనే మా నాయన...!

పంచె లాల్చీల తెలుగు తెలుపు
అంచె లంచెలుగా గౌరవ గెలుపు
భుజాన ఎర్రరంగు కండువా
ఇజాన ఎరుపెక్కిన మండువా
కాళ్లకు కిర్రు చెప్పుల జోళ్లు
కళ్లకు నల్ల అద్దాల జోళ్లు
రాతిరయ్యిందింటే దోస్తులతో పెగ్గు
కాందాన్ కబుర్ల పైనే మొగ్గు
ఆయన వస్తుంటే ఓ అలికిడి
ఆయనకు ఆయనే ఓ పిడికిలి
ఊరికి ఉమ్మడిగా ఆయనే పెద్ద
ఊసుల ఉయ్యాలకు ఆయనే అడ్డా
ఉదయాన్నే పట్టెడ సానబెట్టేవాడు
బంధాలను గట్టిగా ముడిపెట్టేవాడు
నిప్పుల కుంపటితో దోస్తీ కట్టేవాడు
బ్రతుకు బరువుతో కుస్తీ పట్టేవాడు
బంగారం గొలుసుకు మెరుగు పెట్టేవాడు
అంగారం అలుపుకు పరుగు చుట్టేవాడు
తరాజులో వస్తువుల్ని నిక్కచ్చిగా తూచేవాడు
భేరీజులో మనుషుల్ని నిఖార్సుగా కొలిచేవాడు
పండగొస్తే నిండుగా నవ్వించేవాడు
దండగొస్తే మెండుగా కవ్వించేవాడు
మంచికోసం గట్టిగా మందలించేవాడు
మొక్కకోసం మట్టిలో సంచరించేవాడు
పని మొదలెడితే నిష్క్రమించడు
పని మధ్యలో విశ్రమించడు
పట్టు వదలని విక్రమార్కుడు
ఒట్టు ఉదయానికే ఉదయార్కుడు
తొనకని నిండుకుండలా వుండేవాడు
వనకని మండుటెండలా మండేవాడు
ఆయన కార్యానికి కట్టిన అజండా..
ఆయన మా ధైర్యానికి కట్టిన జండా..
ఆయనే మా నాయిన....!

**- డా. కటుకోఝ్వల రమేష్**
9949083327

# తెలంగాణకు దేవులపల్లి అశేష సేవలు

తెలంగాణ ప్రాంతంలో తెలుగు భాష తెరమరుగు అవుతున్న సమయంలో, తెలుగు భాషను కాపాడిన స్వభాషాభిమానులలో దేవులపల్లి రామానుజరావు ఒకరు. జీవితమంతా సాహితీ సేవకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి రామానుజరావు. విద్యార్థి దశ నుండే మాతృభాషపై మమకారం పెంచుకుని, తెలుగు భాషా వికాసానికి, ఔన్నత్యానికి పాటుపడిన ఒక గొప్ప సాహిత్యాభిమాని. నిజాం నిరంకుశ పాలనకు ఎదురు నిలిచిన వారిలో రామానుజరావు ఒకరు. 1943లో స్థాపించిన ఆంధ్ర సారస్వత పరిషత్, 1956లో ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి వంటి అగ్రగామి సంస్థల స్థాపనకు ఎంతో కృషి చేసి, జీవిత కాలమంతా సారస్వత పరిషత్ ఉపాధ్యక్షుడుగా,అధ్యక్షుడుగా ఉన్నారు. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంత రావు, బూర్గుల రామకృష్ణరావు. స్వామి రామానంద తీర్థ వంటి పెద్దలతో కలిసి తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేసారు.

దేవులపల్లి రామానుజరావు వరంగల్ జిల్లా బొల్లికుంటలో 1917 ఆగస్టు 25న కలిగిన కుటుంబంలో జన్మించారు. డిగ్రీలో చేరేదాకా వరంగల్లులో, తర్వాత నిజాం కళాశాలలో, మధ్యలో కొంత విరామం తర్వాత నాగపూర్‌లో న్యాయశాస్త్రం అభ్యసించారు. ఉద్యోగం కోసం వెదకక, రాజకీయ, సాహిత్య రంగాల్లో కృషి చేశారు. సాహిత్య రంగంతోపాటు విద్యారంగం, గ్రంథాలయోద్యమం, విశ్వవిద్యాలయం, పత్రికారచన, రాజకీయాలు, సహకారోద్యమం, ఆంధ్ర మహాసభ కార్యకలాపాలు, విశాలాంధ్రోద్యమం, రాజ్యసభ సభ్యత్వం- ఇలా తెలుగు వారి జీవితానికి సంబంధించిన సకల రంగాల్లోనూ ఆయన పాత్ర ఉంది.

1943 మే 23న ఏర్పడిన ఆంధ్ర సారస్వత పరిషత్తుతో ఆయనకు మొదటి నుంచి సంబంధం ఉంది. 1944లో ఆంధ్ర సారస్వత పరిషత్ కార్యవర్గ సభ్యుడిగా మొదలై, 1947లో కార్యదర్శి అయి, 1952లో తొలిసారి అధ్యక్షుడై మధ్యలో కొంత విరామం తప్ప జీవితం చాలించే దాకా ఆ సంస్థకు అధ్యక్షులుగా ఉన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలుగులో ప్రవేశ, విశారద లాంటి పరీక్షలు నిర్వహించింది. తెలుగు మాధ్యమంలో పాఠశాలలు ప్రారంభమైన తర్వాత తెలుగు అధ్యాపకుల కొరత తీర్చింది ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారే. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ప్రాథమికోపాధ్యాయులుగానూ, విశారద పరీక్ష పూర్తి చేసిన వారిని ఉన్నత పాఠశాల అధ్యాపకులుగా నియమించేవారు. ఈ పరీక్షలు తెలంగాణలోనే కాక, తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నింటిలో... బెంగళూరు, మైసూరు, హోసూరు, బొంబాయి, షోలాపూర్ వంటి అనేక ప్రాంతాల్లో నిర్వహించేవారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి పండిత శిక్షణను కూడా రామానుజరావు సారథ్యం



లోని సారస్వత పరిషత్తే చేపట్టింది. అక్షరాస్యతా ప్రచారం, వయోజన విద్య కూడా పరిషత్తు కార్యక్రమాల్లో భాగం. 1953లో అలంపురంలో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సప్తమ వార్షిక సభల నిర్వహణ బాధ్యతను తలకెత్తుకున్నదీ ఆయనే. అప్పటి ఉపరాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ ఈ సభలను ప్రారంభించడమే కాక రెండు రోజులూ వాటికి హాజరయ్యారు.

ఆ సభల్లోనే తెలంగాణ రచయితల సంఘం దాశరథి అధ్యక్షులుగా, సి.నారాయణ రెడ్డి కార్యదర్శిగా, శ్రీశ్రీ గౌరవాధ్యక్షుడిగా ఏర్పాటైంది. కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా 1957 నుంచి 1985 దాకా ఆయన జీవితంలో చాలా భాగం సాహిత్య అకాడమీతో ముడిపడింది. సాహిత్య అకాడమీ కార్యభారం మోసింది రామానుజరావే. అకాడమీ వృత్తి పదకోశాలు ప్రచురించడం, ప్రాచీన గ్రంథాలు ప్రచురించి చౌకగా అందుబాటు లోకి తేవడమూ ఆయన చలవే. సాహిత్య అకాడమీ నిర్వహణలో గానీ, సారస్వత పరిషత్తును నడపటంలో గాని రామానుజరావు తానే ఒక వ్యవస్థగా మారారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించినన్ని గ్రంథాలు దేశంలో మరే సాహిత్య అకాడమీ వెలువరించలేదు.


ఉస్మానియా యూనివర్సిటీతో రామానుజరావుకు అమితమైన సంబంధం ఉంది. 1953 నుంచి 1976 దాకా సెనేట్, సిండికేట్ సభ్యుడిగా ఉన్నారు. 1972, 1973, 1975లో మూడుసార్లు తాత్కాలిక ఉపకులపతిగా వ్యవహరించారు. 1960 నుంచి 1962 దాకా రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. నాడు తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఒకే ఒక విశ్వ విద్యాలయం ఉస్మానియా. తెలుగు భాషకు ద్రోహం చేస్తూ, ఉర్దూను కృత్రిమత్వానికి గురిచేస్తూ కొందరు స్వార్థ పరులు ఉస్మానియాను హిందీ యూనివర్సిటీగా మార్చి కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాలని ప్రయత్నాలు చేశారు. ఉన్న ఒక్క విశ్వవిద్యాలయమూ పోయే పరిస్థితి ఎదురైనప్పుడు పౌరసంఘాన్ని ఏర్పాటు చేసి పోరాడి ఉస్మానియాను తెలుగువారికి దక్కించడంలో రామానుజరావు అద్వితీయ కృషి చేశారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలు, అఖిల భారత తెలుగు మహాసభలు అతి వైభవంగా జరిగాయి. ఈ సభల రూపకల్పనలో రామానుజరావు పాత్ర ప్రమేయం, ప్రాతినిధ్యం ప్రముఖం. 1974, జనవరిలో రవీంద్రభారతిలో జరిగిన రామానుజరావు స్మారకోపన్యాసంలో నాటి భారత ప్రధాని పి.వి. తమ ప్రసంగంలో వారిద్దరూ కలిసి నాగపూర్‌లో న్యాయశాస్త్రాన్ని చదువుకున్న రోజులను గుర్తుచేసు కోవడం విశేషం. సాహిత్య సేవే జీవిత పరమావధిగా, కనీసం సొంత ఇల్లు కూడా సమ కూర్చు కోవడంపై దృష్టి నిలపక, ఆంధ్ర సారస్వత పరిషత్తుకు మాత్రం వందల కోట్ల రూపాయల ఆస్తులను సమకూర్చిన రామానుజ రావు తెలుగు ప్రజల హృదయాలపై చెరగని ముద్ర వేసి 1993, జూన్ 8న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# ప్రేమకు ప్రతిరూపం 'ఆమె'



అబ్దుల్ రాజా హుస్సేన్ గారు పెద్దగా పరిచయం అక్కరలేని ప్రముఖ రచయిత. ఫేస్‌బుక్ ఓపెన్ చేస్తే వీరి రచనలు ఏ రోజు లేకుండా ఫేస్‌బుక్ ముందుకు కదలదేమో అనిపిస్తుంది నాకైతే. అంటే అంత గొప్పగా,అంత ఫ్రీక్వెంట్‌గా వీరు రచనలు చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగిగా రిటైరైన దగ్గర్నుంచి ఫేస్‌బుక్ వీరి ప్రియ నేస్తం. ఈ ఫేస్‌బుక్‌లో ఉదయాన్నే 'కాఫీ విత్ రజా హుస్సేన్' అంటూ రోజూ కవులను, కళాకారులను పరిచయం చేస్తూ కాఫీ తాగినంత




మధురానుభూతిని కలిగిస్తున్నారు. ఫేస్‌బుక్‌లో ఈ కాఫీ కాలమ్ పాపులర్ కావడం విశేషం. ఇప్పటివరకు 27 పుస్తకాలను వెలువరించారు.. తిరంగ ముసల్మాన్ వీరి తొలికవితా సంపుటి.. అదే పేరుతో ప్రచురణ సంస్థను కూడా నిర్వహిస్తున్నారు. వీరి రచనలన్నీ కూడా వెన్నెల పిండార బోసిన చందాన పాఠకులను ఎంతో గొప్పగా అలరిస్తాయి. వీరు రాసిన 'ఆమె' మినీ కవితా సంపుటి ప్రేమకు ప్రతిరూపంగా నిలిచింది. ఇప్పుడు ఈ కవితల్లోని మాధుర్యాన్ని ఆస్వాదిద్దాం. మొదటిగా 'ప్రేమంటే ఇదే!' కవిత ఎంతో లోతైన భావాన్ని చాలా సరళంగా వ్యక్తపరిచింది.

ప్రేమంటే ఇదే!/రోజూ చూసే ముఖమే/ అయినా/ చూసిన కొద్దీ../చూడాలనిపిస్తుంది/ ప్రేమంటే../ఇదేనేమో..? ఈ కవితలోని ప్రతి పదం ప్రేమలోని స్వచ్ఛతను ఆరాటాన్ని ప్రతిబింబిస్తుంది. కానీ ఇక్కడ రజాహుస్సేన్ గారు అద్భుతంగా చెప్పారు, రోజు చూసే ముఖమే అయినా ఆ ముఖం పట్ల తనకు విసుగు రావట్లేదు అని చెప్పడం ద్వారా ప్రేమలోని ప్రత్యేకతను చాటుకున్నారు.. ఇది బాహ్యమైన ఆకర్షణ కాదు, ఆత్మతో పెనవేసుకున్న ఆత్మీయానుబంధం.

అలాగే 'అంతే' మినీ కవిత ఎంత సింపుల్ గా ఉందో అందులోని భావం అంతకంటే స్వీటుగా ఉంది. పెద్దగా/కోరికలేం లేవ్!/రోజూ/నీతో పాటు/ఓ కప్పు కాఫీ.అంతే! ఇది నిజమైన ప్రేమలోని తృప్తిని చాలా అందంగా చూపిస్తుంది. ఇష్టమైన మనిషితో కలిసి రోజు ప్రశాంతంగా ఒక కప్పు కాఫీ తాగిన క్షణాల్లోనే అసలైన స్వర్గం ఉందని ఈ కవిత చాలా సింపుల్ గా గుండెకు హత్తుకునేలా చెబుతుంది. 'ప్రేమ'కవితలో రజా హుస్సేన్ ప్రేమ యొక్క అసలైన తత్వాన్ని దాని అనంతమైన రూపాన్ని చాలా చక్కగా అభివర్ణించారు. అప్పుడప్పుడూ కాదు/ఎప్పుడూ ప్రేమించాలి /ప్రేమకు హద్దులు, సరిహద్దుల్లేవ్! వాయిదాలు, విశ్రాంతి,వర్జ్యం /రాహుకాలం, తిథి, నక్షత్రాలు,/వాస్తు దోషం లేనిది ప్రేమ ప్రేమ ఫ్రీ టికెట్ లాంటిది/ఎప్పుడైనా/ప్రయాణం చెయ్యొచ్చు... ఈ కవితలో రోజువారి జీవితంలో మనం చూసే విషయాలనే అంటే 'టికెట్, రాహుకాలం, నది' లాంటివి ఉదాహరణలుగా తీసుకొని ప్రేమకు ఒక అద్భుతమైన నిర్వచనం ఇచ్చారు. 'పరిమళం' మినీ కవితలో నువ్వు లేకున్నా/నీ పాద ముద్రల పరిమళం/ఇప్పటికీ గుప్పు మంటూనే వుంది!! నువ్వు నా పక్కన లేకపోయినా నీ జ్ఞాపకాలనే సువాసన నన్ను ఒంటరిని చేయకుండా ఎప్పుడూ నా చుట్టూనే ఉంటూ నన్ను బ్రతికిస్తుందని కవి చెప్పకనే చెప్పారు. 'షెహనాయి' కవితలో రాత్రి చిక్కిపోతోంది/వెన్నెల చిక్కనౌతోంది/ ఉలిక్కి పడి నిద్ర లేచాను/ ఎదురుగా నీ రూపం/ దూరంగా లీలగా... /బిస్మిల్లాఖాన్ షెహనాయి !అంటూ పలవరిస్తాడు కవి. ఈ కవితలో ప్రకృతి అంటే వెన్నెల రాత్రి, ప్రేమంటే ప్రేమికురాలి రూపం, ఇంకా సంగీతం అంటే షెహనాయి.. ప్రేమలోని మాధుర్యాన్ని, విరహవేదనను, ఎడబాటును 'ఆమె మినీ కవితా సంపుటి'లో అద్భుతంగా అక్షరీకరించి చెప్పిన అబ్దుల్ రజా హుస్సేన్ గారికి శుభాభినందనలు, వందనాలు.

**- పింగళి భాగ్యలక్ష్మి**
9704725609

# అనిర్వచనీయం బాణాల కవిత్వసారం

సృజన ఏ కొలమానాలకు అందనిది, అయితే కొందరు తమ సృజనతో సరికొత్త చైతన్యానికి పాదులు నెలకొల్పుతారు తమదైన ప్రతిభా వ్యుత్పత్తుల కేతనాన్ని గగనతలాన ఎగురవేస్తారు. సరిగ్గా అటువంటి కోవకే చెందుతాడు కవి డా. బాణాల శ్రీనివాసరావు. ఆయన గుండెలోని తడికి ఊపిరులూది అక్షరాలకు ఆయువు పోసి ''రాత్రిసింఫని లోని కవితాశిల్పాల్ని అపురూపంగా మలిచాడనిపిస్తుంది లేకుంటే, ఇంతటి అద్భుతమైన కవిత్వాన్ని అంత సౌందర్యవంతంగా ఎలా పండించగల్గుతాడు. రాత్రిసింఫని కవితా సంపుటిలోని తొలి కవితతోనే ఆయన సూక్ష్మమైన పరిశీలనా దృష్టి, జీవితంపట్ల తాత్విక దృక్పథం ఇట్టే మనకు స్పష్టమౌతుంది. జీవితం ముళ్ళపాన్పయినప్పుడు/ఓడిపోయిన ఆటల ఆలోచనే వద్దు/ అన్నిటినీ అనుభవాల అమ్ములపొదిలో పొదిగి/కొత్త వ్యూహాలకు పురుడు పోయాలి/అవమానాల పలుకురాళ్లపై/ ఆయుదాల్ని సాన పెట్టుకొని/ అదృశ్య అగంతకునిపై గురి పెట్టాలి.. అని అంటాడు.

ఈ కవితకు శీర్షిక 'వ్యూహగామి' అని పేర్కొన్నాడు. ఇందులో బతుకు భారమైనప్పుడు ఓటమిపాలయ్యానని కుంగిపోతూ వెనకడుగు వెయ్యక, ఆ అనుభవాన్ని పాఠంగా మలుచుకొని, సరికొత్త ఆలోచనాదృక్పథంతో ముందడుగు వేయగలిగితే, జీవనపథాన్ని సులభంగా చేరగలమనే స్పష్టమైన మార్గనిర్దేశనాన్ని కవి ధైర్యవచనంతో విశదపరిచిన తీరు అభినందనీయం.

మరో కవితలో పొందు పరిచిన ఈ పాదాలను పరికించండి.. 'విశ్వాన్ని జయించాలనుకుని/ పాతాళంలో పడిపోయి/ఆశల మబ్బుల పై ఎగిరే/ ఆకాశ విహంగాలు/ స్వార్థం ఊబిలో/ కూరుకుపోతున్న/అత్యంతాధునిక మానవ




యంత్రాలు/మనిషికి మనిషి తోడు మరుగై మనిషిని చూసి/ మనిషి భయపడటమే చారిత్రక విషాదం' అని మనిషి యొక్క బతుకు చిత్రాన్ని లోకపు యవనికపై అది నడయాడుతున్న వైనానికి కవితా రూపమివ్వడంలో సఫలీకృతను సాధించాడని చెప్పవచ్చును. ఇంకో కవితలో కవి బాణాల ఈనాటి మన విద్యావిధానాన్ని, అందులోని లోపాల పాలుని దృశ్యమానం చేస్తూ అంటాడు.' చెట్టు కొమ్మల్లో పిట్టల్లా సరస్వతీ నిలయాల్లో పిల్లలు' అంటూ 'కనుమరుగైన చిరునామాలు' అనే కవితా శీర్షికతో అందరిలోనూ అనేక ఆలోచనలను రేకెత్తించే విధంగా కవిత్వాన్ని మలిచిన విధం అబ్బురపరుస్తుంది. ప్రతి కవితా పాదంలోనూ భావ పరిమళం నేరుగా పఠితల గుండెల్ని తాకేలావుంది. చేతివృత్తులు వినాశనం కావింప బడినాక వృత్తికళా కారుల జీవితాలు కళావిహీనమై బతుకులు చతికిలపడ్డ వైనాన్ని దృశ్యమానం చేసి చూపిస్తూ అంటాడు..'మా చేతుల పెద్దబాడిషతో/ ఆరుగాలం అరకల్ని చెక్కి చెక్కి/ ఆకలిగొన్న దేశానికి అన్నం పెట్టినా/ అర్థాకలితో అలమటించే/ చెదలు తిన్న చెక్క పేళ్ళం' అని గాయపడ్డ వడ్రంగి గుండెల్లోకి పరకాయ ప్రవేశంచేసినట్టుగా వారి వ్యథలను, ఆకలి బాధలను చిత్రించాడనిపిస్తుంది.

భావోద్వేగాలతో చరించే మనిషి మనసు లోపల జరిగే అనేకానేక సంఘర్షణలకు, అక్షర రూపమిచ్చి, గతంలోని జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకొని, వాటికి అర్థభావాల్ని, అనుభూతి సుగంధాల్ని అద్ది చక్కని కవిత్వంగా రూపొందించే చమత్కారం ఈ కవి కలానికుందని ఆయన కవితలనేకం నిరూపిస్తాయి. ఒకచోట 'కొన్ని బాణాలు' అనే శీర్షికతో ఉన్న కవిత్వ పాదాలు చూస్తే 'టీ కప్పు ఒలికింది బండమీద/ఆధునిక చిత్రమైంది గుండెమీద/కురిస్తే ఖాళీ అవుతాయి మబ్బులు/ఎంతకురిసినా ఖాళీకానివే కళ్ళు/ ప్రవహించి ఆగేది నదీప్రవాహం/ ఎప్పటికీ ఆగనిదే రక్తప్రవాహం.. అంటూ అతి చిన్న చిన్న విషయాల్ని సైతం ఎంతో కళాత్మకంగా జీవితంతో అన్వయించి చెప్పగల్గిన అద్భుత భావసంపన్నుడు అగ్రశ్రేణి కవితా హృదయుడు బాణాల .ఈ కవి నిత్యపరిశీలన, నిరంతర పరిశోధనతో ఆధునిక సమాజానికి అవసరమైన తీరులో లోతుగా అధ్యయనం చేస్తూ, ఆలోచనాత్మకంగా వెలువరిస్తున్న ఈ కవిత్వం సాహిత్యలోకాన తనదైన ప్రత్యేకతను నిలుపుకుంటుందని విశ్వసిస్తూ...

**- రఘువీర్ ప్రతాప్ ఎన్వీ**
9440551552

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు**

**ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి**

**- ఎడిటర్**

## ఋణానుబంధం(ఎండమావులే)

ఋణానుబంధమై ఎదురైన నీడలివి,
కర్మలు వెన్నంటి నడిచే కాలపు కడియాలు.
రక్తబంధాలన్నీ ఎండమావులై ఎండిపోయెనేమో,
అనురాగమే ఆఖరి ఆశ్రయమని తెలిసెను.
బంధమంటే రక్తం కాదురా...
ఋణం తీర్చు తపమది,
పుట్టుకతో బిగిసే ఉచ్చు, మరణమే తెంచు కత్తెర.
జన్మల చక్రములో ఋణాలు
మాత్రమే నిజమైన బంధము,
తీర్చని బాకీలు కన్నీరు
కాగా కాల్చును హృదయము..కుటుంబం అనే నీడ
క్షణికమైన భ్రమయే కదా, అనురాగమే శాశ్వతమైన
దీపం, చీకటిని తరిమేది
ప్రేమతో తీర్చిన ఋణం ఆత్మకు విముక్తి బాట
చూపె, మళ్ళీ పుట్టకుండా మోక్షమునకు
దారి తీయును సాక్షి.

**-రాము కోలా**
9849001201

## విజయవాడలో సాహిత్య సమ్మేళనం

జులై 11, 12 తేదీల్లో విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఎంబీపీకే, సాహిత్య స్రవంతి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు 'సాహిత్య సమ్మేళనం - 2026' జరుగుతుంది. సమకాలీన సాహిత్యానికి సంబంధించిన వివిధ అంశాలపై ప్రముఖ కవులు, రచయితలు, విమర్శకులు ప్రసంగిస్తారు.

సాహిత్య చరిత్ర - వివిధ దృక్పథాలు, ప్రపంచీకరణ - ప్రతిఘటనా సాహిత్యం, కవిత్వనిర్మాణం- వస్తు,శిల్పాలు, కవిత్వ రచన వివిధ పద్ధతులు, తెలుగు కథ - సామాజిక చింతన, కథారచన-మెళకువలు, కవులు - రచయితలకు అధ్యయనం ఆవశ్యకత వంటి అంశాలపై చర్చలు జరుగుతాయి.

ఈ అంశాలపై రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, తెలకపల్లి రవి, ఖాదర్ మొహియుద్దీన్, గుంటూరు లక్ష్మీనరసయ్య, డా. కోయి కోటేశ్వరరావు, అట్టాడ అప్పలనాయుడు, ముహమ్మద్ ఖదీర్‌బాబు, ఆర్.సీతారాం మాట్లాడతారు.

'సృజనకారుల స్వరం' పేరిట నిర్వహించే కార్యక్రమంలో వర్తమాన సాహిత్యం, రచనా అనుభవాలు, సమకాలీన సాహిత్య సవాళ్లు, భవిష్యత్ దిశలపై వర్తమాన కవులు, రచయితలు తమ అనుభవాలను పంచుకుంటారు. యువ కవులు, యువ రచయితలు తమ రచనా ప్రయాణం, ఆలోచనలు, సాహిత్య ప్రపంచంపై తమ ఆకాంక్షలను పంచుకుంటారు.

వివిధ సాహిత్యాం శాలపై ప్రముఖ కవులు, రచయితలతో వర్తమాన రచయితల ప్రశ్నోత్తర కార్యక్రమం కూడా ఉంటుంది. సాహిత్యం, రచన, ప్రచురణ, సమ కాలీన సాహిత్య ధోరణులు, రచయితల అనుభవా లకు సంబంధించిన సందేహాలను పాల్గొనేవారు నేరుగా అడిగి నివృత్తి చేసుకునే అవకాశం ఉంటుంది.

యువ కవులు, రచయితలు, ఔత్సాహిక సాహితీ మిత్రులకు ప్రత్యేక ఆహ్వానం. పాల్గొనేవారు కింది బాధ్యుల్లో ఎవరో ఒకరికి ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. రెండు రోజుల పాటు భోజన, వసతి ఏర్పాట్లు ఉంటాయి.

మరిన్ని వివరాలకోసం గుండునారాయణ (9951540671),కె.స్వరూపరాణి (94900 98022), టి.క్రాంతి (9490098042), వర ప్రసాద్ (9490099059), చీకటి దివాకర్ (6300904525),కెంగార మోహన్ (94933 75447), గనారా (9949228298), కె. శ్రీనివాస్ (94900 98811)లను సంప్రదిం చవచ్చు.

# జ్ఞానపీఠ కవిత్వ సృజన మెరుపులు



హిందీ సాహిత్య చరిత్రలో బహుముఖ ప్రజ్ఞాశాలి సచ్చిదానంద హీరానంద వాత్స్యాయన 'అజ్ఞేయ'. ఆయన కలం పేరు 'అజ్ఞేయ'. ఆయన కవిత్వాన్ని అదే పేరుతో రాశాడు. ఆధునిక హిందీ సాహిత్యం కొత్త కవిత్వం ప్రయోగాలు, ('నయీ కవిత' ప్రయోగ్) ఉద్యమాలలో అత్యంత ఘనత సాధించిన వారిలో ఒకడుగా గుర్తింపు పొందిన కవి సచ్చిదానంద హీరానంద వాత్స్యాయన్ అజ్ఞేయ. సచ్చిదానంద హీరానంద వాత్స్యాయన్ 'ఆజ్ఞేయ' మార్చి 7,1911న కుషీనగర్ గ్రామం, దేవరియా జిల్లా, ఉత్తర్ ప్రదేశ్‌లో జన్మించారు. ఆయన రాసిన సంప్రదాయ నవల 'శేఖర'. 'ఏక్ జీవని' థీమ్ ఆ రోజులలో జరిగిన జైలు జీవితం గురించి. ఈ నవలలోని మూడవ భాగం జైలర్ సీజ్ చేసి మరల తిరిగి యివ్వలేదు, అందువల్ల ప్రచురిణకు నోచుకోలేదు. మొదట ఆయన ప్రగతిశీల రచయితల సంఘంతో సంబంధం కలిగి ఉన్నాడు. 1943 లో భారత సైన్యంలో చేరక ముందు ఆయన ఆల్ ఇండియా రేడియోలో కొద్ది కాలం పనిచేసాడు. 1957-58 లలో జపాన్ వెళ్ళి అక్కడ బెజ్ బౌద్ధమతాన్ని నేర్చుకున్నాడు. 1960లో ఐరోపా దేశానికి వెళ్లి అక్కడ ప్రైర్-డీ-క్వార్ ఆశ్రమంలో ఉన్నాడు. 1961 నుండి 1964 మధ్య యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా బాధ్యతలను నిర్వహించాడు. 1976లో హెడెల్బర్గ్ విశ్వవిద్యాలయంలో పనిచేసాడు. అ తదుపరి ఆజ్ఞేయ రాజస్థాన్ లోని జోధ్‌పూర్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, సమకాలీన సాహిత్య విభాగానికి అధిపతిగా పని చేశాడు. ఆయన 'ఆకలి తరం' (హంగ్రీ జెనరేషన్ లేదా భుక్తి పీర్తి)ఉద్యమంలో సభ్యుడు కూడా. 1964లో అంగన్ కే పార్ ద్వార్ (కవిత) రచనకు సాహిత్య అకాడమీ పురస్కారం పొందితే 1978లో 'కితీ్న నావోం మె కితీ్న బార్', ఆంధ్రాలజీ కవిత





లకు జ్ఞానపీఠ్ పురస్కారం,1983లో తన కవిత్వానికి భారత భారతి పురస్కారం గోల్డెన్ రెత్ ఆవార్డ్ అందుకున్నారు.

కన్నడలో 'వి.కె. గోకాక్'గా సుపరిచితులైన వినాయక కృష్ణ గోకాక్. కర్ణాటకలో ప్రజాదరణ పొందిన రచయిత. వినాయక కృష్ణ గోకాక్ ఆగస్టు9,1909 లో కర్ణాటకలోని ధారవాడజిల్లాలోని సవణూరు గ్రామంలో జన్మించారు. ధారవాడలో గోకాక్‌కు వరకవి దత్తాత్రేయ రామచంద్ర బెంద్రెతో పరిచయం కలిగినది. ఈ పరిచయం వలన గోకాక్ కు సాహిత్యం పట్ల ఆసక్తి పెరిగింది. బెంద్రె మార్గదర్శంలో కన్నడ సాహిత్యంలో గోకాక్ తన రచనా కృషిని మొదలు పెట్టాడు. గోకాక్ పూణెలోని ఫెర్గుసన్ విద్యాలయంలో ఇంగ్లీషు భాష ఉపన్యాసకుడగా నియమితుడయ్యాడు. అక్కడి కళాశాల యజమాన్యం ఆయన ప్రతిభను గుర్తించిఇంగ్లాండులోని ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయానికి పంపించారు. గోకాక్ అక్కడ ఇంగ్లీషు సాహిత్యంలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడైన ప్రథమ భారతీయుడు. ఇంగ్లాండులో విద్య ముగించుకొని వచ్చిన గోకాక్ సాంగ్లిలోని విల్లింగ్డన్ కళాశాలలో 1938 లో ప్రధానాధ్యాపకుడుగా నియమితుడయ్యాడు. కన్నడ సాహిత్యంలో గోకాక్ రచించిన గొప్ప గ్రంథాలలో 'సమరసవే జీవన' ఒకటి. ఈయన రచించిన 'జననాయక' అత్యధికంగా మన్నన పొందిన ప్రసిద్ధ నాటకం. 1958లో 40వ కన్నడ సాహిత్య సమ్మేళన అధ్యక్ష పదవిని చేపట్టాడు. 1961లో ఆయన 'ద్యవ పృథివి'కి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు,1990లో జ్ఞానపీఠ్ అవార్డు ఆయన ఇతిహాస రచన 'భరత సింధు రశ్మి'కి లభించాయి. గోకాక్ ఉద్యమం కర్ణాటక విద్యావ్యవస్థలో కన్నడ భాషకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సిఫార్సు చేస్తూ వి.కె.గోకాక్ నేతృత్వంలోని కమిటీ ఒక నివేదికను సమర్పించారు. ఈ నివేదికను అమలు చేయాలని కోరుతూ 1980లలో కర్ణాటకలో చారిత్రాత్మకమైన 'గోకాక్ ఉద్యమం' వ్యాప్తిచెందింది. ఈ ఉద్యమం ఫలితంగానే నేటికీ కర్ణాటక పాఠశాలల్లో కన్నడను ఒక నిర్బంధ పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. బెంగాలీ కవిత్వంలో 'కొత్త కవిత్వం' ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించిన బిష్ణు డే ఆధునిక బెంగాలీ సాహిత్య చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన ప్రముఖ కవి, జూలై 18, 1909న కలకత్తాలో జన్మించిన బిష్ణు డే కవి, వచన రచయిత, చలనచిత్ర విమర్శకుడు. బిష్ణు డే 1923లో ప్రచురణ ప్రారంభించి, ఒక నూతన శకానికి నాంది పలికిన 'కల్లోల్' పత్రిక పేరుతో వెలువడిన ఉద్యమంలో బిష్ణు డే ముందువరసలో ఒకరుగా నిలిచారు. 1930లో 'కల్లోల్' ప్రచురణ ఆగిపోయినప్పుడు, ఆయన సుధీంద్రనాథ్ దత్తాకు చెందిన 'పరిచయ్' పత్రికలో చేరి, 1947 వరకు దాని సంపాదకులలో ఒకరిగా పనిచేశారు. 1948లో చంచల్ కుమార్ ఛటోపాధ్యాయ సహాయంతో ఆయన 'సాహిత్య పత్ర' ను ప్రచురించారు. అలాగే, ఆయన 'నిరుక్త' అనే పత్రికకు కూడా సంపాదకత్వం వహించారు. ఆయన కవితా శైలి ప్రత్యేకతల్లో సాంప్రదాయ శైలిని పక్కనబెట్టి బెంగాలీ కవిత్వానికి ఆధునికతగా సరికొత్త కోణాన్ని పరిచయం చేశారు. భావజాలంలో ఆయన మార్క్సిస్ట్ తత్వశాస్త్రం మరింకా పాశ్చాత్య సాహిత్య అంశాలు, టి.ఎస్. ఎలియట్ శైలితో మిక్కిలి ప్రభావితం చూపాయి. 1940ల నాటి బెంగాల్ కరువు, రెండో ప్రపంచ యుద్ధం, దేశ విభజన వంటి చారిత్రక పరిణామాలు ఆయన కవితలలో స్పష్టంగా ప్రతిబింబించాయి. సాహిత్య ఉద్యమానికి బిష్ణు దే, జీబనానంద దాస్, బుద్ధదేబ్ బసు, సుధీంద్రనాథ్ దత్తా, అమియా చక్రవర్తి తదితరులు నాయకత్వం వహించారు. ఆయన ప్రముఖ రచనలు చోరబాలి, పుర్బోలేఖ్, ఉర్వశి ఓ ఆర్టెమిస్,ఆయన కవితా ప్రస్థానంలోనే మైలురాయిగా నిలిచిన గొప్ప కవితా సంకలనం స్మృతి సత్తా భవిష్యత్ కలవు. ఆయన పొందిన పురస్కారాలు, గౌరవాలు 1971లో ఆయన రాసిన 'స్మృతి సత్తా భవిష్యత్' రచనకు భారతదేశ అత్యున్నత సాహిత్య పురస్కారమైన జ్ఞానపీఠ్ అవార్డు లభించింది. 1965లో సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు పొందారు.

**- డా.టి. రాధాకృష్ణమాచార్యులు**
9849305871

# నాడు కళకళ..నేడు వెలవెల



- కరువు వస్తే కాళేశ్వరమే దిక్కు
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**బోయిన్ పల్లి, జూన్ 21(మనం న్యూస్ ):** మిడ్ మానేరు జలాశయం ఎండిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం అని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. చొప్పదండి నియోజకవర్గం పార్టీ నాయకులతో కలిసి ఆదివారం రాజరాజేశ్వర (మిడ్ మానేర్) జలాశయం సందర్శించారు.ఎడారిలా మారిన జాలాశం లో నాయకులు కార్యకర్తలు క్రికెట్,కబడ్డీ ఆటలు, ఆడి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణకే గుండెకాయ అయినటువంటి మిడ్ మానేరు జలాశయం పూర్తిగా ఎండిపోవడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కెసిఆర్ పాలనలో కాళేశ్వర ప్రాజెక్టు కట్టి, తెలంగాణకు సాగునీరు తాగునీరు గుర్తు లేకుండా చూసామని, నేడు దౌర్భాగ్య కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన పిల్లర్లను వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ కింద నీటిని ఎత్తిపోసి చెరువులు, కుంటలు నింపాలని కోరారు. లేకపోతే ఇప్పటికే నీటి కొరతతో నాట్లు ఎండిపోతున్నాయని, రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని హెచ్చరించారు. రైతులను ఆదుకోవాలంటే వెంటనే సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని సుంకే రవిశంకర్ డిమాండ్ చేశారు. అనంతరం టిఆర్ఎస్ నాయకులతో కలిసి ఎడారిలా మారిన మానేరులో కబడ్డీ క్రికెట్ ఆట ఆడారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

- యోగాభ్యాసంతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుంది
- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**జగిత్యాల, జూన్ 21( మనం ప్రతినిధి ):** యోగాభ్యాసంతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుంది అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు.ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ముఖ్య అతిథులు గా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది యోగా సాధనలో పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా

**ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ**

యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా యోగాకు లభిస్తున్న ఆదరణ భారతీయ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలిలో యోగా ఎంతో ఉపయుక్తమని, యువత ఆరోగ్య పరిరక్షణకు యోగాభ్యాసం ఎంతో దోహదపడుతుందని తెలిపారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామం సాధించారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రతిజ్ఞ చేశారు.

**అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ**

యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద అని పేర్కొన్నారు. యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. ప్రస్తుత జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ సుజాత, ఆయుష్ శాఖ అధికారులు, సిబ్బంది, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



- హాజరైన క్రీడా శాఖ అధికారి సురేష్ కుమార్

**సుల్తానాబాద్ జూన్ 21 (మనం న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్లోని ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై యోగా ఆసనాలను పరిశీలించి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా మన శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని, నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం విశిష్టతను వివరిస్తూ యోగా ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత పెరుగుతాయని పేర్కొన్నారు. తెలంగాణ ఒలింపిక్ సంఘం సభ్యులు సిలివేరి మహేందర్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి అమినిశెట్టి తిరుపతి లు మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి యోగా ఎంతో అవసరమని తెలిపారు. ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్ కోచ్, మాజీ భారత జట్టు ఖో ఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్ యాదవ్ ఆధ్వర్యంలో యోగా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు వెంకటేష్, రాజేష్, వాకర్స్ సంగం అధ్యక్ష కార్యదర్శులు సుమన్ , శ్రీనివాస్, ఖో ఖో క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం క్రీడాకారుల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు యోగా ప్రాముఖ్యతను మరింతగా చాటిచెప్పింది. అనంతరం ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్ కుమార్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

# జగిత్యాల స్పెషల్ సబ్ జైలులో యోగ దినోత్సవం వేడుకలు



**జగిత్యాల జూన్ 21( మనం ప్రతినిధి ):** అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని జగిత్యాల స్పెషల్ సబ్ జైలు లో ఆదివారం యోగ దినోత్సవాన్ని జైలు అధికారులు ఖైదీల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. గత 12 రోజులు గా యోగ మాస్టర్ రమేష్ ఖైదిలకు యోగ ఆసనాలు నేర్పించి చేయించారు.. యోగా ప్రాముఖ్యత గురించి ఖైదీలకు వివరించి వారితో యోగాసనాలు చేయించారు. ఈ సందర్బంగా స్పెషల్ సబ్ జైలు పర్యవేక్షణాదికారి మొగిలేష్ మాట్లాడుతూ యోగ ను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. నిత్యం యోగ చేయడంతో మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతామన్నారు. ఖైదిలు అందరూ తప్పని సరిగా ప్రతి రోజు యోగ ఆచరిస్తూ ఒత్తిడిని తప్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ దీప్యూటీ జైలర్ ఫయాజ్, సిబ్బంది మరియు ఖైదిలు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్య వంతమైన సమాజం సాధ్యం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్
- జగిత్యాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**జగిత్యాల ప్రతినిధి , జూన్ 21(మనంన్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్తో కలిసి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది యోగా సాధనలో పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ యోగాభ్యాసంతో ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని అన్నారు. యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా యోగాకు లభిస్తున్న ఆదరణ భారతీయ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలిలో యోగా ఎంతో ఉపయుక్తమని, యువత ఆరోగ్య పరిరక్షణకు యోగాభ్యాసం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామం సాధించారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద అని పేర్కొన్నారు. యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. ప్రస్తుత జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగకరమని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ సుజాత, ఆయుష్ శాఖ అధికారులు, సిబ్బంది, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రొ. జయశంకర్ జీవిత చరిత్ర పాఠ్యాంశంగా చేర్చాలి

- న్యాయవాది కూర్మాచలం ఉమా మహేష్



**జగిత్యాల, జూన్ 21 ( మనంప్రతినిధి):** తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమకారుడు, విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎస్.కే.ఎన్.ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ముందు గల ఆయన విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, న్యాయవాది కూర్మాచలం ఉమా మహేష్ మాట్లాడుతూ.... ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దేశవ్యాప్తంగా వినిపించి, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన గొప్ప మేధావి అని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాలను గణాంకాలతో సహా ప్రజలకు వివరించి, ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన నాయకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం ఆయన చూపిన మార్గం అందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విగ్రహ వ్యవస్థాపకులు న్యాయవాది కూర్మాచలం ఉమా మహేష్, స్థానిక కౌన్సిలర్ ఏనుగుల లావణ్య రాజేందర్, తెలంగాణ ఉద్యమ కారుడు ప్రహ్లాద శ్రీనివాస్ (అభి), బీజేపీ సీనియర్ నాయకుడు వీరబత్తిని అనిల్, మాజీ వైస్ ఎంపీపీ నల్ల శ్యామ్, సతీష్, పిల్లి శ్రీనివాస్, ములాసాపు రాజన్న, అత్తినేని శ్రీనివాస్, సురేందర్, పొలాస సత్యం, గడ్డం శ్రీనివాస్ కరుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




**జగిత్యాల జూన్ 21( మనం ప్రతినిధి ):** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఈరోజు ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ పాల్గొని పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి యోగా ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరమని, ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని సూచించారు. నిత్య జీవితంలో యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందడంతో పాటు ఒత్తిడి తగ్గి ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవడుతుందని తెలిపారు.ప్రస్తుతం వేగవంతమైన జీవనశైలిలో ఉద్యోగ బాధ్యతలు, వ్యక్తిగత ఒత్తిళ్ల మధ్య ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీసు శాఖలో విధులు నిర్వహించే సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు యోగా అత్యంత అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగా సాధన చేయాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం యోగా శిక్షకుల ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, వివిధ యోగా ఆసనాలు నిర్వహించారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది యోగా ద్వారా శారీరక ఉల్లాసం, మానసిక ప్రశాంతత పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ చేతన్ నితిన్ ఐపీఎస్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, ఇన్స్పెక్టర్లు ఎస్.ఐలు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో నీట్ పరీక్ష ప్రశాంతం



- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా
- పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్ జూన్ 21(మనం బ్యూరో):** జిల్లాలో నిర్వహించిన నీట్ -2026 పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. పరీక్ష నిర్వహణను ఆదివారం కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సంయుక్తంగా పర్యవేక్షించారు. జిల్లాలోని కరీంనగర్ లోని ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, కేంద్రీయ విద్యాలయంలో పరీక్షా కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ పోలీస్ కమిషనర్ ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల ప్రవేశం, ద్విస్థాయి భద్రతా తనిఖీలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, బయోమెట్రిక్ ధృవీకరణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. పరీక్ష సజావుగా జరిగేలా పోలీసు శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయగా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో భాగస్వాములైన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల నీట్ పరీక్ష విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. పరీక్ష సజావుగా సాగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని చెప్పారు. పరీక్ష ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, పరీక్ష పారదర్శక నిర్వహణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టామని, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.జిల్లాలోని మొత్తం ఏడు పరీక్షా కేంద్రాల్లో 3,001 మంది అభ్యర్థులకు గాను 2,661 మంది హాజరుకాగా, 340 మంది గైర్హాజరయ్యారు.

# పాలకొల్లులో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**పాలకొల్లు, జూన్ 21,మనం ప్రతినిధి** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పాలకొల్లు పట్టణ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.పాలకొల్లు పట్టణ బీజేపీ అధ్యక్షులు కొల్లి కొండ ప్రసాద్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కొల్లి కొండ ప్రసాద్ మాట్లాడుతూ, యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి మార్గదర్శకమైన భారతీయ ఋషుల అమూల్యమైనవారసత్వమని పేర్కొన్నారు. ఒకప్పుడు భారతదేశానికే పరిమితమైన యోగాను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేసి, జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటింపజేసిన ఘనత గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కే దక్కుతుందని అన్నారు. రాష్ట్ర మీడియా ప్యానల్ ఇన్చార్జ్ ఉన్నమట్ల కబర్ది మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై శక్తివంతమైన దేశంగా అవతరించిందని, ఆర్థిక, సాంకేతిక, అంతరిక్ష, రక్షణ రంగాలలో అపూర్వ విజయాలను సాధించిందని కొనియాడారు. ఆరోగ్యవంతమైన పౌరులే వికసిత భారత నిర్మాణానికి పునాది అని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో గవర పవన్ నాయుడు ,మల్లవోలు సురేష్, నాలం బాబి, బెల్లంకొండ నరసింహారావు , గాది వెంకటేశ్వరరావు, గోనుగుంట్ల రంగారావు, కోరాడ సూరిబాబు, ఇనుకొండ శేషాద్రి, మరియు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యోగా మన పూర్వీకుల దైనందిన జీవితంలో ఒక భాగం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 21(మనం బ్యూరో):** యోగా మన పూర్వీకుల దైనందిన జీవితంలో ఒక కీలక భాగమై ఉండగా, నేడు అదే యోగాను ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు అనుసరిస్తున్నాయని ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ లోని పిల్లల మర్రిలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఎమ్మెల్యే, మహబూబ్ నగర్ ఎంపి డికె అరుణ కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,... భారతదేశానికి చెందిన యోగా సంప్రదాయాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో ఐక్యరాజ్యసమితిలో ఆమోదించిన తీర్మానం కీలకమని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం ప్రతిపాదించిన యోగా తీర్మానానికి 193 దేశాల్లో 177 దేశాలు మద్దతు ఇవ్వడం యోగాకు ఉన్న విశ్వవ్యాప్త ప్రాధాన్యతను తెలియజేస్తుందని చెప్పారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు కూడా పరిశోధనల ద్వారా నిరూపించారని తెలిపారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక సమతుల్యత, ఒత్తిడి తగ్గింపు, జీవనశైలి మెరుగుదలలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అనేక రకాల వ్యాధులను నియంత్రించడంలో యోగా ఉపయుక్తమని అంతర్జాతీయ అధ్యయనాలు వెల్లడించాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా యోగా ప్రాముఖ్యత పెరిగినప్పటికీ, మనం దానిని ప్రతిరోజూ ఆచరించడంలో కొంత వెనుకబడుతున్నామని అభిప్రాయపడ్డారు. బిజీ జీవితంలో కనీసం రోజుకు 30 నుంచి 40 నిమిషాలు యోగా, ప్రాణాయామం లేదా ధ్యానం కోసం కేటాయిస్తే శరీరానికి, మనసుకు ఎంతో మేలు జరుగుతుందని సూచించారు. ప్రతి సంవత్సరం జూన్ 21న. యోగా దినోత్సవం జరుపుకోవడానికి ప్రత్యేక కారణం ఉందన్నారు. ఈ రోజు ఉత్తర గోళార్ధంలో సంవత్సరంలో అత్యంత పెద్ద రోజు కావడం వల్ల దీనికి ప్రాధాన్యం ఉన్నదని తెలిపారు. ఈ ఆలోచనను భారత ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ముఖ్యంగా మహిళలు ఎదుర్కొనే అనేక ఆరోగ్య సమస్యలకు యోగా సమర్థవంతమైన పరిష్కారమని పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక సంస్థలు, గురువులు యోగా జ్ఞానాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ సమాజానికి అందిస్తున్నారని చెప్పారు. మన పూర్వీకులు అందించిన ఈ అమూల్యమైన సంపదను కాపాడుకుంటూ, ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఎంపి, డి. కె అరుణ మాట్లాడుతూ... మానసిక ఒత్తిడిని ఎదుర్కొనడానికి, ఏకాగ్రత పెంపొందించేందుకు, సమతుల ఆరోగ్యంకు యోగా దోహద పడుతుందన్నారు. యోగాను ప్రధాన మంత్రి ఐక్య రాజ్య సమితి ద్వారా ప్రపంచ దేశాల్లో జూన్ 21 ప్రపంచ యోగా డే గా ప్రకటించి నిర్వహించడం వలన యోగా విశ్వ వ్యాప్తం అయిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంపి. డి. కె అరుణ ల యోగా చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కార్పొరేటర్లు మేగ్యా నాయక్, రమేష్ రెడ్డి, ప్రశాంత్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు బెక్కరి మధుసూదన్ రెడ్డి, డి.ఎఫ్.ఓ శివ్ ఆశిష్ సింగ్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామానుజులు రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె శ్రీనివాసులు, జిల్లా యువజన క్రీడల అధికారి రాజ శేఖర్ రెడ్డి, ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.ఎం.చంద్ర శేఖర్, డిస్ట్రిక్ ప్రోగ్రామ్ మేనేజర్ డా . సురేష్ నాయక్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ లు డా ఆది శేషయ్య, డాక్టర్లు రూత్, రాజేందర్, వివిధ పాఠశాలల విద్యార్థులు, సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల విద్యార్థులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై బూత్ లెవెల్ ఏజెంట్లతో మంత్రి సమావేశం



**సంగారెడ్డి, జూన్ 21 మనంప్రతినిధిః** ఆందోల్ నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంపై ఆందోల్, వట్పల్లి, పుల్కల్, చౌటకూరు మండలాలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్స్ ( బి ఎల్ ఎ)లతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డిలోని తన నివాసంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను గుర్తించి సవరణలు చేపట్టేందుకు కృషి చేయాలని, అర్హులైన ఓటరు కూడా జాబితా నుండి తప్పిపోకుండా చూడాలని అన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్న మంత్రి , ప్రతి ఓటరులో తమ ఓటు హక్కుపై అవగాహన పెంపొందించే దిశగా బూత్ లెవెల్ ఏజెంట్లు పనిచేయాలని కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియపై ప్రతి ఏజెంట్ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, దాని ముఖ్య ఉద్దేశాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆందోల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

- లేనియెడల సేవలాల్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహిస్తాం
- సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ నాయక్

**హనుమకొండ జిల్లా జూన్21(మనం న్యూస్)ః** కాకతీయ యూనివర్సిటీ సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వాంకుడోత్ అశోక్ నాయక్ కాకతీయ యూనివర్సిటీ సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ నాయక్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఎస్ఐ మరియు కానిస్టేబుల్ ల ఉద్యోగ నోటిఫికేషన్లు భర్తీ చేయనందున నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు పొందలేకపోవడం చాలా



బాధాకరమైన విషయమని కొనియాడారు అలాగే నిరుద్యోగులు 15 లక్షల మంది ఉండగా 5000 నోటిఫికేషన్లు విడుదల చేస్తామనడం సరి అయింది కాదని 15 లక్షల మంది నిరుద్యోగులు ఉంటే ఐదు వేల నోటిఫికేషన్లు విడుదల చేయడం ఇది ఎలా సబబు అని మాట్లాడారు 20 వేల నోటిఫికేషన్లు విడుదల చేయాలని అలాగే ఉద్యోగాల విషయంలో వయస్సు 5 సంవత్సరాల సడలింపు చెయ్యాలని గవర్నమెంట్ కు సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ నాయక్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు నిరుద్యోగులు పాల్గొన్నారు.

# నేడు నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో మంత్రి సీతక్క పర్యటన

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టనున్న మంత్రి సీతక్క

## నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేశ్వర్ రెడ్డి వెల్లడి

**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 21 (మనం బ్యూరో):** నేడు నియోజకవర్గంలోని రూ.20 కోట్ల హై లెవల్ బ్రిడ్జి, ఇందిరా మహిళా శక్తి భవన్ పరిశీలన, భరోసా సెంటర్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క, నాగర్కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఈ నెల 22వ. తేదీ సోమవారం నాగర్కర్నూల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమాల్లో పర్యటించనున్నట్లు నాగర్కర్నూల్ శాసనసభ్యుడు డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు మహిళా సంక్షేమం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను మంత్రి సీతక్క పరిశీలించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క సోమవారం ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్లోని ప్రజాభవన్, బేగంపేట నుంచి రోడ్డు మార్గంలో నాగర్కర్నూల్ జిల్లాకు బయలుదేరి ఉదయం 10 గంటలకు తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామానికి చేరుకోనున్నారు. అక్కడ దుండుభి వాగుపై రూ.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న హై లెవల్ బ్రిడ్జి (హెచ్ఎల్బీ) నిర్మాణ పనులకు శంకుస్థాపన



చేయనున్నారు.

ఈ వంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత సిర్సవాడతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు అన్ని కాలాల్లో సురక్షిత రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి తెలిపారు. వర్షాకాలంలో ఎదురయ్యే రాకపోకల ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు గ్రామీణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఈ వంతెన కీలకంగా మారనుందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మంత్రి నాగర్కర్నూల్ పట్టణానికి చేరుకుని మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా ప్రతిపాదించిన రూ.5 కోట్ల వ్యయంతో కూడిన ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలను పరిశీలించనున్నారు. ఈ భవన్ ద్వారా మహిళా సంఘాల కార్యకలాపాలు మరింత బలోపేతం కావడంతో పాటు మహిళలకు శిక్షణ, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా తెలంగాణ పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులకు భద్రత, రక్షణ, మానసిక పరామర్శ, న్యాయ సహాయం, పునరావాస సేవలను ఒకే వేదికపై అందించేందుకు ఏర్పాటు చేయనున్న భరోసా సెంటర్కు మంత్రి సీతక్క శంకుస్థాపన చేయనున్నారు. మహిళల భద్రత, గౌరవ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భరోసా కేంద్రాలు బాధిత మహిళలు, చిన్నారులకు సమగ్ర సహాయాన్ని అందించే కీలక కేంద్రాలుగా పనిచేస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క నాగర్కర్నూల్ నుంచి రోడ్డు మార్గంలో హైదరాబాద్కు బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి చేరుకోనున్నట్లు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి తెలిపారు.

మంత్రి పర్యటన నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- బందోబస్తును పరిశీలించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి, జూన్ 21 మనంప్రతినిధిః** నీట్-యూజీ 2026 పరీక్ష సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ తారా డిగ్రీ కళాశాల, సంగారెడ్డి; కేంద్రీయ విద్యాలయం (ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ); జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంగారెడ్డి (బాలుర); జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంగారెడ్డి (బాలికల); జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతిరెడ్డిపల్లి; ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల; ప్రభుత్వ మహిళల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ సందర్శించి అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుందని, పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను తెరవడానికి అనుమతి లేదని తెలిపారు. అలాగే సెక్షన్-163 బీఎన్ఎస్ఎస్ (సెక్షన్-144 సీఆర్పీసీ) అమల్లో ఉంటుందని, గుంపులు గుంపులుగా తిరగడం నిషేధమని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయని, ఎలాంటి కమ్యూనికేషన్ సిగ్నల్స్ అందకుండా జామర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. తప్పుడు వార్తలు, వదంతులు (రూమర్స్) ప్రచారం చేసి పరీక్షల ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాపై జిల్లా పోలీసు కార్యాలయం ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని అన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే తప్పుడు వార్తలు, నిర్ధారణ లేని ఫార్వర్డ్ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తప్పుడు సందేశాలను వ్యాప్తి చేసే సంబంధిత వ్యక్తులతో పాటు గ్రూప్ అడ్మిన్లు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# యోగాతో స్ట్రాంగ్ మైండ్.. ఇన్ స్ట్రాంగ్ బాడీ





- యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం
- భారతదేశం యోగాకు పుట్టినిల్లు
- రఘునందన్ రావు, ఎంపీ

**సిద్దిపేట, జూన్ 21(మనం ప్రతినిధి)ః** నిత్య యవ్వనంగా ఉండాలంటే రోజూ యోగ చేయాలని పని ఒత్తిడి మూలంగా చాలామంది శారీరక వ్యాయామాలు చేయడం లేదని ఆరోగ్య సంరక్షణ కోసం తప్పనిసరిగా యోగ చెయ్యాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. సిద్దిపేటలో 12వ అంతర్జాతీయ యోగా కార్యక్రమం లో ఆదివారం ఆయన పాల్గొని ప్రసంగించారు. స్ట్రాంగ్ మైండ్ ఇన్ స్ట్రాంగ్ బాడీ అని ప్రఖ్యాత తత్వవేత్త అరిస్టాటిల్ ఎప్పుడో ఆరోగ్య సంరక్షణ కోసం చెప్పాడని అన్నారు. ప్రతిరోజు యోగా చేస్తే వయస్సు ఎరిగిన శరీరక ఉత్తేజాన్ని నిలుపుకోగలమని తెలిపారు. శారీరక శ్రమ లేకపోవడం ఎప్పుడు సెల్ ఫోన్ చూడడం మూలంగా చిన్నపిల్లలలో ఒబేసిటీ పెరుగుతుందని నిత్యం యోగ చేస్తూ ఆరోగ్యవంతమైన అలవాట్లను పాటించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ లాంటి రాజకీయ నాయకులు 75 సంవత్సరాల లో కూడా స్ట్రాంగ్ గా ఉన్నారంటే నిత్యం యోగ, ఆరోగ్యవంతమైన సాత్విక ఆహారం తీసుకోవడం కారణమని చెప్పారు. జిల్లా కలెక్టర్ కే హైమావతి మాట్లాడుతూ ఋషులు అందించిన భారతదేశ ప్రాచీన ఆరోగ్య కార్యక్రమం యోగ అని అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తం యోగా కార్యక్రమం విస్తృతంగా ప్రచారం పొంది ఆచరిస్తున్నారని, యోగాకు పుట్టిల్లు అయిన భారత దేశంలో దాని ప్రభావం కోల్పోకుండా ప్రజలు తప్పకుండా ఆచరించేలా యోగ కార్యక్రమాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడానికే ఈ అంతర్జాతీయ యోగ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించడం జరిగిందని తెలిపారు. తాను ప్రతిరోజు ఒక గంట యోగ చేస్తానని ప్రతి వ్యక్తి ప్రతిరోజు యోగాను దినచర్యగా పాటించి ఆరోగ్యంగా జీవించాలన్నారు. యోగ ప్రభావం మనసు, శరీరం ఉత్తేజం చేస్తుందని రొటీన్ గా కాకుండా ఇష్టంగా యోగ అభ్యసనం చెయ్యాలనీ, యోగతో పాటు సాత్వికాహారం తీసుకొని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో యోగ నోడల్ అధికారి ఆయుష్ డాక్టర్ ఉమాదేవి, సిద్దిపేట ఆర్డిఓ సదానందం విద్యార్థులు ఉద్యోగులు పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కపై బురదజల్లితే నిజాలు మారవు

- జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ తాజుద్దీన్ ఫైర్

**ములుగు జూన్ 21, మనం ప్రతినిధి:** సీతక్కపై విమర్శలు కాదు, రాజకీయ అసూయ.ప్రజల ప్రేమను చూసి బీఆర్ఎస్ నేతలకు నిద్రలేని రాత్రులు.ములుగు నియోజకవర్గంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క సీతక్క పై ఇసుక దోపిడీ అంటూ ఓ. ఖీ. రామ రావు కేటీఆర్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అబద్ధాలు, రాజకీయ దుష్ప్రచారమేనని జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి తాజుద్దీన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజల కోసం



అహర్నిశలు కష్టపడుతున్న సీతక్క పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.గత పాలనలో అవినీతి, దోపిడీ, అక్రమాలతో రాష్ట్ర సంపదను దోచుకున్నవారే ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం కేటీఆర్కు అలవాటైందని, ప్రజలు ఇక అబద్ధపు ప్రచారాలను నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు..మంత్రి సీతక్క సేవలు, అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమం చూసి రాజకీయ అసూయతోనే ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని, వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు..ములుగు ప్రజలు నిజం ఎవరిదో బాగా తెలుసు-అబద్ధాల రాజకీయాలకు తగిన బుద్ధి చెప్పే సమయం దగ్గరపడిందని జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి తాజుద్దీన్ హెచ్చరించారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టూ డస్క్ కార్యక్రమం



**గజ్వేల్, జూన్ 21 మనం న్యూస్ః** వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టూ డస్క్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్,వాసవి యూత్ క్లబ్,వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వాసవి క్లబ్ సీనియర్ నాయకులు రేణుకుంట శ్రీనివాస్,గంప కృష్ణమూర్తి,చింత రాజేంద్ర ప్రసాద్, మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవా అని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కేవలం ఆర్యవైశ్యులు దాదాపు లక్షకు పైగా సభ్యత్వం కలిగి ఉన్న వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ ద్వారా అన్ని కులాల వారికి సహాయ సహకారాలు అందిస్తుందని గజ్వేల్ ప్రాంతంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ జగ్గయ్యగారి శేఖర్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ సభ్యులు విశేష సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు అనంతరం నాచారం దేవస్థానం డైరెక్టర్ వాసవి క్లబ్ జోన్ చైర్మన్ జగ్గయ్య గారి శేఖర్ మాట్లాడుతూ సేవకు ప్రతిరూపం వాసవి క్లబ్ అని ,వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ అనే కార్యక్రమం ద్వారా గోశాలలో గోవులకు దానా సమర్పించి,మొక్కలు నాటి, రక్తదానం చేసేవారి పేర్లు నమోదు చేసుకుని అనంతరం కస్తూరిబా బాలికల పాఠశాలలో మెడికల్ కిట్స్ అందజేసి ఉత్తమ ప్రతిబ కనబరిచిన వారిని సన్మానించడం జరిగిందని, అలాగే రాబోయే రోజుల్లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృత పరుస్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో మరియాల శ్రీనివాస్, సిద్ది రామచంద్రం,ఉప్పల కృష్ణమూర్తి,కాశీనాథ్,గంగిశెట్టి ఉమేష్,గంగ రమేష్,కైలాస ప్రశాంత్, నితీష్,రామారం రమేష్, విక్రాంత్, గందే సంతోష్,సిరిపురం సత్యనా రాయణ, తెరాల రాజు, ఉప్పల చంద్రశేఖర్, వాసవి వనిత క్లబ్ సభ్యులు జగ్గయ్యగారి లత,సరిత, చంద్ర కళ,వాసవి క్లబ్ సభ్యులు ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు



# తెలంగాణ ఉద్యమ కారులు జూన్ 28 లోగా తమ దరఖాస్తు లను అందజేయాలి

**సిద్దిపేట జూన్ 21; మనం ప్రతినిధి:** రాష్ట్ర సాధన ఉద్యమం లో పాల్గొన్న ఉద్యమ కారులు జూన్ 28 లోగా తమ దరఖాస్తు లను అందజేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. టీజేఏసీ చైర్మన్, తెలంగాణ ఉద్యమ కారుల సంఘం నాయకుడు పాపయ్య అధ్యక్షతన సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో సంఘం ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమం లో భాగస్వాములై న ఉద్యమకారులు తమ తమ సంఘాల ప్రతినిధులకు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. టీజేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమం లో భాగస్వాములు అయిన. విడిగా ఉద్యమాలు నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, జర్నలిస్టుల రచయితల, కవుల, కళాకారుల, ఆర్టీసీ, విద్యుత్, రైతు,విద్యార్థి దళిత, బహుజన, మహిళా సంఘాల, ప్రజాసంఘాలు, డాక్టర్లు, న్యాయవాదుల సంఘాల వారికి విడివిడిగా బాధ్యులను ఏర్పాటు చేయడం జరిగిందని వారికి తమ దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల ఉద్యమకారులు తమ తమ పార్టీల నా యకత్వాలకు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. దరఖాస్తు తో పాటు ఉద్యమం లో తాము పాల్గొన్న ఆధారం జతచేయాలని సూచించారు. జిల్లా లోని గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్, బెజ్జంకి ప్రాంతాల ఉద్యమకారులు స్థానికంగా దరఖాస్తు లను తయారు చేసి స్థానిక టీజేఏసీ ప్రతినిధులకుగాని, తెలంగాణ ఉద్యమ కారుల సంఘాల ప్రతినిధులకు గాని అందజేయాలని తెలిపారు. జూన్ 28 తరువాత దరఖాస్తులు స్వీకరించబడవని సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు.

# పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవం



**గజ్వేల్, జూన్ 21(మనంన్యూస్)ః** పతంజలి యోగ సమితి, గజ్వేల్ శాఖ అధ్వర్యంలో స్థానిక బాలుర ఎస్సీ మరియు బిసి బాలుర హాస్టల్ లో అంతర్జాతీయ యోగ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. ఆకుల నరేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పతంజలి మహర్షి ప్రపంచ మానవాళికి అందించిన గొప్ప వరం యోగ శాస్త్రం అనీ, ప్రతి నిత్యం యోగ అభ్యాసం ద్వారా మనిషి శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ధార్మికంగా, ఆధ్యాత్మికంగా ఉన్నత వ్యక్తిగా ఎదుగుతాడని తెలియజేశారు. మన భారత దేశ ప్రధాని నరేంద్ర మోడి 2014 సెప్టెంబర్ 17 వ తేదీన ఐక్య రాజ్య సమితి లో ప్రపంచ వ్యాప్తంగా జూన్ 22 నాడు అంతర్జాతీయ యోగ దినోత్సవం జరుపాలని ప్రతిపాదన చేశారు. ఐ. రా. స. లోని 193 మంది ప్రతినిధులలో 175 మంది మద్దతు తెలిపి తీర్మానం ఆమోదించారు. జూన్ 21 న ఉత్తరార్ధగోళంలో అత్యంత పగటి సమయం ఉంటుంది. 2015 జూన్ 21 రోజు మొట్ట మొదటి అంతర్జాతీయ యోగ దినోత్సవం జరుపుకోవడం జరిగింది. యోగాచార్య వంగాల రంగాచారి అధ్వర్యంలో కామన్ యోగ ప్రొటోకాల్ ప్రకారం యోగ సాధన నిర్వహించడం జరిగింది. బాల యోగ సాధకుడు కడారి అఖిలేష్ మరియు చిలివేరి జనార్దన్ ప్రదర్శించిన కఠిన ఆసనాలు అందరినీ ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో పతంజలి యోగ సమితి సభ్యులు కడారి నరేంద్ర, మనీష, చిలివేరి జనార్దన్, గడ్డమీది నాగభూషణం, దొంతుల ఆనంద్, కుడిక్యాల రాములు, చిలివేరి బలరాం,వుప్పల మధుసూదన్, హాస్టల్ వార్డెన్స్ పోశాద్రి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో జయశంకర్‌కు ఘన నివాళి



**సిద్దిపేట, జూన్. 21(మనంప్రతినిధి)ః** తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు చరిత్ర పుటల్లో.. తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని తెలంగాణ ఉద్యమ కారుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.. ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో తెలంగాణ ఉద్యమ కారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.. జయశంకర్ సార్ చిత్రపటానికి పూలు చల్లి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఒఅఇ చైర్మన్ ఎ. పాపయ్య, ఖీఖీఊ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎ. తిరుపతి రెడ్డి, జిల్లా వర్కింగ్ జర్నలిస్టు సంఘం అధ్యక్షులు కె. రంగాచార్య, తెలంగాణ ఉద్యమ సంఘం జిల్లా నాయకులు కర్రోళ్ల బాబు ఖమ్మంపల్లి యాదగిరి, పెద్ది రాజు, సీనియర్ జర్నలిస్ట్ కూతురు రాజి రెడ్డి,మంజీరా రచయితల సంఘం కార్యదర్శి సిద్దెంకి యాదగిరి, తెలంగాణ రచయితల సంఘం ప్రతినిధులు కొండి మల్లారెడ్డి, మహమూద్ పాషా, ఖీూఎ సంఘం జిల్లా నాయకులు విక్రమ్ రెడ్డి, శ్రీహరి, అశ్వాక్, రచయితలు డబ్బికారి సురేందర్, రాములు,స్వరూప, విజయ,జర్నలిస్ట్ బుచ్చి రాజంరెడ్డి, మైసారెడ్డి,బన్సీలాల్, తదితరులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర సాధన అంశాన్ని యాభై ఏళ్లు తన భుజస్కాందాలపై మోసుకొని తీసుకువెళ్ళాడని తెలిపారు.. మూడు దాఫాలుగా జరిగిన తెలంగాణ ఉద్యమం లో జయశంకర్ సార్ కీలక పాత్ర నిర్వహించారని తెలిపారు. తన రచనల ద్వారా.. తన ఉపన్యాసాల ద్వారా ప్రజలను చైతన్యం చేసి ఉద్యమానికి పునాదులు వేశాడని తెలిపారు. జయశంకర్ సార్ స్ఫూర్తి తోనే తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడిందని అన్నారు.ఆయన స్ఫూర్తి తో జరిగిన ఉద్యమం విజయవంతం అయిందని రాష్ట్రం సాధ్యం అయ్యిందని అన్నారు.జయశంకర్ సార్ ఇచ్చిన స్ఫూర్తి తో సిద్దిపేట నుండి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని ప్రారంభించిన ఓఇఖ ఉద్యమాన్ని ముందుకు నడిపాడని తెలిపారు. ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం, అమరుల త్యాగాలు, వెరసి తెలంగాణ రాష్ట్రం సాకారం అయ్యిందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం లో జయశంకర్ సార్ పేరు సువర్ణ అక్షరాలతో లిఖించబడి ఉంటుందని స్పష్టం చేశారు.

# ఘనంగా మాజీ ఎంపీ బుట్టా రేణుక జన్మదిన వేడుకలు

- నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, 101 టెంకాయలతో మొక్కు సమర్పణ



**ఎమ్మిగనూరు జూన్ 21 మనం న్యూస్:** మాజీ పార్లమెంట్ సభ్యురాలు, బుట్టా రేణుక జన్మదినం సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆమె ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ప్రజాసేవా సంకల్పం మరింత బలపడాలని కోరుతూ భక్తులు, నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారుజన్మదిన వేడుకలలో నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు శ్రీమతి బుట్టా రేణుక గారు సంపూర్ణ ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని, ప్రజల ఆశయాలను నెరవేర్చే నాయకురాలిగా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భగవంతుడిని ప్రార్థించారు.అనంతరం నీలకంఠేశ్వర స్వామివారికి 101 టెంకాయలతో ప్రత్యేక మొక్కు సమర్పణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ



**వైరా, జూన్ 21 (మనం న్యూస్):** ఈ నెల చివరి వారంలో మధిర నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఉంటుందని ఆ పర్యటన ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ కేంద్రం లోని ఎన్‌వీఎస్ గార్డెన్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పనిచేస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన గ్యారంటీ పథకాలన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేసి చూపించారని అన్నారు. పేదల కోసం కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, వృద్ధులకు వికలాంగులకు పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు, వడ్డీ లేని రుణాలు, రైతులకు రైతు రుణమాఫీ , రైతు భరోసా, రైతు భీమా పథకం ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ పథకం, మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కోట్లాది రూపాయల ఖర్చుతో సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులు అందించారని అన్నారు .ఈనెల చివరి వారంలో మధిర నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఉంటుందని తెలిపారు. ఈ నెల 22వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే మహిళ నారి శక్తి సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ హాజరవుతున్నారని తెలిపారు. వైరా నియోజకవర్గ కేంద్రంలోని వైరా మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మా రోశయ్య, జిల్లా నాయకులు రంగా జనార్ధన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్ళ ముళ్లపాటి సీతారాములు, వేముల రత్నాకర్, బి కే నాయక్, చిత్తారి శ్రీనివాస్ , రాచబంటి రామకృష్ణ ,నంబూరి ఓంకార్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులను మోసగించడంలో చంద్రబాబు రికార్డు: మాజీ సీఎం జగన్

**అమరావతి, జూన్ 21 (మనం న్యూస్):** సీఎం చంద్రబాబు రైతులను మోసం చేయడంలో రికార్డులను బద్దలు కొడుతున్నారనీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అయినా, మేనిఫెస్టోలో మీరు ఇచ్చిన 143 హామీలు అయినా, అన్నీ మోసాలే అన్నారు. మా ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లపాటు 53.58 లక్షల రైతు కుటుంబాలకు క్రమం తప్పకుండా రైతు భరోసా అందించింది. ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నా, కరోనా వచ్చినా, ఒక్క సంవత్సరం కూడా తప్పలేదు. పైగా మేము మేనిఫెస్టోలో చెప్పినదానికన్నా మిన్నగా చేశామని జగన్ చెప్పారు. ఎన్నికల ముందు రాజమండ్రి వేదికగా నిలబడి, పీఎం కిసాన్ కు అదనంగా ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.20,000 ఇస్తానని ఘనంగా ప్రకటించారు. ఇప్పుడు అదే రైతులను మోసం చేసి, మళ్లీ రైతు ప్రేమికుడిలా మాట్లాడటం విడ్డూరంగా ఉంది.

అదనంగా మీరు ఇస్తానన్నది ఇవ్వకుండా ఎగరగొట్టింది రూ.20,000. రైతులకు ఇచ్చింది - సున్నా. 2025-26లో ఇవ్వాల్సింది రూ.20,000. ఇచ్చింది కేవలం రూ.14,000 మాత్రమే. 2026-27లో ఇవ్వాల్సింది రూ.26,000. ఇప్పటివరకు ఇచ్చింది - కేవలం రూ.5,000. అంటే మూడేళ్లలో ఒక్కో రైతు కుటుంబానికి మీరు ఇచ్చిన హామీ ప్రకారం పీ ఎం కిసాన్ కాకుండా రూ.60,000 ఇవ్వాల్సి ఉండగా, ఇచ్చింది కేవలం రూ.19,000.పైగా మీరు పథకం నుంచి 7 లక్షల మందిని నిర్దాక్షిణ్యంగా తొలగించారు. మా హయాంలో 53.58 లక్షలమంది రైతు కుటుంబాలకు పెట్టుబడి సహాయం అందితే, మీరు దాన్ని 46.85లక్షల మందికి కుదించారు. కౌలు రైతులకు, పట్టాలున్న గిరిజనులకూ మొండిచేయి చూపారు.మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. ధరల స్థిరీకరణ నిధికి ఎగనామం పెట్టారు. ఐదేళ్లలో ధరల స్థిరీకరణ కింద రూ.7,800 కోట్లు ఖర్చు చేసి, రైతులకు గిట్టుబాటు ధరలకు కేరాఫ్ అడ్రస్గా మేం నిలిచాం. ఈ రెండేళ్లలో మీ హయాంలో వరి, మొక్కజొన్న, అరటి, కొబ్బరి, పత్తి, మినుములు, పెసలు, సజ్జలు, మిర్చి, పొగాకు, ఉల్లి, టమోటా, కోకో, చీనీ, మామిడి ఇలా పంటల ధరలు పడిపోయినా మీకు పట్టనట్టే వ్యవహరించారు. ఉచిత పంటల బీమాను రద్దుచేశారు. రైతులే ఇప్పుడు ఇన్సూరెన్స్ డబ్బులు కట్టుకోవాల్సిన పరిస్థితి. రైతులు కష్ట, నష్టాలు భరించి ఇన్సూరెన్స్ కట్టినా, మీరు ప్రభుత్వం నుంచి కట్టాల్సిన ప్రీమియంకూడా కట్టకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. కాని, మా హయాంలో రూ.7,802కోట్లు పంటల బీమా కింద ఇచ్చాం, రైతులు ఒక్క రూపాయి కూడా కట్టకుండానే. ఏ సీజన్లో నష్టం జరిగితే అదే సీజన్లో ఇచ్చే ఇన్పుట్ సబ్సిడీ ఆపేశారు.


# మహోన్నత దార్శనికుడు జయశంకర్.. తెలంగాణను తీర్చిదిద్దిన ముద్దుబిడ్డ

- ఆయన తరతరాలకు స్ఫూర్తి
- మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జన్మదినం నేడు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్ రావు ఎక్స్ వేదికగా ఆదివారం స్పందించారు. 'తెలంగాణ మట్టి గడ్డను తీర్చిదిద్దిన ముద్దుబిడ్డ, తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాదులు వేసిన మహోన్నత దార్శనికుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ గారు. చివరి శ్వాస వరకు తెలంగాణ రాష్ట్ర సాధనకే అంకితమైన ఆయన జీవితం, పోరాటం, త్యాగం తరతరాలకు స్ఫూర్తి అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా, ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడి తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు కంకణ బద్ధులమై ఉంటామని పునరుద్ఘాటిస్తూ.. ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు' అని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు.

# పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం

## పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ





**దమ్మపేట, జూన్ 21(మనం న్యూస్) :** దమ్మపేట మండలం మల్కారం గ్రామంలో పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన రైతుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆది నారాయణ పాల్గొన్నారు. కొమ్ము డాన్స్, పూలు జల్లుతూ రైతులు మంత్రికి తుమ్మలకు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ పూజ్యులు ఎన్టీఆర్ దీవెనలతో సత్తుపల్లి ప్రజానీకం నాకు రాజకీయ అవకాశం. ఇచ్చారు. రాజకీయం అంటే ప్రజా సేవగా నలభై ఏళ్లుగా సాగుతున్న. నేను ఏ నియోజక వర్గంలో ఉన్నా అభివృద్ధి ధ్యేయంగా రాజకీయం చేస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. పామాయిల్ సాగుతో తెలంగాణ పచ్చగా సశ్యశ్యామలంగా మారాలి. పది లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణ టార్గెట్ అని ఆయన అన్నారు. ఆరుగాలం కష్టపడి రైతులు పంటలు పండిస్తే మద్దతు ధర సమస్యలు ఉన్నాయి. అకాల వర్షాల వల్ల రైతాంగానికి నష్టాలు చీడ పీడలు లేకుండా కోతుల బెడద లేకుండా అకాల వర్షాల వల్ల నష్టపోకుండా రైతులకు వరంగా పంట పామాయిల్ సాగు మిగిలిందని, ఇందులో అంతర పంటలుగా కోకో జాజి వక్క సాగుతో అదనపు లాభం పొందవచ్చని అన్నారు. అన్ని ఉమ్మడి జిల్లాల్లో పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు నిర్మాణం జరగాలని ప్రభుత్వ ధ్యేయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, సహకారంతో తెలంగాణ రాష్ట్రాన్ని పామాయిల్ హబ్ గా మారుస్తామన్నారు. పామాయిల్ సాగుతో తెలంగాణ రైతులు తలరాత మారుతుందని, పర్యావ రణ పరిరక్షణ రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో కీలకంగా మారుతుందని ఆయన అన్నారు.

ఎమ్మెల్యే జారీ ఆదినారాయణ మాట్లాడుతూ పామ్ ఆయిల్ అంటే తుమ్మల అని, తుమ్మలంటే పామాయిల్ అన్నారు. దమ్మపేట అశ్వరావుపేట మండలాలను చూస్తుంటే మలేషియా దేశంలో ఉన్నామని అనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫామ్ రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, మాజీ జెడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ వాసం రాణి, మాజీ ఏఎంసీ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, సర్పంచ్ సున్నం నాగమణి, పగడాల రమాదేవి, రాంబాబు,కెవి సత్యనారాయణ, గుత్త రాజా బుద్దే కోటేశ్వరరావు, చరమళ్ళ శీను, చారమళ్ళ రాజా, గుత్తా పురుషోత్తం రావు, గుత్తా శ్రీనివాసరావు, రావు గంగాధర్ రావు, దామెర మురళి మహిపాల్, కాసాని వెంకటేశ్వరరావు, ఎర్ర వసంతం, ఎండి వలీపాషా కాసాని నాగప్రసాద్, రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పాదర్స్‌డే రోజు విషాదం..



- ఇద్దరు పిల్లలకు ఎలుకల మందు తాగించి, తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తల్లి
- ఇద్దరు కొడుకులు మృతి, తల్లి పరిస్థితి విషమం

**ఖమ్మం, జూన్ 21(మనం న్యూస్):** పాదర్స్‌డే రోజు ఖమ్మంలో విషాద సంఘటన చోటు చేసుకుంది. ఇద్దరు పిల్లలకు ఓ తల్లి ఎలుకల మందు తాగించి తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఖమ్మం త్రీ టౌన్ పరిధిలోని గాంధీనగర్లో లింగరాజు, స్వాతి దంపతులు నివాసముంటున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు పిల్లలకు ఎలుకల మందు తినిపించి, తానూ తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో ఇద్దరు కుమారులు వేదిక్ కుమార్(7), తనిష్క్(5) మృతిచెందారు. స్వాతి ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

# ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు..

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- యోగాతో ఆరోగ్యం.. ఆరోగ్యంతో అందమైన జీవితం
- దైనందిన జీవితంలో యోగ ఒక భాగం కావాలి
- ప్రపంచ యోగా దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్





**ఖమ్మం, జూన్ 21(మనం బ్యూరో):** ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని, యోగాతో ఆరోగ్యం సాధ్యమవుతుందని, ఆరోగ్యంతో అందమైన జీవితం సాధ్యపడుతుందని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. ఆదివారం స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో ఆయుష్, క్రీడల శాఖల ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానమని అన్నారు.యోగా దినమున జరిగే కార్యక్రమంలో ఆయుష్ శాఖ వారు పాల్గొనేవారని, ఇక్కడ పౌర సమాజం నుండి పెద్ద సంఖ్యలో పాల్గొనడం శుభసూచకమని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని తెలిపారు. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, సాంకేతిక సౌకర్యాల పెరుగుదల కారణంగా మనిషి శారీరక శ్రమకు దూరమవుతూ అనేక రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. ప్రతి మనిషికి ఉన్న అత్యంత విలువైన ఆస్తి ఆరోగ్యం అని, ఆరోగ్యం బాగోలేకపోతే జీవితంలో ఎంత సాధించినా దానిని పూర్తిగా ఆస్వాదించలేమని తెలిపారు. ఆరోగ్యంగా ఉండటమే ప్రతి వ్యక్తి జీవితానికి బలమైన పునాది అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ఉప వైద్యాధికారి డా. వేణుమాధవ్, నోడల్ అధికారిణి డా. పద్మావతి, నేచురోపతి డాక్టర్ కనకమహాలక్ష్మి, జిల్లా అధికారులు, విద్యార్థులు, యువత, మహిళలు, యోగా సాధకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మన గురువు, మార్గదర్శకుడు, తండ్రి త్యాగమూర్తి

- షేఖ్ అబ్దుల్ బాసిత్. కరస్పాండెంట్ మోడ్రన్ ఇఖ్రా స్కూల్

**కొత్తగూడెం టౌన్, జూన్ 21(మనం న్యూస్):** తల్లిదండ్రుల పట్ల సదా విధేయత భావంతో మసులుకోవాలని మోడ్రన్ ఇఖ్రా స్కూల్ కర్సపాండెంట్ షేఖ్ అబ్దుల్ బాసిత్ కోరారు. అంతర్జాతీయ నాన్న దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో మాట్లడుతూ తన సంతానం కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసే తల్లిదండ్రుల పట్ల గౌరవం, విధేయత కలిగి మసలుకోవాలని కోరారు. ముఖ్యంగా వారి వృద్యాపంలో కంటికి రెప్పలా కాపాడుకోవాలని అన్నారు. మన ఆయువు, ఆరోగ్య, ఐశ్వర్యల వృద్ధి కన్నవారి దీవెనలలో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు పర్వీన్ సుల్తానా, టీచర్లు శిరీషా, సల్మా, సరస్వతీ, ప్రసన్న, విజయలక్ష్మి, లతీఫా, ఖాజా, నుసరత్, తదితరులు పాలుగోన్నారు.

# శ్రీ రామకృష్ణ విద్యాలయంలో యోగా డే

- పాల్గొన్న బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవ రావు



**ఖమ్మం, జూన్ 21(మనం న్యూస్):** శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ రామకృష్ణ విద్యాలయంలో వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సెలెన్స్ ఆధ్వర్యం లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, యోగా గురువులు, ప్రజలు సామూహిక యోగాభ్యాసంలో పాల్గొన్నారు. యోగ శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, భావోద్వేగ సమతుల్యత మరియు ఆధ్యాత్మిక వికాసానికి ఎంతగానో దోహదపడుతుందని వక్తలు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఖమ్మం విభాగ్ అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కోశాధికారి, వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సెలెన్స్ అధినేత దేవకీ వాసుదేవరావు మాట్లాడుతూ యోగం భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరమని, ప్రతి ఒక్కరూ యోగాన్ని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఖమ్మం విభాగ్ కార్యదర్శి కారవాది వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన, ఒత్తిడి లేని జీవితం కోసం నిత్య యోగాభ్యాసం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖ వైద్యులు, విద్యావేత్తలు, యోగా గురువులు, తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమం అనంతరం పాల్గొన్న వారందరికీ ఆరోగ్యకరమైన అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ కొప్పు దణమూర్తి, ప్రముఖ వ్యాపారవేత్త గొల్ల మురళి, డేర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కిరణ్ దరిపల్లి, ప్రముఖ కంటి వైద్య నిపుణులు మాదిరాజు నందన్, క్రాంతి రణదేవ్, గన్నవరపు చంద్రశేఖర్, బోనాల రామకృష్ణ, నకిరేకంటి వీరభద్రం, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు కరువు... రైతులకు కన్నీరు

## సాగుచేసినా నష్టమే...చేయకపోయినా నష్టమే



**కొణిజర్ల, జూన్ 21(మనం న్యూస్) :** భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక. దేశ జనాభాలో సగానికి పైగా ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అలాంటి వ్యవసాయ రంగం ప్రస్తుతం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సకాలంలో కురవాల్సిన వర్షాలు ముఖం చాటేయడంతో రైతాంగం ఆందోళనలో మునిగిపోయింది. ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్న అన్నదాతకు నిరాశే ఎదురవుతోంది. సాధారణంగా జూన్ మొదటి వారంలో దేశాన్ని తాకి విస్తరించాల్సిన నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేదు. జూన్ నెల సగం దాటినా అనేక ప్రాంతాల్లో గణనీయమైన వర్షపాతం నమోదు కాలేదు. దీంతో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

### ఆందోళన కలిగిస్తున్న వర్షపాత లోటు

వాతావరణ శాఖ అంచనాలు, క్షేత్రస్థాయిలో నమోదవుతున్న వర్షపాతం మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. అనేక ప్రాంతాల్లో సాధారణ వర్షపాతంతో పోలిస్తే దాదాపు 60 శాతం వరకు లోటు నమోదైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. సాధారణంగా 20 శాతం వర్షపాత లోటు నమోదైనా ఆందోళన వ్యక్తమవుతుంది. అలాంటిది 60 శాతానికి పైగా లోటు నమోదు కావడం అత్యంత ప్రమాదకర పరిస్థితికి సంకేతంగా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ఎండిపోతున్న పంటలు

### – పెరుగుతున్న రైతుల కష్టాలు

తొలకరి జల్లులు పడగానే రైతులు ఆశతో వరి, పత్తి, మిరప తదితర పంటలను సాగు చేశారు. విత్తనాలు, ఎరువులు, కూలీల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేశారు. అయితే తరువాత వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. మెట్ట ప్రాంతాల్లో వర్షాధారంగా పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న వంటి పంటలు వేసిన రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. విత్తనాలు మొలకెత్తకపోవడం, మొలకెత్తిన మొక్కలు ఎండిపోవడం వల్ల రైతుల పెట్టుబడులు పూర్తిగా వృథా అవుతున్నాయి. మరోవైపు చెరువులు, కుంటలు నీటిలేక వెలవెలబోతుండగా, భూగర్భ జలమట్టాలు కూడా గణనీయంగా పడిపోయాయి.

### రెట్టింపైన సాగు వ్యయం

భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో రైతులు బోర్ల ద్వారా నీటిని అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే విద్యుత్ కోతలు, లో-వోల్టేజ్ సమస్యలు వారి కష్టాలను మరింత పెంచుతున్నాయి. కొంతమంది రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పంటలను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారు. డీజిల్ మోటార్ల నిర్వహణకు అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఫలితంగా ఎకరాకు అయ్యే పెట్టుబడి వ్యయం రెట్టింపు అవుతోంది.

### అప్పుల ఊబిలో రైతాంగం

పంటలు పండితేనే అప్పులు తీర్చగలమనే ఆశతో రైతులు బ్యాంకులు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద నుంచి రుణాలు తీసుకున్నారు. అయితే ప్రస్తుతం పంటలు దెబ్బతినడంతో ఆ అప్పులు భారంగా మారాయి. వడ్డీలు పెరుగుతుండటం, కుటుంబ పోషణ భారం అధికమవడంతో రైతులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే రైతుల ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉందని సామాజిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

### పశుసంపదపై కూడా తీవ్ర ప్రభావం

కరువు ప్రభావం కేవలం పంటలకే పరిమితం కాలేదు.

పచ్చిక బయళ్లు ఎండిపోవడంతో పశువులకు మేత కొరత ఏర్పడింది. ఎండుగడ్డి ధరలు అమాంతం పెరిగాయి. తాగునీటి వనరులు ఎండిపోవడంతో పశువులకు నీరు కూడా అందని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు తమ పాడి పశువులను తక్కువ ధరలకు విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

### ప్రభుత్వాలు వెంటనే స్పందించాలి

ఈ క్లిష్ట పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. రాజకీయాలకు అతీతంగా మానవతా దృక్పథంతో సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# ఘనంగా యోగా దినోత్సవం



**కాత్రేనికోన జూన్ 21 మనం ప్రతినిధి :** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని కాత్రేనికోన మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లోను, స్వర్ణ గ్రామాల్లోను యోగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాత్రేనికోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా వేడుకలకు ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు హాజరై విద్యార్థిని విద్యార్థుల సమక్షంలో యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ యోగా మార్గం మానవాళికి ఆరోగ్య భాగ్యంగా కీర్తించారు .భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వారసత్వ సంపద యోగా అని కొనియాడారు.

విశ్వగురు నినాదానికి యోగా నిలువెత్తు మార్గం చూపుతుందని అభివర్ణించారు.ప్రతి ఒక్కరు యోగాని ఆచరించాలని ఫలితంగా ఆరోగ్య భారతం వికసిస్తుందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఎన్ శంకర్ నారాయణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి జె వి సత్యన్నారాయణ, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం ప్రధాన అజెండాగా పనిచేస్తున్నా- మంత్రి నిమ్మల

- రూ. 3.75 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.



**పాలకొల్లు, జూన్ 21,మనం ప్రతినిధి** అభివృద్ధి సంక్షేమమే ప్రధాన అజెండాగా పనిచేస్తున్నామని, అభివృద్ధికి శెలవే లేదని, ఏరోజైనా.. ఏ సమయమైనా అర్థరాత్రి అయినా పనిచేయటమే లక్ష్యమని రాష్ట్ర జలవనుర్ల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు పట్టణంలో 18వ వార్డు నుంచి 31 వ వార్డు వరకు రూ 3.75 కోట్లతో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ప్రతి వార్డులోనూ ప్రజలు మంత్రి నిమ్మలకు ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా మావుళ్ళమ్మపేట సబ్ రిజిస్టర్ ఆఫీస్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ గత ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనలో పెద్ద ఎత్తున విధ్వంసం, ధ్వంసం తప్ప అభివృద్ధి అనేది జరగలేదని, సంక్షేమాన్ని గాలికి వదిలేసారన్నారు. పాలకొల్లులో గత టిడిపి ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున జరిగిన అభివృద్ధి పనులు గొడ్డలి పార్టీ హయంలో విధ్వంసానికి గురయ్యాయి అన్నారు. అటువంటి పనులన్నిటిని మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గాడిలో పెడుతూ పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నట్లు మంత్రిని నిమ్మల తెలిపారు. ప్రధానంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం, ముస్లిం షాది ఖానా, గౌడ శెట్టిబలిజ కళ్యాణ మండపం 12.60 కోట్లతో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవనం, ఎన్టీఆర్ కళాక్షేత్రం, నారా చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, డాక్టర్ అబ్దుల్ కలాం ఉద్యానవనం వంటివి ఎన్నో పరుగులు పెడుతున్నాయి అన్నారు. అభివృద్ధి గురించి పట్టించుకోలేని గొడ్డలి పార్టీ నాయకులకు మాట్లాడే అర్హత గాని, వీధుల్లో తిరిగే హక్కు గాని లేదన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలో వచ్చిన జగన్ రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లడంతో పాటు పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లను రద్దు చేశాడు అన్నారు. ఆనాడు పాలకొల్లులో అన్నా క్యాంటీన్ రద్దు చేసిన రోజు నుంచే పేదలకు ఆకలి బాధ తెలియకూడదు అనే ఉద్దేశంతోనే దాతల సహకారంతో అన్న క్యాంటీన్ ను నిర్వహించామన్నారు. దీనిని కూడా అడ్డుకునేందుకు ప్రభుత్వ ప్రోత్సాహంతో అధికార యంత్రాంగం సిద్ధపడగా పోరాటం చేసి నిలుపుకోవడం జరిగిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను తెరిపించి మానవత్వాన్ని చాటుకున్నారన్నారు. పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, పేదలకు మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా ఉచిత భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి నిమ్మల తెలిపారు. గొడ్డలి పార్టీ పాలనలో నాయకులు పదవులు అనుభవించారే గాని అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లను 70 నుంచి 100 శాతం పూర్తిచేస్తే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ మిగిలిన శాతం పనులు పూర్తి చేసేందుకు అరబస్తా సిమెంటు, రూపాయి ఖర్చు పెట్టలేదు అన్నారు. టిడిపి ప్రభుత్వంలో నిర్మితమైన గృహాలను మాత్రం బ్యాంకులో తాకట్టు పెట్టి 165 కోట్లు ప్రభుత్వ ఖజానాకు మళ్ళించి లబ్ధిదారులు నెత్తిపై అప్పు భారం మోపెడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణ పనులను చేపట్టామని, పూర్తయిన 2050 గృహాలను లబ్ధిదారులకు అప్పగించగా మరో 1536 గృహాలను రెండు మూడు నెలలు అప్పగిస్తామని దీంతో ప్రతి లబ్ధిదారుడి సొంతింటి కల నెరవేరుతుందని మంత్రి నిమ్మల తెలిపారు. పనిచేసే మంచి కూటమి ప్రభుత్వాన్ని పది పదిహేనేళ్లు ఆశీర్వదిస్తే రాష్ట్ర అభివృద్ధి తో పాటు పిల్లల భవిష్యత్తు బాగుంటుందని మంత్రి నిమ్మల తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల కబర్ధి, తుల రామలింగేశ్వరరావు, కర్నేన గౌరు నాయుడు, పెండ్యాల భవాని, రియా, దబ్బా ఎస్తేరు రాణి , పొట్లూరి శ్రీనివాసరావు, బిట్ట లక్ష్మీనారాయణ, మీసాల రాము, ధనాన్ని సూర్య ప్రకాష్, పీతల శ్రీనివాస్, కొల్లి కొండ ప్రసాద్, గాది వెంకన్న, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధ కాశీని పరామర్శించిన ముదునూరి



**శంఖవరం జూన్, 21 మనం ప్రతినిధి:** ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ, సామాజిక బాధ్యతగా భావిస్తున్న ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణం రాజు ఆదివారం ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకున్న గ్రామానికి చెందిన సిద్ధ కాశీని ఆయన స్వగృహంలో కలుసుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాశీ కుటుంబ సభ్యుయలతో కొంతసేపు మాట్లాడిన మురళీకృష్ణం రాజు, ఆపరేషన్ అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరాలు తెలుసుకుని, వైద్యుల సూచనలను తప్పకుండా పాటించాలని సూచించారు. త్వరితగతిన పూర్తిస్థాయిలో కోలుకుని సాధారణ జీవన విధానంలోకి రావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఎలాంటి అవసరం వచ్చినా తమ సహాయ సహకారాలు అందుబాటులో ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మురళీకృష్ణం రాజు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం ప్రతి నాయకుడి బాధ్యత అని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించడం, వారికి మానసిక ధైర్యం కల్పించడం ద్వారా మరింత ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతూ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్నామని తెలిపారు. మచ్చర్ల దాసు కుటుంబ సభ్యులు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి ప్రత్యేకంగా విచ్చేసిన మురళీకృష్ణం రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన చూపిన ఆప్యాయత, పరామర్శ తమకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జువ్వల దొరబాబు,దాడి పుత్రయ్య, సిద్ధ శరణ్య,గ్రామానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ సంగమేశ్వర సంగీత సమాఖ్య



**పిఠాపురం జూన్21( మనం న్యూస్):** పిఠాపురం వారి ఆధ్వర్యంలో విశాఖ కు చెందిన గాయత్రి వరేణ్య గాత్ర కచేరి అత్యద్భుతంగా జరిగింది.వారికి వయొలిన్ పై యు. శ్రీహరి ప్రసాద్, కాకినాడ మృదంగం పై పివియస్. బాలాజీ యువరాజ్ , విశాఖపట్నం చక్కని సహకారం అందించారు. వీరు త్యాగయ్య అన్నమయ్య మొదలైన వాగ్గేయకారుల చక్కటి కీర్తనలతో సంగీత ప్రియులను అలరించారు.

డా. అనురాధ, కొండేపూడి శంకరావు వెన్నపు చక్రధర రావు, కె. గౌరి నాయుడు, దుర్గాప్రసాద్, మన్మథ రావు, శ్రీదేవి, గట్టి శ్రీ కృష్ణ దేవరాయలు మరియు అల్లవరపూ నగేష్ అధిక సంఖ్యలో సంగీత ప్రియులు హాజరయ్యారు.

# అన్నదాతకు అండగా కూటమి పాలన రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రుద్రరాజు బంగార్రాజు (బంగారం)
- ఆచంట నియోజకవర్గ రైతు కుటుంబాలకు పెట్టుబడి సాయం జమపై హర్షం.
- వ్యవసాయాభివృద్ధికి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కృషి అభినందనీయం.

**పోడూరు జూన్ 21 మనం న్యూస్ :** ఆచంట నియోజకవర్గ వ్యాప్తంగా రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం రెండవ సంవత్సరం మొదటి విడత కింద రూ.7 వేల పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయడం పట్ల టిడిపి నాయకులు రుద్రరాజు బంగార్రాజు (బంగారం) హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని 19,175 రైతు కుటుంబాలకు గాను రూ.12,75,19,000 నిధులు జమ కావడం రైతులకు ఆర్థికంగా ఎంతో ఊరటనిచ్చే చర్య అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకోవడానికి, పొలాల్లో ట్రాక్టర్తో దమ్ము చేయించుకోవడానికి, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకోవడానికి, ఇతర వ్యవసాయ అవసరాలకు ఈ సాయం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రైతు కష్టాన్ని గుర్తించి సరైన సమయంలో నిధులు విడుదల చేయడం వల్ల చిన్న, సన్నకారు రైతులలో నూతన ఆశలు చిగురిస్తున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతు కేంద్రిత పాలన అందిస్తోందని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు చర్చించుకోవడం సంతోషకరమని అన్నారు. అలాగే గత రబి సీజన్లో పంటలను విక్రయించిన రైతులకు 24 గంటల్లోపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో వారి ఖాతాల్లోనే చెల్లింపులు జమ చేయడం సాధారణ విషయం కాదని, ఇది రైతుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని కొనియాడారు.రైతు పండించిన ధాన్యానికి సరైన గౌరవం, సకాలంలో చెల్లింపు లభించడం వ్యవసాయ రంగానికి బలాన్నిస్తుందని పేర్కొన్నారు. పోడూరు గ్రామంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన గ్రామ టిడిపి నాయకులను రుద్రరాజు బంగార్రాజు అభినందించారు. రైతులతో నేరుగా మమేకమై ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం ప్రశంసనీయమని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ రైతు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని రుద్రరాజు బంగార్రాజు పేర్కొన్నారు. నియోజకవర్గంలో సాగునీరు, రైతు సమస్యల పరిష్కారం, వ్యవసాయాభివృద్ధి చర్యల్లో ఎమ్మెల్యే చురుకుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా రైతులకు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అందేలా కృషి కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రైతే దేశానికి వెన్నెముక అని, రైతు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ రైతుల సంక్షేమం కోసం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే పితాని చేపడుతున్న కార్యక్రమాలకు రైతాంగం అండగా నిలవాలని రుద్రరాజు బంగార్రాజు పిలుపునిచ్చారు.



# భక్తుల భద్రతపై నిర్లక్ష్యం.. ఆధ్యాత్మిక క్షేత్రంలో అప్రమత్తత ఎక్కడ?



- భద్రతా విభాగానికి ఏటా రూ.రెండు కోట్ల వ్యయం
- అయినా కనిపించని ఫలితం

**అన్నవరం, జూన్ 21,మనం న్యూస్:** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం. ప్రతిరోజూ వేలాది మంది భక్తులు రత్నగిరిపై కొలువై ఉన్న స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడానికి వస్తుంటారు. భక్తుల రక్షణ, ఆలయ భద్రత కోసం దేవస్థానం యాజమాన్యం ఏడాదికి సుమారు రెండు కోట్ల రూపాయల వరకు వ్యయం చేస్తుండగా, ఆ స్థాయిలో భద్రతా వ్యవస్థ పనిచేస్తుందా అనే ప్రశ్నలు ప్రస్తుతం వినిపిస్తున్నాయి. రత్నగిరి పరిసర ప్రాంతాల్లో మూడు షిఫ్టుల విధానంలో వంద మందికి పైగా భద్రతా సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో 10 మంది ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లు ,35 మంది పోలీసు హోంగార్డులు, 10 మంది దేవస్థానం గార్డులు, వందకు చేరువలో ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. వీరికి ప్రతినెల రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు జీతాల రూపంలో దేవస్థానం చెల్లిస్తోంది. అయితే కేటాయించిన పాయింట్ల వద్ద కొందరు సిబ్బంది విధులు నిర్వహించడం లేదని, సంబంధిత అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భక్తుల దర్శన క్యూలైన్ల వద్ద గతంలో ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్లు ప్రస్తుతం మూలన పడివుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. లక్షలాది రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన ఈ భద్రతా పరికరాలు వినియోగంలో లేకపోవడం అధికారుల పనితీరుపై సందేహాలకు తావిస్తోంది. భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు కావాల్సిన ఆలయ ప్రాంగణంలో ఇటువంటి పరిస్థితులు ఉండటం భక్తులను కలవరపెడుతోంది. ఆధ్యాత్మిక క్షేత్రం అనేది కేవలం పూజలు, దర్శనాలకే పరిమితం కాదు. భక్తుడు ఆలయంలో అడుగుపెట్టిన క్షణం నుంచి సురక్షితంగా దర్శనం పూర్తిచేసుకుని వెళ్లే వరకు అతని రక్షణ బాధ్యత కూడా దేవస్థానంపైనే ఉంటుంది. 'భక్తోపకారాయ దేవాలయాలు' అనే భావనకు అనుగుణంగా భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. సత్యదేవుని సన్నిధిలో భక్తులకు ప్రశాంతత, భరోసా, రక్షణ లభించాలి. భద్రతా సిబ్బంది ఆలయానికి రక్షణ కవచంలా వ్యవహరించి ప్రతి మూలను అప్రమత్తంగా పర్యవేక్షించాల్సి ఉంటుంది. భక్తుల విశ్వాసం నిలబెట్టుకోవాలంటే మెటల్ డిటెక్టర్లను తిరిగి వినియోగంలోకి తీసుకురావడం, సిబ్బంది హాజరుపై కఠిన నిఘా పెట్టడం, ఉన్నతాధికారులు నిరంతర పర్యవేక్షణ నిర్వహించడం అత్యవసరంగా మారింది. ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచిన అన్నవరం క్షేత్రంలో భక్తుల భద్రతకు భంగం కలగకుండా చర్యలు చేపట్టినప్పుడే స్వామివారి సన్నిధికి వచ్చే ప్రతి యాత్రికుడికి నిజమైన భక్తి అనుభూతితో పాటు భద్రతా భరోసా కూడా లభిస్తుంది. ఉచిత దర్శన క్యూలైన్ల వద్ద భద్రత కరువు.. అన్నవరం రత్నగిరిపై భక్తుల భద్రత విషయంలో మరో అంశం చర్చనీయాంశంగా మారింది. స్వామివారి రూ.200 శీఘ్ర దర్శనం క్యూలైన్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది కనిపిస్తుండగా, ఉచిత దర్శనం క్యూలైన్ల వద్ద మాత్రం గార్డుల ఉనికి కనిపించడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది మంది భక్తులు ఉచిత దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకుంటుండగా, అక్కడ భద్రతా పర్యవేక్షణ తగిన స్థాయిలో లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్యూలైన్లలో రద్దీ పెరిగే సమయాల్లో పరిస్థితులను నియంత్రించేందుకు సిబ్బంది అందుబాటులో లేకపోవడం భక్తులను ఇబ్బందులకు గురిచేస్తోంది. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఎక్కువగా ఉండే ఉచిత దర్శన మార్గాల్లో భద్రత మరింత అవసరమని భక్తులు అభిప్రాయపడుతున్నారు. శీఘ్ర దర్శనంతో పాటు ఉచిత దర్శన క్యూలైన్ల వద్ద కూడా సమాన స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని క్యూలైన్ల వద్ద సెక్యూరిటీ సిబ్బందిని నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచిస్తున్నారు. భక్తుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ముమ్మిడివరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం



**ముమ్మిడివరం,జూన్ 21,మనం న్యూస్ః** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవంను నిర్వహించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని 84 కేంద్రాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవంను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముఖ్య శిబిరంలో నగర పంచాయతీ కమిషనర్ రవి వర్మ పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడిని దూరం చేసి, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి యోగా ఒక అద్భుతమైన మార్గమన్నారు. ముఖ్యంగా నిరంతరం ప్రజల్లో ఉంటూ సేవలందించే నగర పంచాయతీ సిబ్బంది మరియు వార్డు సచివాలయ సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగాను నిత్యం సాధన చేయాలి అని సూచించారు.ఔ కమిషనర్ తో పాటు స్థానిక ప్రముఖులు, వార్డు సచివాలయ సిబ్బంది, నగర పంచాయతీ అధికారులు మరియు ప్రజలు ఈ కార్యక్రమాలకు హాజరై ఉత్సాహంగా యోగాసనాలు వేశారు.ఔ ఈ యోగా శిబిరాలన్నీ అనుభవజ్ఞులైన యోగా శిక్షకుల పర్యవేక్షణలో నిర్వహించారు. వారు పాల్గొన్న వారికి యోగా యొక్క ప్రాముఖ్యతను, నిత్య జీవితంలో యోగాసనాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.

# లాటరైట్ తరలిస్తున్న టిప్పర్లపై మైన్స్ అధికారుల తనికీలు..



**శంఖవరం జూన్ 21 మనం ప్రతినిధి :** శంఖవరం, రౌతులపూడి మండలాల మీదుగా భారీ ఎత్తున బండరాళ్ళు, లాటరైట్ మట్టిని తరలిస్తున్న టిప్పర్లను మైన్స్ అండ్ జియాలజీ శాఖ అధికారులు తనికీలు చేసారు. మండల కేంద్రం శంఖవరం గ్రామ శివారున మైన్స్ అండ్ జియాలజీ శాఖ కాకినాడకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్లు ఇద్దరు ప్రభుత్వ వాహనంలో వచ్చి టిప్పర్లను కొద్దిసేపు నిలిపివేసి ఉంచారు. ఇంతలో ఏమైనదో ఏమోగాని వారంతట వారే వాటిని వదిలివేసారు. కళ్ళముందే భారీ ఎత్తున వాహనం పరిధికి మించి బండరాళ్ళను, ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్లపై కనీసం చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని, ఇది ఆ శాఖ నిజాయితీ, నిబద్ధతను తెలియజేస్తుందని శంఖవరం గ్రామస్తులు ఆరోపించారు. సామాజిక కార్యకర్త మేకల కృష్ణ టిప్పర్లను వదిలివేయడంపై ఆరా తీయగా, వారు తమకు పై నుండి ఒత్తిడి ఉందని చెప్పి, కనీసం వారి పేర్లు చెప్పడానికి కూడా నిరాకరించడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. రౌతులపూడి మండలంలోనే టిప్పర్లను భారీ ఎత్తున నిలిపివేసి ఉంచారని, తనికీలకు వస్తున్నట్లు ముందుగానే క్వారీ, టిప్పర్ల యజమానులకు సంబంధిత శాఖ నుండి సమాచారం అంది ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రత్తిపాడు మండల పరిషత్ లో గడిచిన శుక్రవారం జరిగిన జెసి అపూర్వ భరత్ ఆధ్వర్యంలో జరిగిన పిజిఆర్ఎస్ లో సామాజిక కార్యకర్త మేకల కృష్ణ ఆధ్వర్యంలో శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటి పిర్యాదు చేసిన నేపథ్యంలో మైన్స్ అండ్ జియాలజీ శాఖ తనికీలు చేపట్టినట్లుగా భావిస్తున్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వ్యక్తిపై కేసు నమోదు



**పాలకొల్లు, జూన్ 21,మనం ప్రతినిధి** పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహించగా పాలకొల్లు పట్టణం లోబహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఎస్ జాన్సన్ అను వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పాలకొల్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ రావు తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహించినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా చర్యలు ఉంటాయని సీఐ శ్రీనివాస్ రావు హెచ్చరించారు.

# అన్నవరం సూర్య గడియారం.. శతాబ్దాల నాటి కాలమాన అద్భుతం



**అన్నవరం, జూన్ 21, మనం న్యూస్ :** అన్నవరం రత్నగిరి కొండపై తూర్పు రాజగోపురానికి ఎడమవైపున ఉన్న సూర్య గడియారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వందల ఏళ్ల క్రితం నిర్మించబడిన ఈ సూర్య గడియారం అప్పటి కాలమాన విజ్ఞానానికి నిదర్శనంగా నిలుస్తోంది. సూర్యుని కిరణాల దిశను ఆధారంగా చేసుకుని సమయాన్ని తెలుసుకునే విధంగా దీనిని రూపొందించారు. ఆధునిక గడియారాలు లేని కాలంలో ప్రజలకు ఖచ్చితమైన సమయాన్ని తెలియజేసేందుకు ఇటువంటి నిర్మాణాలను ఉపయోగించేవారని స్థానికులు చెబుతున్నారు. అన్నవరం ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారి దర్శనంతో పాటు ఈ సూర్య గడియారాన్ని కూడా సందర్శించి ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. సూర్యుని స్థానాన్ని బట్టి నీడ పడే విధానంలో సమయం తెలిసేలా దీనిని నిర్మించడం విశేషం. ఆలయ చరిత్రతో పాటు పురాతన శాస్త్ర విజ్ఞానాన్ని ప్రతిబింబించే ఈ గడియారం పర్యాటకులను సైతం ఆకర్షిస్తోంది. ఇలాంటి సూర్య గడియారం ఇతర ప్రాంతాల్లో చాలా అరుదుగా కనిపిస్తుందని, అన్నవరం క్షేత్రానికి ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని భక్తులు పేర్కొంటున్నారు. దేవస్థానం అధికారులు ఈ చారిత్రక నిర్మాణానికి సంబంధించిన వివరాలను మరింతగా ప్రచారం చేసి భక్తులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. పురాతన భారతీయ ఖగోళ, కాలమాన పరిజ్ఞానానికి ప్రతీకగా నిలిచిన ఈ సూర్య గడియారం అన్నవరం క్షేత్ర వైభవాన్ని మరింత పెంచుతోంది.

# కుక్కునూరు సర్కిల్ నూతన సీఐను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నాయకులు..

**కుకునూరు, జూన్ 21( మనం న్యూస్ ):** కుక్కునూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బాల సురేశ్ ఆదివారం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు (నాగు) మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ములిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నూతన సీఐ బాల సురేశ్ తన విధి నిర్వహణలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోలీసు శాఖకు, ప్రజలకు మధ్య స్నేహం బంధం పటిష్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మధుర వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి చుంచు సత్యనారాయణ, సీనియర్ నాయకులు పిచ్చుక రాజు, రమణరాజు వివిధ గ్రామాల కమిటీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇంగ్లాండ్ పర్యటనకు భారత్ వన్డే జట్టు ఇదే..

ఇంగ్లాండ్ పర్యటనకు సంబంధించి టీమ్ ఇండియా అప్ డేటడ్ వన్డే జట్టును బీసీసీఐ ప్రకటించింది. అలాగే ఐర్లాండ్ తో జరగబోయే రెండు టీ20ల సిరీస్ కు కూడా అప్ డేటడ్ జట్టు వివరాలు వెల్లడించింది.

ఇంగ్లాండ్ పర్యటనకు భారత జట్టు: శుభ్ మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి, కుల్ దీప్ యాదవ్, జస్ ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్ దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్.

విరాట్ కోహ్లీ ఎంపిక అతడి ఫిట్ నెస్ పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ తెలిపింది. ఐపీఎల్ ఫైనల్ సందర్భంగా విరాట్ కాలు విషయంలో అసౌకర్యానికి గురై.. వికెట్ల మధ్య పరుగు తీయడానికి ఇబ్బందిపడ్డాడు. ప్రస్తుతం విరాట్ రిహాబిలిటేషన్ కొనసాగుతోందని, త్వరలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రిపోర్ట్ చేస్తాడని సమాచారం. అప్పుడు ఫిట్ నెస్ పై ఓ అంచనాకు వచ్చి.. టూర్ కి క్లియరెన్స్ జారీ చేసే అవకాశం ఉంది.

ఐర్లాండ్ పర్యటనకు టీమ్ ఇండియా : శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్) సంజూ శాంసన్ (గిఓ), ఇషాన్ కిషన్ (గిఓ), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్షదీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, ప్రసిద్ధ్ కృష్ణ

ఐపీఎల్ టోర్నీ ఆడుతూ గాయపడ్డ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఇప్పుడు ఐర్లాండ్ టూర్ కు పూర్తిగా దూరమయ్యాడు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడని బీసీసీఐ తెలిపింది.



# మంచి సినిమాని తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారు

''తెలుగు ప్రేక్షులకు ఏ భాష సినిమా అనేది ముఖ్యం కాదు. మంచి కంటెంట్ ఉంటే ఆదరిస్తారు. మా 'మంజుమ్మెల్ బాయ్స్' మూవీపై ప్రేమ చూపించారు. ఇప్పుడు 'బాలన్ ది బాయ్' వంటి ఒక డిఫరెంట్ కాన్సెప్ట్ మూవీని మీ ముందుకు తీసుకొచ్చాం. సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాం'' అని చిదంబరం పేర్కొన్నారు. ఆదిశేషన్, ఫర్జానా పాలతింగల్, ముహమ్మద్ జినాన్, టొవినో థామస్, గిరీష్ ఎ.డి, జీన్ పాల్ లాల్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'బాలన్ ది బాయ్'. చిదంబరం దర్శకత్వంలో వెంకట్ కె. నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మించిన ఈ మూవీ మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

ఈ సినిమాను తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేసింది. శనివారం నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్ లో చిదంబరం మాట్లాడుతూ- ''నాకు తెలుగు ఇండస్ట్రీ అంటే ఇష్టం. తెలుగులో ఒక మూవీ చర్చల దశలో ఉంది. 'బాలన్ ది బాయ్'ని డిస్ట్రిబ్యూట్ చేసిన అన్నపూర్ణ సంస్థకు, ప్రమోట్ చేసిన నాగచైతన్యకు థ్యాంక్స్'' అన్నారు. ''నిర్మాతలుగా మాకు తొలి ప్రయత్నమైనా డైరెక్టర్ చిదంబరం నమ్మి, మా వెంట నిలబడ్డారు'' అన్నారు శైలజా దేశాయి.

# ముక్కోణపు సిరీస్ విజేతగా భారత్A

- శ్రీలంకAపై విజయం..

శ్రీలంక వేదికగా జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్ లో ఇండియా ఎ విజేతగా నిలిచింది. శ్రీలంక ఎతో జరిగిన ఫైనల్ లో భారత్ ఎ 66 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన యువ భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 377 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం బ్యాటింగ్కు దిగిన లంక.. 47.1 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. వనుజ సహన్ (62), సదీర సమరవిక్రమ (52) అర్ధ శతకాలు చేయగా.. విజయకాంత్ వియాస్కాంత్ (39), సహన్ అరచ్చిగే (38), నిరోషన్ డిక్వెల్లా (25) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. భారత బౌలర్లలో యశ్ ఠాకూర్ 3, విప్రాజ్ నిగమ్ 3, అనుకుల్ రాయ్ 2, అశోక్ శర్మ, తిలక్ వర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు.

తొలుత భారత బ్యాటర్లలో వైభవ్ సూర్యవంశీ (94; 29 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్స్ లు) క్రీజులో ఉన్నంతసేపు లంక బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. తిలక్ వర్మ (67), రుతురాజ్ గైక్వాడ్ (40), ప్రియాంశ్ ఆర్య (39), అనుకుల్ రాయ్ (39), కుమార్ కుశాగ్ర (36), విప్రాజ్ నిగమ్ (27) పరుగులు చేశారు.

ఇండియా ఎ తో జరుగుతున్న ముక్కోణపు సిరీస్ ఫైనల్ లో శ్రీలంక ఎ ఆరు వికెట్లు కోల్పోయింది. తొలి ముగ్గురు బ్యాటర్లు అవిష్క ఫెర్నాండో (3), నిరోషన్ డిక్వెల్లా (25), నువనిదు ఫెర్నాండో (21)ని యశ్ ఠాకూర్ ఔట్ చేశాడు. నాలుగో స్థానంలో వచ్చిన సదీర సమరవిక్రమ (52; 44 బంతుల్లో) అర్ధ శతకం చేసి వెనుదిరిగాడు. ఇతడిని అశోక్ శర్మ వెనక్కి పంపాడు. విప్రాజ్ నిగమ్ బౌలింగ్ లో రవిందు ఫెర్నాండో (19).. తిలక్ కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. సహన్ అరచ్చిగే (34)ని తిలక్ వర్మ వెనక్కి పంపాడు. 26 ఓవర్లకు శ్రీలంక స్కోరు 184/6. వనుజ సహన్ (16), విజయకాంత్ వియాస్కాంత్ (2) క్రీజులో ఉన్నారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఎ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 377 పరుగులు చేసింది.



# ఏడు గెటప్పుల్లో కనిపిస్తా: సత్యదేవ్

'రావు బహదూర్'గా ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు సత్యదేవ్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ సినిమాని వెంకటేశ్ మహా తెరకెక్కించారు. మహేశ్బాబు - నమ్రత జీఎంబీ ఎంటర్ టైన్ మెంట్స్ సమర్పణలో చింతా గోపాలకృష్ణ రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మించారు. దీపా థామస్ కథానాయిక. ఈ సినిమా జులై 3న రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్ లో ''దేశ సంచారి'' అనే గీతాన్ని విడుదల చేశారు. ఈ ప్రత్యేక గీతాన్ని స్మరణ్ సాయి స్వరపరచగా.. రెహమాన్ సాహిత్యమందించారు. హేమచంద్ర, ప్రియాంక గజానన్ ఆలపించారు. సత్యదేవ్ మాట్లాడుతూ.. ''నేనిందులో మొత్తం ఏడు గెటప్స్ లో కనిపిస్తా. వాటిలో నాకు బాగా ఇష్టమైంది రామప్ప గెటప్'' అన్నారు.



# కసితీరా వేటాడిన వైభవ్..!

శ్రీలంక-ఎ జట్టుతో జరుగుతున్న ఫైనల్ మ్యాచ్ లో భారత్-ఎ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసం సృష్టించాడు. బంతి అందుకోవడానికి బౌలర్లు భయపడే రీతిలో ఆడాడు. కేవలం 11 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసి లిస్ట్-ఎ క్రికెట్ లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డు సాధించాడు. అతడు బ్యాటింగ్ చేస్తున్న సమయంలో బంతి అత్యధిక సమయం బౌండరీ బయటే ఉందంటే అతిశయోక్తి కాదు. షిరాజ్ వేసిన మూడో ఓవర్లో 3 సిక్సు, 2 ఫోర్లుతో ఏకంగా 26 పరుగులు పిండాడు. కేవలం 29 బంతుల్లో 324 స్ట్రైక్ రేట్ తో 94 పరుగులు సాధించాడు. అయితే, సహన్ బౌలింగ్ లో 8.5వ బంతికి వియస్కాంత్ కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కు చేరాడు. శతకం ముందు ఔటయ్యాడని ఫ్యాన్స్ బాధపడ్డా.. శ్రీలంకను ఆదిలోనే బలమైన దెబ్బకొట్టాడు. అతడి ఇన్నింగ్స్ లో 10 ఫోర్లు, 8 సిక్సర్లు ఉన్నాయంటే విధ్వంసాన్ని అర్థం చేసుకోవచ్చు.

# వాయిదాల తర్వాత 'టాక్సిక్' కొత్త రిలీజ్ డేట్..

నటుడు యశ్ కథానాయకుడిగా, గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'. ఈ సినిమా విడుదల పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. తాజాగా చిత్రబృందం కొత్త విడుదల తేదీని ప్రకటించింది. ఈ మేరకు యశ్ 'ఎక్స్' వేదికగా కొత్త పోస్టర్ తో పాటు విడుదల డేట్ ను వెల్లడించారు. 'హానర్ థై




ఫాదర్.. ఖ్వీజీఛి 26-08-2026 నుంచి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో' అని పోస్ట్ చేశారు.

మిడిల్ ఈస్ట్ లో ఉద్రిక్తతల కారణంగా విడుదలపై ప్రభావం పడటంతో గతంలో ఈ సినిమా వాయిదా పడింది. తొలుత 2026 మార్చి 19న విడుదల చేస్తామని ప్రకటించారు. అదే రోజు రణ్ వీర్ సింగ్ 'ధురంధర్: ది రివెంజ్' కూడా రావడంతో బాక్సాఫీస్ వద్ద పోటీ తప్పదనుకున్నారు. కానీ, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో ఈ సినిమా విడుదలను జూన్ 4కు వాయిదా వేశారు. ఆ డేటు కూడా దాటిపోయి ఇప్పుడు తాజాగా ఆగస్టు 26ను ఫైనల్ చేశారు. గీతూ మోహన్దాస్ దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ప తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి యశ్ నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు.

ఇందులో కియారా అడ్వాణీ, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# సినిమా ఆఫర్ చేసి.. బాడీ కొలతలు అడిగాడు : మౌనీషా

అవకాశాల పేరుతో అమ్మాయిలను వాడుకునేందుకు ప్రయత్నిస్తారనే అపవాదు సినిమా ఇండస్ట్రీపై ఉంది. అది నిజమనే చెబుతోంది మోడల్, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ మౌనీషా చౌదరి. అమెరికాలో ఉంటూ మోడల్ గా మంచి గుర్తింపు తెచ్చుకున్న మౌనీషా రీసెంట్ గా ఇండియాకు వచ్చింది. తాజాగా ఓ న్యూస్ చానల్ నిర్వహించే టాక్ షోలో పాల్గొని..తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఈ సందర్భంగా 'తెలుగులో మీకు మూవీ ఆఫర్స్ వచ్చాయా?' అని హోస్ట్ అడగగా.. ఆఫర్స్ వచ్చినా తాను చేయలేదని చెబుతూ.. దానికి గల కారణం ఏంటో వివరించింది.

'నేను 16-17 ఏళ్ల వయసులో ఉన్నప్పుడే సినిమా చాన్స్ లు వచ్చాయి. ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదు. ఓ సారి ఒకరు వచ్చి 'సినిమాలపై ఆసక్తి ఉందా? హీరోయిన్ గా చేస్తావా?' అని అడిగాను. నాకు ఏం చెప్పాలో అర్థం కాలేదు. వెంటనే అతను బాడీ కొలతలు ఎంత? నీ తొడల సైజ్ ఎంత? అని అడిగాడు. చాలా భయపడిపోయా. అలా చిన్న వయసులోనే నాకు సినిమా ఇండస్ట్రీపై భయం ఏర్పడింది. ఇంకోసారి ఇండియా టూరిజమ్ యాడ్ కోసం అప్రోచ్ అయ్యారు. వాళ్ళు ఆడిషన్ కి రావడమే ఒక మినీ స్కర్ట్ క్రాప్ టాప్ వేసుకుని రండి అని చెప్పారు. ఇండియా టూరిజమ్ కి మినీ స్కర్ట్ క్రాప్ టాప్ కి సంబంధం ఏముంది ? హీరోయిన్ అవ్వాలంటే బాడీ కొలతలు ఇవన్నీ ఎందుకండీ ? నటన వచ్చా రాదా అని అడగండి ఫస్ట్ ..రాదు అంటా ఆ సరే దొబ్బెయ్ అనాలప్పుడు అంతే అయిపోతుంది' అని మౌనీషా చెప్పుకొచ్చింది. చిన్నప్పుడు ఏర్పడిన భయంతో ఇప్పటికీ సినిమాల్లో నటించాలంటే భయంగానే ఉంటుందని చెప్పింది. ఇటీవల విశ్వక్సేన్ కొత్త సినిమాలో కీలక పాత్ర కోసం అడిగారు. భయంతో నో చెప్పానని మౌనీషా అన్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలోనూ మౌనీషా దీని గురించి చెబుతూ.. తనను కొలతలు అడిగిన వ్యక్తి ఇప్పుడు పెద్ద డైరెక్టర్ అయిపోయాడని.. స్టార్స్ తో సినిమాలు చేస్తున్నాడని చెప్పింది.



ప్రముఖ యాంకర్, నటి విష్ణుప్రియ సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్గా మారారు. ఇటీవలి కాలంలో ఆమెకు సంబంధించిన కొన్ని వార్తలు నెట్టింట తెగ వైరల్ అవ్వడంతో, ఆమె ఇన్స్టాగ్రామ్ సబ్స్క్రైబర్స్ సంఖ్యతో పాటు నెలవారీ ఆదాయం కూడా ఊహించని స్థాయిలో భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. ఇన్స్టాగ్రామ్ పెయిడ్ సబ్ప్రిష్కన్ ఫీచర్ ద్వారా విష్ణుప్రియను ఫాలో అవుతున్న వారి సంఖ్య ప్రస్తుతం 7,414కి చేరింది.

# విష్ణు... గ్లామర్ షో

ఈ సబ్స్క్రైబర్స్ ద్వారా ఆమెకు ఏకంగా రూ.28 లక్షల 91 వేల నెలవారీ ఆదాయం సమకూరుతున్నట్లు సమాచారం. సోషల్ మీడియా ప్లాట్ఫామ్స్ ద్వారా ఈ స్థాయిలో ఆదాయం ఆర్జించడం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.

వివాదాలు - విమర్శలు..

ఇటీవలే ఒక ఇంటర్వ్యూలో విష్ణుప్రియ చేసిన 'బాడీ కౌంట్' వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ వైరల్ వార్తల నేపథ్యంలోనే ఆమె సబర్ల సంఖ్య అకస్మాత్తుగా పెరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, స్క్రబ్స్క్రైబర్ల కోసం ఆమె అందిస్తున్న ప్రత్యేక (ఎక్స్ క్లూజివ్) కంటెంప నెటిజన్ల నుంచి కొన్ని విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, తనపై జరుగుతున్న నెగెటివ్ ప్రచారంపై విష్ణుప్రియ ఇప్పటికే చట్టపరమైన చర్యలకు దిగారు. తన ప్రతిష్టకు భంగం కలిగించేలా, వ్యక్తిత్వాన్ని హననం చేసేలా కంటెంట్ను వైరల్ చేస్తున్న కొన్ని సోషల్ మీడియా అకౌంట్లు, యూట్యూబ్ ఛానళ్లపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే వారిని వదిలిపెట్టేది లేదని ఆమె స్పష్టం చేశారు.

# ఫీల్‌గుడ్ వైబ్స్‌తో 'చెన్నై లవ్ స్టోరీ' పోస్టర్.. థియేటర్లలోకి వచ్చేది ఆ రోజే!

కిరణ్ అబ్బవరం హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ' విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. జులై 24న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా థియేటర్లలోకి తీసుకురానున్నారు. ఈ మేరకు చిత్ర బృందం ఒక అందమైన, ఫీల్ గుడ్ పోస్టర్ ను అభిమానులతో పంచుకుంది. అందులో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ సముద్ర తీరాన నిలబడి పావురాలతో ఆడుకుంటూ చాలా ఆహ్లాదకరంగా కనిపిస్తున్నారు. పోస్టర్ చూస్తుంటేనే సినిమా నిండా ప్రేమ, మ్యాజిక్ ఉండబోతున్నట్లు స్పష్టమవుతోంది.



బేబీ మేకర్స్ నుంచి మరో మ్యాజిక్

'కలర్ ఫోటో', 'బేబీ' లాంటి సెన్సేషనల్ హిట్స్ అందించిన సాయి రాజేష్, ఎస్.కె.ఎన్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రవి నంబూరి ఈ ప్రాజెక్ట్ కు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలకు ప్రేక్షకులలో మంచి స్పందన లభించగా, మెలోడీ బ్రహ్మ మణిశర్మ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటం సినిమాపై అంచనాలను అమాంతం పెంచుతోంది. జులై 24న మీరంతా ఖచ్చితంగా ప్రేమను, మ్యాజిక్కు ఫీల్ అవుతారు అని కిరణ్ అబ్బవరం తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. యూత్ ఫుల్ లవ్ ఎంటర్ టైనర్ గా వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో వేచి చూడాలి.

# సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధం





- మున్సిపల్ కమిషనర్ చన్నబోయిన నాగరాజు

**నేరేడుచర్ల, జూన్ 21 మనం న్యూస్:** సంపూర్ణ ఆరోగ్యానికి యోగ దివ్య ఔషధంగా పనిచేస్తుందని యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ చన్నబోయిన నాగరాజు అన్నారు . అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం మున్సిపల్ కార్యాలయం నందు సిబ్బందికి యోగ పై అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సిబ్బందికి యోగ మాస్టర్ చామకూరి వీరయ్య గౌడ్ యోగ ధ్యానం శారీరక వ్యాయామంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# త్రిపుల్ మర్డర్ కేసును ఛేధించిన పోలీసులు

- తిపుల్ మర్డర్ కేసును ఛేధించిన పోలీసులు
- పోలీసు బృందానికి ఎస్పీ శరత్ చంద్ర పవర్ ప్రశంసలు




**నల్లగొండ, జూన్ 21 (మనం ప్రతినిధి ):** మిర్యాలగూడ పట్టణంలోని కలాల్వాడలో ఈ నెల 4న జరిగిన త్రిపుల్ మర్డర్ కేసును నల్గొండ జిల్లా పోలీసులు ఛేదించారు. ఆదివారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ డీసీఆర్బీ డీఎస్పీ జి. రవి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం ఊళ్ళపాలెంకు చెందిన కాళహస్తి శిరీష్ కుమార్ (38)ను అరెస్ట్ చేశాయి అన్నారు. తెలుగు మ్యాట్రిమోనీ ద్వారా బాధితురాలు ధనలక్ష్మితో పరిచయం పెంచుకున్న నిందితుడు, వ్యక్తిగత విభేదాలు, పగతో ఆమె కుటుంబ సభ్యులను హత్య చేయాలని పథకం రచించినట్లు దర్యాప్తులో తేలింది. ఘటనలో ధనలక్ష్మి తల్లి వనం చంద్రమ్మ (48), కుమారుడు లక్ష్మణ్ (17), కుమార్తె ప్రణతి (15) సజీవదహనమై మృతి చెందగా, ధనలక్ష్మి ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది.
సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, పెట్రోల్ బకెట్, ప్రయాణ మార్గాల విశ్లేషణ ద్వారా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు ఎస్ పీ తెలిపారు. ఈ క్లిష్టమైన కేసును వేగంగా ఛేదించిన డీసీఆర్బీ డీఎస్పీ జి. రవి, మిర్యాలగూడ ఐ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం. నాగభూషణరావు, ప్రొబేషనరీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్లు జి. రాజారాం, నల్లగంతుల శ్రీను, ఎస్. వెంకటేశ్వర్లు, హుస్సేన్, బి. వీరబాబు, జి. నర్సింహా, బి. ప్రసాద్లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులు ప్రకటించారు.

# రిటైర్డ్ ఉద్యోగులకు మళ్లీ ఉద్యోగాలు ఇవ్వద్దు

## శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**నల్లగొండ, మార్చి 21 (మనం ప్రతినిధి):** రిటైర్డ్ అయిన ఉద్యోగులకు మళ్లీ ఉద్యోగాలు ఇవ్వొద్దని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్గొండ పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన చిట్ చాట్ లో ఆయన మాట్లాడారు. అధికారులలో అవినీతి పెరిగిపోతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయలు,బంగారం లాకర్ లలో దొరుకుతున్నాయి అన్నారు. ఏసీబీ కేసులో పట్టుబడిన వారికి కఠిన శిక్షలు అమలు చేయాలి అన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే 50 కోట్లు 100 కోట్లు ఖర్చు చేస్తున్నారు. గతంలో రాజకీయలలో ఉండే వారు జెండా పట్టుకొని పని చేసే వారే ప్రజాప్రతినిధులుగా ఉండేది. కానీ ఇపుడు రియల్ ఎస్టేట్ వ్యాపారులు,కాంట్రాక్టర్ లు డబ్బున్న వారే రాజకీయ నాయకులు గా చెలామణి అవుతున్నారు. అధికారులపై ప్రభుత్వానికి అజమాయిషీ ఉందా లేదా చిన్న చిన్న చిన్న ఉద్యోగులు కూడా కోట్ల రూపాయలు వెనకేస్తున్నారు. 10% రాజకీయ నాయకులే డబ్బులు సంపాదిస్తారు. రైతు బరోసా విషయం లో ప్రభుత్వం పునరాలోచన చేయాలి అన్నారు. సేద్య యోగ్యమైన భూములకే రైతు బరోసా ఇవ్వాలి అన్నారు.



# లోక్ ఆదాలత్ నందు 5108 కేసుల పరిష్కారం

## సైబర్ నేరాలకు సంభందించి 75 కేసుల్లో 27.78 లక్షల నగదు బాధితుల ఖాతాలో జమ

- జిల్లా ఎస్పి కె.నరసింహ

**సూర్యాపేట, జూన్ 21 (మనం ప్రతినిధి):** జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన శనివారం రోజున నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ నందు న్యాయశాఖతో సమన్వయంగా పని చేసి సూర్యాపేట జిల్లా పోలీస్ పెండింగ్ లో ఉన్న కేసుల్లో 5018 కేసులను పరిష్కరించడం జరిగిందని సైబర్ మోసాలకు సంబంధించి 75 కేసుల్లో 27 లక్షల 78 వేల రూపాయలను బాధితుల ఖాతాలో జమ చేయడం జరిగింది అని జిల్లా ఎస్పీ నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఇందులో 1298 క్రిమినల్ కేసులు, 1907 ఈ-పెట్టీ కేసులు, 1903 యం.వి యాక్ట్, డ్రంకన్ డ్రైవ్ కేసులు పరిష్కరించడం జరిగినది అన్నారు. పోలీస్ శాఖ కోర్టులతో సమన్వయంగా పటిష్టంగా పనిచేయడం వల్ల ఈ కేసులు పరిష్కరించడం సాధ్యమైందని తెలిపారు. దీనికోసం ప్రణాళికతో పనిచేసి పరిష్కరించదగిన కేసులను ముందుగానే గుర్తించాం అన్నారు. అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో సిబ్బంది ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారు. ఈ క్రమంలో బాగా పనిచేసిన జిల్లా పోలీస్ శాఖ సిబ్బందిని అభినందిస్తున్నాను అని తెలిపారు.

# తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్

## బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు



**నేరేడుచర్ల, జూన్ 21 మనం న్యూస్:** తెలంగాణ సిద్ధార్థ కర్త తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తన జీవితాన్ని దారబోసిన కర్మయోగి ప్రొఫెసర్ జయశంకర్ అని ఆయన చిత్రపటానికి మాజీ సర్పంచ్ లు ఆకారపు వెంకటేశ్వర్లు పల్లె పంగ నాగరాజ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ బాల్యం నుంచే తెలంగాణ అస్తిత్వం కోసం సామాజిక రాజకీయ చైతన్య కోసం అందుకు తగ్గ భావజాల వ్యాప్తిని కొనసాగించిన నిస్వార్థ మేధావి తెలంగాణ సాత్వికుడు జయశంకర్ అని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ సాధనే ఉచ్చ్వాస నిశ్వాచలుగా తన జీవితాన్ని గడిపిన ఆ మహనీయుడు త్యాగాల్ని తెలంగాణ సమాజం ఆ చంద్ర తారార్కం గుర్తుంచుకుంటాయని ముల్కీ నాన్ ముల్కీ ఉద్యమంలోనూ ఆ తర్వాత జరిగినా ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ ఉద్యమంలోనూ మహోన్నతమైన పాత్ర పోషించి తెలంగాణ రాష్ట్ర సాధనను కళ్ళారా చూడకుండా కన్నుమూసిన ఆ మహనీయుడికి యావత్తు తెలంగాణ జాతి రుణపడి ఉంటుందని ఆయన ఆశయ సాధన కోసం సామాజిక తెలంగాణ కోసం తెలంగాణలోని ప్రతి కుటుంబానికి తెలంగాణ స్వాతంత్ర ఫలాలు అందేంతవరకు ఉద్యమిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్, బిసి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి సుందరయ్య ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను మాజీ మార్కెట్ చైర్మన్ ఇంజమూరి యశోద రాములు, వ్యవసాయ కార్మిక సగం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం ఏఐవైఎఫ్ జిల్లా చిలకరాజు శ్రీను అధ్యక్షుడు పరికే భరత్ సిఐటియు మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి ఏఐటియుసి నాయకులు ముత్యాల భాస్కర్ శేఖర్ నాయక్ బీసీ నాయకులకు కొప్పు రామకృష్ణ పాల్గొన్నారు.

# యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలి



**కామారెడ్డి, జూన్ 21 (మనం ప్రతినిధి):** యోగా ఆరోగ్యకరమైన జీవన విధానానికి పునాదిగా నిలుస్తుందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వి. గిరి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం కామారెడ్డి ఖేలో ఇండియా కేంద్రంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వారసత్వమని, శరీరం-మనస్సు-ఆత్మల మధ్య సమతుల్యతను నెలకొల్పుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, క్రీడాకారులు, ఆయుష్ శాఖ సిబ్బందితో కలిసి యోగాసనాలు నిర్వహించిన ఆయన, యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుమారు 100 మంది పాల్గొనగా, యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. జిల్లా ప్రజలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగాను అలవర్చుకోవాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.

# జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ తాజుద్దీన్ నియామకం

- మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసిన ఎండీ తాజుద్దీన్



**ములుగు,జూన్ 21మనం ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన ఎండీ తాజుద్దీన్ మంత్రి సీతక్క అధికారికంగా ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎండీ తాజుద్దీన్ ఆదివారం మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్ నూతన జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ తాజుద్దీన్ కు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. తనపై నమ్మకం ఉంచి మైనారిటీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు మంత్రి సీతక్క, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, ములుగు గ్రంథాలయ చైర్మన్ భానోత్ రవిచందర్, జిల్లా, మండల, పార్టీ అధిష్ఠానానికి ఎండీ తాజుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీ వర్గాల సంక్షేమం, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిబద్ధతతో కష్టపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓవర్లోడ్ వాహనాలపై ఉక్కుపాదం

**రాష్ట్ర రవాణా శాఖ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా ఓవర్లోడ్ వాహనాలపై ముమ్మర తనిఖీలు**

**జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించిన మూడు భారీ వాహనాలు సీజ్**

**తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతాయని రవాణా శాఖ వెల్లడి**




**కామారెడ్డి, జూన్ 21 (మనం జిల్లా ప్రతినిధి):** జిల్లాలో ఓవర్లోడ్తో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై రవాణా శాఖ ముమ్మర తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో పరిమితికి మించి లోడ్తో వెళ్తున్న మూడు భారీ వాహనాలను సీజ్ చేసినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి టి. సంతోష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు, ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు చేపట్టిన తనిఖీలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయని చెప్పారు.
క్వారీ నిర్వాహకులు, వాహన యజమానులు ఓవర్లోడ్ రవాణాకు పాల్పడవద్దని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శంకర్ నారాయణ, ఏఎంవీఐలు రఫీ, కృష్ణ తేజ, రవాణా శాఖ సిబ్బంది, హోంగార్డులు తనిఖీల్లో పాల్గొన్నారు.

# ప్రశాంతంగా నీట్



**వరంగల్, జూన్ 21(మనంన్యూస్):** వరంగల్ జిల్లాలోని సీకేఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించిన నీట్-2026 (జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష) ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు మొత్తం 480 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 431 మంది విద్యార్థులు హాజరయ్యారని, 49 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ పరీక్షను పారదర్శకంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో పరీక్ష విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో ముగిసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# ఎస్ఐఆర్ సంపూర్ణంగా పూర్తి చేయాలి




**వరంగల్, జూన్ 21(మనంన్యూస్):** ఎస్ఐఆర్-2026 (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఆదివారం వరంగల్ ఐడీఓసీ నుంచి కాశీబుగ్గ సర్కిల్ వరకు 2కే రన్, మానవహారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షత వహించగా, వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు (రిటైర్డ్ ఐపీఎస్), కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కూడా) చైర్మన్ ఏనుగాల వెంకటరామిరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పాయ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు,జెండా ఊపి 2కే రన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రతి పౌరుడికి సమాన ఓటు హక్కు కల్పించారని, సామాన్య ప్రజల నుంచి అత్యున్నత స్థాయిలో ఉన్న వ్యక్తుల వరకు ప్రతి ఒక్కరికీ ఒకే ఓటు అనే సూత్రాన్ని రాజ్యాంగం ద్వారా అందించారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో పాలనను నిర్ణయించే గొప్ప అవకాశమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎస్ఐఆర్-2026 ప్రక్రియకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా సవరణలు చేపడుతున్న నేపథ్యంలో ప్రజలు బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) సహకరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఓటరు జాబితాలో పేరు లేదనే పరిస్థితి తలెత్తకుండా ఇప్పుడే అవసరమైన వివరాలను సరిచూసుకుని నమోదు, మార్పులు, చేర్పులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్-2026 కార్యక్రమాన్ని సంపూర్ణంగా పూర్తి చేసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, వరంగల్ ఆర్డీవో సుమ, స్వీప్ నోడల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఓటరు జాబితా సవరణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్లకార్డులతో మానవహారం నిర్వహించడంతో పాటు 2కే రన్ను పెద్ద ఎత్తున నిర్వహించారు.

# మంత్రి సీతక్కపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదు



- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్

**ములుగు,జూన్ 21మనం ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని డి.ఎల్.ఆర్. గార్డెన్స్లో జరిగిన విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ మంత్రి సీతక్క గురించి అబద్ధపు, అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదు గుంటూరు సతీష్ రెడ్డి, నీకు నిజంగా దమ్ముంటే బహిరంగ చర్చకు నేను సిద్ధం రేపు ఉదయం 11:00 గంటలకు మేడారం సమ్మక్క సారలమ్మ సన్నిధిలో మాట్లాడుదాం రా అని బహిరంగ సవాల్ విసిరారు. ఈ సందర్భంగా పైడాకుల అశోక్ మాట్లాడుతూ గుంటూరు నుండి బ్రతుకుదెరువు కోసం వచ్చిన ఏరువ సతీష్ రెడ్డి అనే అతను కావాలని సీతక్క ను లక్ష్యంగా చేసుకొని, విష ప్రచారం చేస్తూ కూనిచేయాలని చేస్తున్నాడని అన్నారు. ఖబర్దార్ సతీష్ రెడ్డి నువ్వు నెలకోసారి లేదా రెండు నెలలకోసారి హైదరాబాద్ నుండి ములుగు వచ్చి గిరిజన ఆడబిడ్డ సీతక్క మీద బురద చల్లాలని ప్రయత్నిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని, ములుగు గడ్డ మీద అడుగు పెట్టకుండా తరిమి తరిమి కొడతామని అన్నారు. ములుగు జిల్లాలో 12 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక అనుమతులు వచ్చాయని నువ్వు మీ కేటీఆర్ అన్నారు కదా, బహిరంగ చర్చకు సిద్ధం అని సవాల్ విసిరారు కదా, నువ్వు విసిరిన సవాల్ నేను స్వీకరిస్తున్న దమ్ముంటే రేపు ఉదయం 11:00 గంటలకు తాడ్వాయి మండల మేడారం సమ్మక్క సారలమ్మ సన్నిధికి వస్తున్న దమ్ముంటే నువ్వు వస్తావో లేక మీ కేటీఆర్ సారుని పంపిస్తావో పంపించు, ఆధారాలతో అక్కడ తెచ్చుకుందాం రండి అని బహిరంగ సవాల్ విసిరారు. అలాగే మంత్రులు సీతక్క మరియు పొంగులేటి గురించి మాట్లాడే అర్హత స్థాయి నీది కాదు సతీష్ రెడ్డి అని ఎద్దేవ చేశారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ గురించి మాట్లాడినవ్ కదా సతీష్ రెడ్డి సీతమ్మ సాగర్ ప్రాజెక్టు షిల్టు తీయాలని అనుమతులు ఇచ్చిందే మీ బి.ఆర్.ఎస్.ప్రభుత్వం అనే సంగతి మార్చినట్టున్నవ్, నీ ప్రభుత్వ హయాంలోనే షిల్టులకు అనుమతులు వచ్చాయని అన్నారు. అలాగే ఏ ప్రాజెక్టు కట్టిన షిల్టు తీసే ప్రాజెక్టు నిర్మిస్తారు అనే సోయి కూడా లేదా నీకు సతీష్ రెడ్డి అన్నారు. మంత్రి సీతక్క నిత్యం ప్రజల కోసం, ప్రజా సమస్యల కోసం అహర్నిశలు కష్టపడుతున్న వ్యక్తి, ఒక్క నిమిషం కూడా ఖాళీ లేకుండా తన జీవితం మొత్తం ప్రజా సేవకే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి, కష్టం అన్న ప్రతి ఇంటి గడప తొక్కిన వ్యక్తి, సహాయం అని అడిగిన ప్రతి ఒక్కరికి తనకు తోచిన సహాయం చేసింది అలాంటి వ్యక్తి పైన కావాలని నువ్వు అసత్య ప్రచారాలు, అవినీతి ఆరోపణలు వేస్తే మాత్రం సహించేది లేదు, ములుగు గడ్డ మీద అడుగు పెట్టకుండా తరిమి కొడతాం అని హెచ్చరించారు. అసలు గుంటూరు నుండి ఇక్కడికి బ్రతుకుదెరువు కోసం వచ్చిన నీకు ఆ లక్సరి కార్లు ఎక్కడివి, సొంత ఇండ్లు ఎక్కడివి, ప్లాట్లు ఎక్కడి నుండి వచ్చాయో చెప్పు, నువ్వు ఎంత కష్టపడితే అవి వచ్చాయి చెప్పు అని అన్నారు. ఇంకోసారి మంత్రి సీతక్క గారి గురించి తప్పుడు కూతలు కూస్తే నాలుక చీరుతం అని బిడ్డ అని హెచ్చరించారు. కల్వకుంట్ల కవిత 200 కోట్ల ఇంట్లో ఉంటూ, అక్రమంగా సంపాదించిన డబ్బును ఏం చేయాలో తెలియని కవితమ్మ కూడా ఇవ్వాళ సీతక్క గారి గురించి మాట్లాడడం దారుణం అని, లిక్కర్ స్కాంలో జైలుకు వెళ్ళి వచ్చిన నువ్వు సీతక్క గారి గురించి మాట్లాడే దానివా కవితక్క అని, నీ స్థాయిని మరిచి సీతక్క గురించి మాట్లాడడం నీకు తగదు అన్నారు. అలాగే ములుగు జిల్లాలో 12 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక రవాణా మరియు నాలుగు వేల కోట్ల అక్రమ సంపాదన అని మాట్లాడిన సతీష్ రెడ్డి నీకు నిజంగా దమ్ముంటే నువ్వు విసిరిన బహిరంగ సవాల్ నేను స్వీకరిస్తున్న రేపు ఉదయం మేడారం సన్నిధిలో నేను సిద్ధంగా ఉంటా దమ్ముంటే నువ్వు అక్కడికి ఆధారాలతో రా అని అన్నారు. నీ దగ్గర ఆధారాలు ఉంటే రేపు జరగబోయే బహిరంగ చర్చలో నిరూపించు అంతే కానీ సామాజిక మాధ్యమాల్లో ఎందుకు విష ప్రచారం చేస్తున్నావ్ అని, ఇంకోసారి మా ఆడబిడ్డ సీతక్క గురించి మాట్లాడితే మా ములుగు ఆడబిడ్డలతో తరిమి తరిమి కొడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రేగ కళ్యాణి, స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి గార్లతో పాటుగా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

# కాకతీయ కోటలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**వరంగల్, జూన్ 21(మనంన్యూస్):** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 ను పురస్కరించుకుని చారిత్రక ఖిలా వరంగల్ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకతీయుల వైభవానికి ప్రతీకగా నిలిచిన ఈ చారిత్రక ప్రాంగణంలో జరిగిన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 500 మంది విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,కూడా చైర్మన్ ఏనుగాల వెంకటరామిరెడ్డిల హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానమని పేర్కొన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఎంతో అవసరమని అన్నారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరుగుతుందని, అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కూడా చైర్మన్ ఏనుగాల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజానికి యోగ చాలా అత్యంత కీలకమని ప్రతి ఒక్కరూ జీవన విధానంలో యోగాకు 15 నిమిషాలు అవకాశం ఇచ్చి ఆరోగ్యని కాపాడుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈకార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్ ఎర్ర ప్రియాంక, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, వరంగల్ ఆర్డీవో ఉమా, నర్సంపేట ఆర్డీవో, డీఆర్వో విజయలక్ష్మి, తహసిల్దార్ ఇక్బాల్ , బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి పుష్ప లత, డీపీఆర్వో ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు. ఎన్సీసీకి చెందిన సుమారు 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా యోగాసనాలు వేస్తూ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎన్సీసీ కమాండెంట్ భాస్కర్ ధనరాజ్ నాయక్, పురావస్తు శాఖ అధికారి వంశీకృష్ణ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, పాఠశాలల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ మైదం రాజు, డిప్యూటీ నోడల్ అధికారులు శ్రీలత, డాక్టర్ అమృతవల్లి, డాక్టర్ మంజుల, జిల్లా కన్వీనర్ డాక్టర్ కె. రాజేందర్, ఆయుష్ శాఖ వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కాకతీయుల చారిత్రక వారసత్వానికి ప్రతీక అయిన కిలా వరంగల్ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పిన కార్యక్రమంగా ఇది నిలిచింది.



# ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదు

**యోగతో ఆరోగ్యం ఆరోగ్యంతో అందమైన జీవితం**

**దైనందిన జీవితంలో యోగ ఒక భాగం కావాలి**

**మంత్రి సీతక్క**

**ములుగు, జూన్ 21, మనం ప్రతినిధిః** ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని, యోగతో ఆరోగ్యం సాధ్యమవుతుందని, ఆరోగ్యంతో అందమైన జీవితం సాధ్యపడుతుందని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా అలవర్చుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఆదివారం ములుగు పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ప్రాంగణంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ అనే థీమ్తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ అని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, సాంకేతిక సౌకర్యాల పెరుగుదల కారణంగా మనిషి శారీరక శ్రమకు దూరమవుతూ అనేక రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. ప్రతి మనిషికి ఉన్న అత్యంత విలువైన ఆస్తి ఆరోగ్యం అని, ఆరోగ్యం బాగోలేకపోతే జీవితంలో ఎంత సాధించినా దానిని పూర్తిగా ఆస్వాదించలేమని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉండటమే ప్రతి వ్యక్తి జీవితానికి బలమైన పునాది అని తెలిపారు. గతంలో మన పూర్వీకులు ప్రత్యేకంగా వ్యాయామాలు చేయకపోయినా రోజువారీ జీవితంలో చేసే సహజమైన శారీరక శ్రమ, క్రమబద్ధమైన జీవనశైలి కారణంగా ఆరోగ్యంగా జీవించగలిగారని అన్నారు. కానీ ఆధునిక జీవన విధానంలో సాంకేతిక సౌకర్యాలు పెరగడం, ఇంటి పనులు తగ్గిపోవడం, ఎక్కువ సమయం ఒకే చోట కూర్చోవడం వంటి కారణాలతో శరీరానికి అవసరమైన సహజ కదలికలు తగ్గిపోయాయని తెలిపారు.

ఈ మార్పుల వల్లే నేటి సమాజంలో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యంతో పాటు విద్య కూడా ప్రతి మనిషి భవిష్యత్తును నిర్మించే ప్రధాన శక్తి అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కనీసం కొంత సమయాన్ని నడక, యోగ, ఇతర శారీరక వ్యాయామాలకు కేటాయించాలని సూచించారు. యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం ద్వారానే బలమైన రాష్ట్రం, సుసంపన్నమైన దేశం నిర్మాణం సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, ఆరోగ్యకరమైన జీవన విధానానికి పునాది వేస్తుందన్నారు. ప్రస్తుత జీవనశైలిలో ప్రతి ఒక్కరూ రోజువారీ పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ కొంత సమయాన్ని శారీరక వ్యాయామం లేదా యోగ కోసం కేటాయించాలన్నారు. క్రమశిక్షణ, శారీరక శ్రమ అలవాట్లు జీవితాంతం ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన వృద్ధాప్యాన్ని పొందాలంటే యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్వో వికాస్ మీనా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఈఓ సిద్ధార్థ్ రెడ్డి, నోడల్ అధికారి డాక్టర్ సంధ్య, డీఎస్పీ రవీందర్, ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, మండల అధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యోగా సాధకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శుభకార్యల్లో పాల్గొన్న లావుడియా



**ములుగు ,జూన్ 21(మనం న్యూస్)ః** ములుగు జిల్లా బండారుపల్లి గ్రామంలో నూతన గృహప్రవేశము మరియు నందిని దేవ్ సింగ్ కుమార్తె కుమారుడు పుష్పాలంకరణ ధోతి కట్టించుట కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో బంధుమిత్రులు ముఖ్య నాయకులు పాల్గొని వారి దంపతులను పిల్లలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్, సుజాత పరశురాం నాయక్, లావుడియా సరిత గణపతి నాయక్, , పృద్వి, సురేష్, పోరిక సునీల్, భూక్య విజయ భద్రునాయక్, లావణ్య చరణ్ సింగ్, భూక్య తారాబాయి అజ్మేర వీరమ్మ మోతిలాల్, సజన్ నాయక్, సందీప్ కుమార్,వేణు, దీపిక రాజేష్, శిరీష రాందాస్, వినోద్, వేణు, ధరం సింగ్, కైక భాయ్, రాజన్న, రాహుల్ సింగ్, మొదలైన నూతన గృహప్రవేశము నూతన పుష్పాలంకరణ ధోతి కట్టుట కార్యక్రమంలో పాల్గొని వారి దంపతులను పిల్లలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది

# తెలుగు దేశం పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు పోరాటం చేయాలి

- **దరావత్ దేవా నాయక్ టిడిపి పార్టీ ములుగు జిల్లా నాయకులు**



**ములుగు, జూన్ 21(మనంన్యూస్)ః** తెలుగు దేశం పార్టీ అభిమానులారా మాజీ కార్యకర్త లారా క్రమశిక్షణ గల పార్టీ తెలుగు దేశం తెలుగు దేశం పార్టీ వచ్చే ఎన్నికల లో 100%పోటీలో నిలుస్తుంది జెండా ఎగురవేయడం ఖాయం టిడిపి పార్టీ నీ వదలి పోయిన కార్యకర్తలు తిరిగి పార్టీలో చేరి ఎస్సీ ఎస్టీ బీసీ లను అక్కున చేర్చుకుని వారికి చక్కటి రాజకీయ భావిషత్తునిచ్చిన సంగతి మన అందరికీ తెలిసిందే మన పార్టీ ద్వారా బలోపేతమై రాజకీయ రంగాల్లో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు కార్య కర్తలు మళ్ళీ మన స్వంత గూటికి చేరండి దేశం లో చంద్ర బాబు నాయుడు గారు మాహా అద్భుతం సృష్టించ బోతున్నారు ప్రతి పక్షాలు కుదేలై పోయినాయి వారుకేవలం ప్రజల ఆకాంక్షలను తీర్చలేని స్థితిలో ఉన్నారు వారి వ్యాపార ప్రయోజనాలే వారి కి ముఖ్యమైనాయి బాధ్యతా యుతంగా ప్రవర్తించడం లో వెనుకడుగు వేస్తున్నారు దాని మూలంగా ప్రజలే తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ముందుకు వచ్చి నిరసనలు తెలుపుచున్న సంగతిని మీరు గమనిస్తున్నారు గిరిజనేతరుల హక్కుల కోసం మాట్లాడితే నా పై కేసులు పెట్టి అరెస్టు చేశారు ప్రజా స్వామ్యం బ్రతకాలి పేద ప్రజలకు రక్షణ కల్పించాలని అందుకే తెలుగు దేశం పార్టీ బల పడితే పేద ప్రజలకు రక్షణ గా నిలుస్తుందని నమ్మకం కలిగించాలి దాని కోసం తెలుగు దేశం పార్టీ నీ వదలి పోయిన తెలుగు తమ్ముళ్లు తిరిగి పార్టీలో చేరి బలోపేతం చేసి సకల జనులకు రక్షణ గానిలబడి సామాజిక న్యాయం కోసం పోరాడ టానికి నేను సిద్ధం గా ఉన్నాను మీరు నాకు స్నేహ హస్తం. అందించి .

సమాజ హితం కోసం కృషి చేయాలని కోరుచున్నాను

## వికలాంగునికి రూ.60వేల ఆర్థిక సాయం

**కన్నాయిగూడెం, జూన్ 21, మనం ప్రతినిధిః** ముప్పనపల్లి గ్రామం కన్నాయిగూడెం మండలం ములుగు జిల్లా కు చెందిన బోనాముక్కుల సుబ్బారెడ్డి వయస్సు 65 సంవత్సరాలు పుట్టుకతో అవిటివాడు (కుంటి ) గత వారం రోజుల క్రితం ఇంటి దగ్గర పేరెట్లో కింద పడడం జరిగింది.కాలుకు దెబ్బ తగలి సెప్టిక్ అయింది. హన్మకొండ లోని ఓ ప్రయివేట్ హాస్పిటల్ లో ఐసీయూ లో అడ్మిట్ అయ్యాడు. ఆపరేషన్ కు మినిమం 3లక్షలు ఖర్చులు అవుతాయి అని డాక్టర్స్ చెప్పగా సుబ్బారెడ్డి వాళ్ళ కుటుంబం చాలా నిరుపేద కుటుంబం కావడంతో అందరూ తమకు తోసిన సహాయం చేసి మా నాన్నను కాపాడవాల్సిందిగా కొడుకు కాటన్ రెడ్డి వేడుకోగా సహాయ నిధి దాతల ద్వారా 60000రూపాయలు సేకరించి ఈరోజు హన్మకొండ లోని హాస్పిటల్ లో పరామర్శించి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో సహాయం సభ్యులు ఝుఫీ ఫైజోద్దీన్ గడ్డం నరేందర్ తదితరులు పాల్గొన్నారు



# భద్రకాళి బండ్పైన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం




- **ఎన్సిసి పదవ తెలంగాణ బెటాలియన్ ఆర్మీ కమాండింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో**

**వరంగల్, 21 జూన్ (మనం న్యూస్)ః** వరంగల్ మహా నగరం లోని 'భద్రకాళి బండ్ పైన అంతర్జాతీయ యోగా దినోత్సవ) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎన్సిసి పదవ తెలంగాణ బెటాలియన్ ఆర్మీ వింగ్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్ఎస్ రామదురై తెలిపారు. సుమారు 300మంది ఎన్సిసి క్యాడేట్స్ వరంగల్ మహానగరంలోని పాఠశాలల నుండి ,కళాశాలల నుండి ఈ యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రూప్ కమాండర్ రాజేష్ నాయర్ పాల్గొన్నారు. భారతదేశ వారసత్వ సంపద యోగా అని ఎన్సిసి క్యాడేట్స్ ప్రజల్లో విస్తృతంగా యోగాసనాల ప్రాధాన్యతను ఆరోగ్య చిట్కాలను శిక్షణ పొంది పాఠశాలలు, కళాశాలలో, సమాజంలో మరింత ప్రజల్లో చైతన్యపరిచి ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి యోగాసనాలు ఎంతో ఉపయోగపడతాయని మన వేద కాలం నుండి పుట్టిన యోగాసనాలు నేడు ఐక్యరాజ్యసమితి గుర్తించి అంతర్జాతీయ యోగా దినోత్సవం 21న జరుపుకోవడం భారతీయులందరూ గర్వపడవలసిన సందర్భమని తెలిపారు.మరియు కల్నల్ ఎస్ఎస్ రామదురై యోగాసనాలను నిపుణులచే క్యాడేట్స్ చేత చేపించి వాటి ప్రాధాన్యత గురించి డ్రాయింగ్ రూపకంగా కాంపిటీషన్ నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ లెఫ్టెంట్ కల్నల్ రవి సునారే నిర్వహణ ఏర్పాట్లను దగ్గరుండి ఒక్కొక్క యోగాసనం ప్రాధాన్యతను వివరించారు. మరియు కాజీపేట మాన్ పోర్ట్ స్కూల్లో 600 మంది యోగాసన కార్యక్రమంలో కూడా గ్రూప్ కమాండర్ పాల్గొన్నారు అని కల్నల్ ఎస్ఎస్ రామాదురై తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే, అజీమ్ అలీ, ఎన్సిసి ఆఫీసర్లు క్యాడేట్స్ పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను సందర్శించిన సర్పంచ్

**మహాదేవపూర్, జూన్ 21మనం న్యూస్:** మహాదేవపూర్ మండల కేంద్రంలోని గ్రామ సర్పంచ్ హసీనా బాను ఈరోజు స్థానిక ఎస్సీ ఎస్టీ మరియుబీసీవిద్యార్థుల వసతిగృహాలను హాస్టళ్లనుసందర్శించారు. ఈసందర్శనలోభాగంగా, వారుహాస్టళ్లలోనిమౌలికసదుపాయాలు, విద్యార్థులకు పెడుతున్న భోజన నాణ్యతమరియు పరిసరాల పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూవిద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఉన్నతచదువులుచదివి గ్రామపేరునిలబెట్టాలనివిద్యార్థులకు సూచించారు. హాస్టళ్లలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమదృష్టికితీసుకురావాలని,గ్రామ పంచాయతీతరపునహాస్టళ్లకు అవసరమైన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుంగల శ్రీజ సంతోష్ గ్రామపంచాయతీపాలకవర్గంహాస్టల్ వార్డెన్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సర్పంచ్



**మహాదేవపూర్, జూన్ 21మనం న్యూస్:** మహాదేవ్పూర్ మండల కేంద్రంలోని ప్రపంచ యోగా దినోత్సవంసందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహాదేవపూర్ గ్రౌండ్స్లో నిర్వహించిన ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ హసీనాభానుదేశం ఆరోగ్యవంతంగా ఉండాలంటే పిల్లల నుండి పెద్దల వరకు ప్రతీ వ్యక్తిప్రతీరోజూకనీసంఒకఅరగంట యోగాసనాలు,ధ్యానం ప్రాక్టీస్చేస్తే హాస్పిటల్ పోవాల్సినఅవసరం లేదని అన్నారు.ఉప సర్పంచ్ శ్రీజ సంతోష్ వార్డు సభ్యులు గడ్డం స్వామి మహమ్మద్ బిన్ అలీ, అస్రార్ ఖురేషిబాలుర పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి యోగా వల్ల మనకు కలిగేప్రయోజనాలు వివరించారు.బాలికల పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యోగా దినోత్సవ ప్రాధాన్యత వివరించారు.తిరుపతిరెడ్డియోగాలోని వివిధ భంగిమల్లో ఆసనాలు వేసివిద్యార్థులతో చేయించారు. ప్రారంభం కార్యక్రమంలో రాజయ్య, మధు పిడిపూర్ణిమప్రాథమిక పాఠశాల మనోజ్ కుమార్, ఉపాధ్యాయులుఅనిల్ కుమార్, లీలారాణి,ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆచార్య జయశంకర్ వర్ధంతి వేడుకలలో పాల్గొన్న జిల్లా గ్రంధాలయ చైర్మన్



**మహాదేవపూర్ జూన్ 21మనం న్యూస్ః** మహాదేవపూర్ మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆచార్య జయశంకర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారుఆరు దశాబ్దాల తెలంగాణఉద్యమ చుక్కాని మలిదశ తెలంగాణ ఉద్యమనాయకులు తెలంగాణ జాతిపిత తెలంగాణ వాదాన్ని ప్రపంచానికి చాటిన మహా జ్ఞాని, తెలంగాణసిద్ధాంతకర్త ఉద్యమస్ఫూర్తిప్రదాతఆచార్యకొత్తపల్లిజయశంకర్ వర్ధంతిసందర్భంగావారి సేవలనుస్మరించుకుంటూ మహాదేవపూర్మండలంఉద్యమకారులమండల అధ్యక్షుడుఎండి అక్రమొద్దీన్ ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపం దగ్గర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లిజిల్లాగ్రంథాలయ చైర్మన్ కోటరాజబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆచార్య కొత్తపల్లి జయశంకర్ పూలమాలవేసిఘనంగా నివాళులుఅర్పించినారు. ఈ కార్యక్రమంలోటి యు ఎఫ్ రాష్ట్ర ఉద్యమకారుల అధికార ప్రతినిది ఎండిఅయుబోద్దీన్ , మండల కార్యదర్శికలి కోటదేవేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శిరాజు, సీనియర్ఉద్యమకారులు కారంగుల బాపురావు, జాడిగట్టయ్య, జనగాం పోశం, కుదురుపల్లి మాజీ సర్పంచ్ గట్టయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

# అడవిలో అక్షర కుసుమాలు

- **అక్షరాల ఆకాశంలో నక్షత్రాల్లా వెలుగుతున్న ఏజెన్సీ ప్రాంత విద్యా కుసుమాలు**



**ములుగు, జూన్ 21 మనం ప్రతినిధిః** తెలంగాణ రాష్ట్రంలో అత్యంత అటవీ ప్రాంతం, పూర్తిస్థాయి ఏజెన్సీ స్వరూపాన్ని కలిగి ఉన్న ములుగు జిల్లా ఒకప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిన ఈ ప్రాంతం నేడు ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అభివృద్ధి వైపు ఒక్కో మెట్టు ఎక్కుతూ ప్రగతి పథంలో ముందుకు సాగుతోంది. సంక్షేమం, మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఉపాధి వంటి అన్ని రంగాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుండగా విద్యారంగంలో ములుగు జిల్లా సాధిస్తున్న విజయాలు ఈ మార్పుకు స్పష్టమైన నిదర్శనంగా నిలుస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో తాజాగా వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా అత్యుత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రవ్యాప్తంగా అగ్రస్థానంలో నిలవడం ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యా రంగంలో వస్తున్న మార్పుకు ప్రతీకగా నిలిచింది. అడవుల నడుమ, దూర ప్రాంత గ్రామాల్లో చదువుతున్న విద్యార్థులు కూడా రాష్ట్రస్థాయిలో పోటీ పడగలమని నిరూపిస్తూ అసాధారణ ప్రతిభ కనబరిచారు. ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ తరగతులు, మెరుగైన బోధన, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి వంటి చర్యలు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విశ్వాసాన్ని పెంచుతున్నాయి. దీనికి నిదర్శనంగానే గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఒకప్పుడు ప్రైవేట్ విద్యాసంస్థల వైపు మొగ్గు చూపిన తల్లిదండ్రులు నేడు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్యను గుర్తించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. నాణ్యమైన విద్య అంటే కేవలం ప్రైవేట్ పాఠశాలలకే పరిమితం అనే భావనను ములుగు జిల్లా పూర్తిగా తుడిచిపెట్టేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అవసరమైతే వాటికంటే మెరుగైన విద్యను అందించవచ్చని ములుగు జిల్లా మరోసారి నిరూపించింది. దీనికి పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు సాధించిన విజయాలే ప్రత్యక్ష నిదర్శనం. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా 50 రోజుల యాక్షన్ ప్లాన్, నిరంతర పర్యవేక్షణ, ప్రత్యేక తరగతులు, ఉపాధ్యాయుల అంకితభావం కలిసి ములుగు జిల్లాను విద్యలో అగ్రస్థానానికి చేర్చాయి. 2026 పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రవ్యాప్తంగా అద్భుత ఫలితాలు సాధించింది. జిల్లా వ్యాప్తంగా 3,287 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 3,264 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 1,681 మంది బాలురు, 1,583 మంది బాలికలు ఉన్నారు. ఈ ఫలితాలతో జిల్లా అత్యున్నత ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ విజయగాథలో ప్రత్యేకంగా నిలిచిన పేరు కోరంకున్నత్ కృష్ణ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఈ విద్యార్థిని 589 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానం, రాష్ట్రంలో మూడవ స్థానం సాధించి ములుగు జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో నిలబెట్టింది. ఇది గిరిజన ప్రాంత విద్యార్థుల్లో ఉన్న అపార ప్రతిభకు నిదర్శనం. ఈ విజయాల వెనుక ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలు కీలక పాత్ర పోషించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక బోధన, ఉదయం-సాయంత్రం అదనపు తరగతులు, అంశాల వారీగా బలహీన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి, మాక్ టెస్టులు, ఉపాధ్యాయుల నిరంతర మార్గదర్శకత్వం వంటి చర్యలు ఫలితాలను ప్రభావితం చేశాయి. ఈ విజయ స్ఫూర్తిని కొనసాగిస్తూ రానున్న విద్యా సంవత్సరంలో కూడా 100 శాతం ఉత్తీర్ణత సాధించి ములుగు జిల్లా మరోసారి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క విద్యాశాఖ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పాఠ్య ప్రణాళిక ప్రకారం అన్ని పాఠ్యాంశాలను సమయానికి పూర్తి చేయాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన బోధన అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిలో భాగంగా పదో తరగతి విద్యార్థుల కోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తరగతుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నారు. అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ముఖ్యంగా గణితం, ఇంగ్లీష్, సైన్స్ వంటి సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. విద్యార్థుల్లో మరింత ప్రోత్సాహం కల్పించే దిశగా ఇటీవల ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 50 సైకిళ్లను పంపిణీ చేయడం జిల్లాలో విద్యకు ప్రోత్సాహం కల్పించే మరో విశిష్ట కార్యక్రమంగా నిలిచింది. అదేవిధంగా అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. మరింత ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ కనబరచాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ములుగు జిల్లా ప్రత్యేకత ఏమిటంటే ఒకప్పుడు విద్యకు దూరంగా ఉన్న అటవీ, గిరిజన ప్రాంతాల్లో నేడు విద్యా వెలుగులు విరజిమ్ముతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు కేంద్రాలుగా మారుతున్నాయి. ఉపాధ్యాయుల అంకితభావం, ప్రభుత్వ ప్రత్యేక కార్యాచరణ, విద్యార్థుల పట్టుదల కలిసి జిల్లాను విద్యలో అగ్రస్థానంలో నిలబెడుతున్నాయి. ఇది కేవలం ఫలితాల విజయమే కాదు ఇది ప్రజా ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యం, గిరిజన ప్రాంతాల్లో పెరుగుతున్న విద్యా చైతన్యం, ప్రభుత్వ పాఠశాలలపై పెరుగుతున్న విశ్వాసం, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల సంకల్పం కలిసి సాధించిన విజయగాథ. నేడు ములుగు జిల్లా నిజంగానే అడవిలో అక్షర కుసుమాలు అక్షరాల ఆకాశంలో నక్షత్రాల్లా వెలుగుతున్న ఏజెన్సీ ప్రాంత విద్యా కుసుమాలు ప్రజా ప్రభుత్వ విద్యా ప్రోత్సాహంతో విజయ పరంపర కొనసాగిస్తూ, 100 శాతం ఫలితాలతో మరోసారి రాష్ట్రంలో అగ్రస్థానాన్ని లక్ష్యంగా పెట్టుకున్న విద్యా ప్రస్థానం

## ఘనంగా జయశంకర్ వర్ధంతి

**భీమదేవరపల్లి, జూన్21మనం న్యూస్:** మేజర్ గ్రామపంచాయతీ ముల్కనూరులో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి ప్రజా సంఘ నేతలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రోజున ప్రజా గ్రంధాలయం ప్రాంగణంలో ప్రజాసంఘనేతలు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షను, సిద్ధాంతాలతో, రాష్ట్ర అవతరణ ఆవశ్యకతను ప్రపంచానికి చెప్పిన తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ అని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మలిదశ ఉద్యమ పోరాటంలో దిశా నిర్దేశం చేసి నిధులు నియామకాలు నీళ్లు తెలంగాణలో దోపిడీకి గురవుతున్నాయని అంశాలపైన స్పష్టమైన ఘనంగాలతో ప్రజల్లో చైతన్య తెచ్చిన మహనీయుడని అన్నారు. ఆశించిన సామాజిక తెలంగాణ సాధన దిశగా సమాజంలో అన్ని వర్గాలకు సమాన హక్కులు అవకాశాలు దక్కినప్పుడే నిజమైన నివాళ్ళని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు, ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



